అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 4-8-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 215 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

మూజువాణి ఓటుతో ఢిల్లీ బిల్లు ఆమోదం

వ్యతిరేకించిన ప్రతిపక్షాలు

- మద్దతు ఇచ్చిన వైసీపీ, హాజరుకాని టీడీపీ
- రాజ్యసభలో మూడు బిల్లులు ఆమోదం

వివరాలు 11లో..



రాజ్యాంగ వ్యతిరేకం

- మా పార్టీ వ్యతిరేకం : సీపీఐ(ఎం) 5లో..
- ఎన్నికైన ప్రభుత్వంపై పెత్తనమా? : బీఆర్ఎస్

ఇక మూడ్రోజులే అసెంబ్లీ...



మరికొద్ది నెలల్లో శాసనసభకు ఎన్నికలు జరగబోతున్న తరుణంలో ఆఖరి అసెంబ్లీ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. శీతాకాల సమావేశాల నాటికి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశముంది కాబట్టి ఈ సమావేశాలే దాదాపు చివరివి కానున్నాయి. సభ ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కాగానే.. కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న మరణం పట్ల సంతాప తీర్మానాన్ని సీఎం కేసీఆర్ ప్రతిపాదించి, ప్రసంగించారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు సంతాప తీర్మానంపై ప్రసంగించారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే విజయరామారావు మరణం పట్ల సభ సంతాపాన్ని వ్యక్తం చేసింది. అనంతరం స్పీకర్ సభను శుక్రవారానికి వాయిదా వేశారు. సభ ప్రారంభానికి ముందు మంత్రి కేటీఆర్, బీజేపీ సభ్యుడు ఈటల రాజేందర్ కాసేపు సరదాగా సంభాషించుకోవటం గమనార్హం. కాగా సమావేశాలను మూడు రోజులపాటు (ఆదివారం వరకూ) నిర్వహించాలని బీఏసీ నిర్ణయించింది. మరోవైపు శాసనసమండలిలో వర్షాలు, వరదలపై లఘు చర్చను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి... రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు.

సాయన్నకు నివాళి.. సభ నేటికి వాయిదా

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఇటీవల మృతిచెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే గడ్డం సాయన్న మృధుస్వభావి, వివాదరహితుడనీ, ఎప్పుడూ ముఖం మీద చిరునవ్వును చెదరనివ్వకుండా అందరితోనూ కలుపుగోలుగా ఉండేవారని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కొనియాడారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం ఉదయం 11:30 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ సమావేశమైన వెంటనే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనుమతితో సీఎం కేసీఆర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాయన్న నిజామాబాద్ జిల్లాలోని వల్లభాపూర్‌లో పుట్టారనీ, హైదరాబాద్‌లో వ్యాపారవేత్తగా స్థిరపడ్డారని చెప్పారు. 1983లో తొలిసారి రాజకీయాల్లోకి వచ్చి ఐదుసార్లు శాసనసభ్యులుగా, హుడా డైరెక్టర్‌గా, టీటీడీ పాలకమండలి సభ్యులుగా, ఇతర అనేక హోదాల్లో ఉన్నతమైన పదవులకు వన్నెతెచ్చారని కొనియాడారు. ఆయనతో తనకు వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉండేదన్నారు. సాయన్న లేని లోటు తీరనిదన్నారు. ఆయన కూతురు లాస్యనందిత సైతం జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా సేవలందించారని గుర్తుచేశారు. సాయన్న కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి ...5లో

ప్రతిపక్షాలవి బురద రాజకీయాలు...

- అధికారంలో ఉన్నప్పుడు చేసిందేమీ లేదు...
- కేసీఆర్....ఫోటోలకు ఫోజులిచ్చే నాయకుడు కాదు
- అనుకోని విపత్తు... అప్రమత్తతతో నష్టాన్ని గణనీయంగా తగ్గించాం : మండలిలో మంత్రి వేముల



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేయని ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రస్తుతం బురద రాజకీయం చేస్తున్నారని రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో అత్యధిక వర్ష పాత పర్యవసనాలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై గురువారం మండలిలో లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా ...11లో



చర్చలకు సమయం చాలదు

స్పీకర్‌కు లేఖ రాస్తాం :మల్లు భట్టి విక్రమార్క 3లో..



మోడీ దేశానికి ప్రధానా...? గుజరాత్‌కా...?

- రాష్ట్రానికి రాకపోయినా ఫర్వాలేదు...పదేండ్లుగా సాయమైనా చేయరా? : శాసనమండలిలో అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మోడీ దేశానికి ప్రధానమంత్రా..? లేక గుజరాత్ రాష్ట్రానికి మాత్రమేనా? అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో అత్యధిక వర్షపాత పర్యవసనాలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై గురువారం శాసనమండలిలో లఘు చర్చను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుజరాత్‌లో వరదలొస్తే ప్రధాని మోడీతో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అక్కడ పర్యటించారని గుర్తుచేశారు. తెలంగాణలో కూడా వరదలొచ్చాయనీ, కానీ ఇక్కడికి మోడీ రాలేదని తెలిపారు. ప్రధాని ఇక్కడికి రాకపోయినా ఫర్వాలేదు... కానీ సాయం చేయాలని డిమాండ్ చేశారు. సాయం చేస్తే ఆదుకునే చర్యలను ఇక్కడున్న వారు చూసుకుంటారని సూచించారు. రాష్ట్ర విపత్తు సహాయ నిధిలో రూ.800 కోట్లు ఉన్నాయనీ, అందులో కేవలం 10 శాతం అంటే రూ.80 కోట్లు మాత్రమే వాడుకునే ...11లో

ఐఆర్ ఎంతిద్దాం..!

ఆర్థిక శాఖ అధికారులతో కేసీఆర్ సమాలోచన

- 14 శాతంలోపు ప్రకటించే అవకాశం
- నేడో, రేపో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- పీఆర్సీ కమిటీ ఏర్పాటుకు సీఎం అంగీకారం
- ఈహెచ్ఎస్ అమలుకు సానుకూలత
- సీపీఎస్‌ను రద్దు చేయాలి :ముఖ్యమంత్రికి ఉద్యోగ జేఏసీ వినతి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) కమిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అంగీకరించారు. మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రకటించాలని నిర్ణయించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలుకు సానుకూలత వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఐఆర్ ఎంత ప్రకటిస్తారన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. అయితే ఐఆర్ ఎంత ప్రకటించాలన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. ఆర్థిక శాఖ అధికారులతో సీఎం కేసీఆర్ ఐఆర్ ఎంత ఇస్తే రాష్ట్ర ఖజానాపై ఎంత భారం పడుతుందన్న సమాలోచనలు చేస్తున్నారు. తెలంగాణ తొలి పీఆర్సీలో ఐఆర్ లేకుండానే నేరుగా 30 శాతం ఫిట్‌మెంట్‌ను సీఎం ప్రకటించారు. కానీ ఈసారి ఐఆర్‌ను ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. అందుకే ఐఆర్ ఎంతివ్వాలన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇంకోవైపు ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్‌కు ఇప్పుడు నెలకు రూ.నాలుగు వేల కోట్లు ఖర్చవుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రాబడి, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అయ్యే ఖర్చును కూడా అంచనా వేయాల్సి ఉంటుంది. మరోవైపు సీఎం కేసీఆర్ ఇటీవలే ప్రకటించిన బీసీలకు రూ.లక్ష, మైనార్టీలకు రూ.లక్ష సాయంతోపాటు రైతు రుణమాఫీకి రూ.20 వేల కోట్ల వరకు ఖర్చు కానుంది. ఈ నేపథ్యంలో ఐఆర్ ఎంతివ్వాలనే దానిపై ఆర్థిక శాఖ అధికారులతో సీఎం సంప్రదింపులు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని సీఎం నిర్ణయాన్ని ప్రకటించే అవకాశమున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం 14 శాతంలోపు ఐఆర్ ...11లో

సున్నం రాజయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

ఆయన ఆశయ సాధనకు పునరంకితమవుదాం

- తృతీయ వర్ధంతి సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు




నవతెలంగాణ – భద్రాచలం

సున్నం రాజయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని, రాజయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మాజీ ఎమ్మెల్యే, ఏజెన్సీ ముద్దుబిడ్డ, అమరజీవి కామ్రేడ్ సున్నం రాజయ్య తృతీయ వర్ధంతి సభ పార్టీ భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన గురువారం చందర్రావు భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీతి, నిజాయితీ, నిబద్ధత, నిర్మాణ దక్షిత గల ఆదర్శనీయుడు రాజయ్య అని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు పనిచేసిన రాజయ్య.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరాడంబరంగా జీవించారని తెలిపారు. నియోజకవర్గంలో చెరువులు, రోడ్లు, భవనాలు, విద్యా వైద్యం, తాగు–సాగు నీరు.. తదితర మౌలిక సౌకర్యాలు ప్రజలకు అందించడంలో కృషిచేశారన్నారు. ఈ నియోజకవర్గానికి సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలుగా ముర్ల ...11లో

కాంగ్రెస్‌లోకి జూపల్లి

ఖర్గే సమక్షంలో చేరిక

- మాజీ ఎమ్మెల్యే గుర్నాథరెడ్డి తదితరులు కూడా



న్యూఢిల్లీ : మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు కొడగంల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి కుమారుడు రాజేష్, కొడంగల్ మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్ రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, రిటైర్డ్ ఎఎస్పీ నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గురువారం నాడిక్కడ ఏఐసీసీ ...11లో

అక్రమ మైనింగ్‌లో బ్రిజ్ భూషణ్

విచారణ జరపనున్న ఎన్‌జీటీ



న్యూఢిల్లీ : బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ గుర్తున్నారా? మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు రావడం, ఆయనపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెజ్లర్లు రాజధానిలో రోజుల తరబడి నిరసన తెలపడం గుర్తుండే ఉంటుంది. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఆయన అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని ఫిర్యాదులు వచ్చాయి. ఇందులోని వాస్తవాలను తెలుసుకొని, తగిన చర్యలు చేపట్టేందుకు జాతీయ హరిత ట్రిబ్యునల్ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కేసర్‌గంజ్ ఎంపీ అయిన బ్రిజ్ భూషణ్ గోండా జిల్లా తరాబ్‌గంజ్...11లో

వలస కార్మికులకు హిందూత్వ శక్తుల బెదిరింపులు

- హర్యానాను వీడుతున్న వందలాది మంది



చండీగఢ్ : హర్యానాలో నివసిస్తున్న వందలాది మంది ముస్లిం వలస కార్మికులు భయాందోళనలో ఉన్నారు. ఈ వారం ప్రారంభంలో నుహ్ జిల్లాలో మత ఘర్షణల తర్వాత చెలరేగిన హింస కారణంగా వందలాది మంది ముస్లిం వలస కార్మికులు ఇక్కడి నుంచి పారిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వలస వచ్చిన వారు వెళ్లిపోవాలంటూ బెదిరింపులు వచ్చాయి. నుహ్‌లో కర్ఫ్యూ కారణంగా కార్మికులు వెళ్లిపోవడానికి కూడా పరిస్థితులు క్లిష్టంగా మారాయి. వారిలో చాలా మంది హింసాత్మక జిల్లా నుంచి పారిపోయే ప్రయత్నంలో అల్వార్ లేదా సోహ్నా వైపు వెళ్తున్నట్టు ఒక వార్తాపత్రిక వెల్లడించింది.సోమవారం విశ్వ హిందూ పరిషత్ ఊరేగింపును నిలిపివేసిన తర్వాత నుహ్‌లో చెలరేగిన హింసలో ఇద్దరు హోంగార్డులు, ఒక ఇమామ్‌తో సహా కనీసం ఆరుగురు మరణించిన విషయం విదితమే. నూహ్‌కు పొరుగున ఉన్న జిల్లాలకు హింస వ్యాపించడంతో, గురుగ్రామ్‌లో ఒక మసీదు దహనానికి గురైంది. అలాగే, ముస్లిం వలస కుటుంబాలను ఖాళీ చేయాలని హిందూత్వ శక్తులు బెదిరించాయి. అటు తర్వాత వాటిని తగులబెట్టారు. "మంగళవారం రాత్రి కొందరు వ్యక్తులు మోటారు సైకిళ్లపై వచ్చారు. మేము ఇక్కడి నుంచి వెళ్లకపోతే వారు మా వాడకు నిప్పు పెడతామని బెదిరించారు" అని వలస రిక్షా డ్రైవర్ రెహ్మత్ అలీ తెలిపాడు. "రాత్రి నుంచి ...5లో

10.36 కోట్ల జన్‌ధన్ ఖాతాల్లో

జీరో లావాదేవీలు



వివరాలు 5లో..

కొత్త మెనూకు బడ్జెట్‌ను కేటాయించండి

అప్పటివరకూ పాతమెనూనే కొనసాగిస్తాం

- పెరిగిన వేతనాలు తక్షణమే ఇవ్వాలి
- మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి కొత్త మెనూకు సంబంధించిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేటాయించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. అప్పటి వరకూ పాతమెనూనే కొనసాగించాలనీ, కార్మికులకు పెరిగిన వేతనాలను వెంటనే ఇవ్వాలని కోరింది.

ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విద్యా శాఖామంత్రి సబిత ఇంద్రారెడ్డికి తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 54,201 మంది మధ్యాహ్న భోజన కార్మికులు వంట నిర్వహణలో పని చేస్తున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వొద్దని కోరారు. పెరిగిన నిత్యావసరాల ధరలతో పోల్చితే కేటాయించిన బడ్జెట్ సరిపోవడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్ల బిల్లులు విడుదల చేయాలనీ, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కొత్త మెనూను (రాగి జావ, మిక్స్‌డ్ వెజిటబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ) పెట్టాలని పాఠశాలల్లో ఒత్తిడి చేయడం తగదని పేర్కొన్నారు. ఇప్పటివరకు వండిపెట్టిన వాటికే బిల్లులు రాలేదని వాపోయారు. కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించకుండా వండిపెట్టడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలనీ, అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీకి ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గుర్తింపు కార్డులను ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి : జేవీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, సమాన పనికి సమాన వేతనమివ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 40 శాఖల్లో సుమారు 1,40,000 మంది పనిచేస్తున్నారనీ, సివిల్ సప్లయ్, రెవెన్యూ, విద్యాశాఖల్లో పని చేసే సిబ్బందికి రెన్యూవల్ చేయకపోవడం వల్ల నెలల తరబడి వారి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. జీవో నెంబర్ 60 విడుదలై రెండేండ్లు దాటుతున్నా నేటికీ అనేక శాఖల్లో అమలుకు నోచుకోవడం లేదన్నారు. 20 ఏండ్ల నుంచి అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు యూనివర్సిటీలు, వైద్యారోగ్య, గ్రామ పంచాయతీ, కేంద్ర - రాష్ట్ర పథకాల్లో పనిచేసేవారినీ, ఆయా శాఖల్లో ఏజెన్సీల ద్వారా రిక్రూట్ చేసిన ఉద్యోగులతో సహా అందర్నీ పిఆర్‌సి జీఓ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు.

పాలిటెక్నిక్ కళాశాల్లో పనిచేసే 200 మంది నాన్‌టీచింగ్ సిబ్బందిని వెంటనే రెన్యూవల్ చేయాలని కోరారు. టెర్మినేట్ చేసిన 23 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనంతో పాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా మొదటి వారంలో జీతాలు చెల్లించేలా చూడాలని సీఎస్‌ను కోరారు. పెండింగ్ వేతన బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని రెగ్యులరైజ్ చేయాలని సీఎస్‌ను కోరారు.

అవయవదానంతో మరణించి జీవించే అవకాశం

దేశంలోనే తొలి స్థానంలో రాష్ట్రం : వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

- అవయవదాతల కుటుంబీకులకు సన్మానం



నవతెలంగాణ-కల్చరల్

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి శరీర అవయవాలు ఎనిమిది మందికి ప్రాణం పోస్తాయని ఆ రకంగా మరణించి కూడా జీవించే అవకాశం అవయవ దానంతో సాధ్యమని వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అవయవ దానం పట్ల కొందరిలో ఇంకా అపోహలు, మూఢ నమ్మకాలు ఉన్నాయని, కానీ ఎలాంటి సంశయం అవసరం లేదని చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వ జీవన్‌దాన్ నిర్వహణలో 13వ జాతీయ అవయవదాన దినోత్సవం కార్యక్రమం గురువారం హైదరాబాద్ రవీంద్రభారతి ప్రధాన వేదికపై నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవ దాతల కుటుంబ సభ్యులు 105 మందిని మంత్రి సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అవయవ దానంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే తొలి స్థానంలో ఉందని, ఇది మనందరికీ గర్వకారణం అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందన్నారు. అధిక ధూమపానం, మద్యపానం వల్ల లివర్, కిడ్నీ, సమస్యలు వస్తాయని చెప్పారు. జీవన శైలిలో యోగ, శారీరక వ్యాయామం వల్ల రక్తపోటు, చెక్కర వ్యాధులు రాకుండా చూసుకోవచ్చని, శరీరాన్ని, గుండెను కాపాడుకోవచ్చని అన్నారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. ఏ అనారోగ్య సమస్యకైనా ప్రభుత్వ వైద్యశాలలో ఉత్తమ చికిత్స లభిస్తుందని తెలిపారు. వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ కె.రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా కిడ్నీ, లివర్, హార్ట్, లంగ్స్ అవయవ మార్పిడికి అనుమతిచ్చిందన్నారు. అవయవ మార్పిడిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు జీవన్ దాన్ ద్వారా చేపట్టామని తెలిపారు. 2013 నుంచి ఇప్పటి వరకు 4829 వివిధ అవయవాల మార్పిడి జరిగిందని వివరించారు. వివిధ అవయవ మార్పిడీల కోసం 3089 మంది వేచి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ వాణీదేవి, కార్పొరేటర్ విజయారెడ్డి, ఉస్మానియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, గాంధీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మనుగడపై చర్చించండి

- మండలి చైర్మెన్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనమండలి సమావేశాల్లో పాఠశాలల మనుగడపై చర్చించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, చీఫ్‌విప్ భానుప్రసాదరావును గురువారం కలిసి లేఖ సమర్పించానని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలల మనుగడ కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని సూచించారు. రాష్ట్రంలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), ఇతర విద్యాసంస్థలు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులకు ఆర్టికల్ 39 ప్రకారం కనీస వేతనాల చెల్లింపుపై చర్యలు చేపట్టాలని కోరారు.

రేషన్ డీలర్ల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

మంత్రి గంగుల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ డీలర్ల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులతో సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయా ప్రతినిధులు మాట్లాడుతూ రేషన్ పోర్టబులిటీ తదితర కారణాలతో గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్ డీలర్లు గణనీయంగా ఆదాయాన్ని కోల్పోయారని తెలిపారు. వారికి గౌరవప్రదమైన కమిషన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు, గ్రా మీణ, మున్సిపల్, కార్పోరేషన్ పరిధిల్లో ని రేషన్ డీలర్లకు సమ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.

వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- జీవో 98ని సవరిస్తూ నోటిఫికేషన్ ఇవ్వాలి : ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎక్సైజ్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలనీ, అందులో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా విడుదల చేసిన జీవో 98ని సవరించి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య గురువారం ఒక ప్రక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో ప్రకారం గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీ 10 శాతం ,ఎస్టీ 5 శాతం షాపులు కేటాయించాలని ప్రభుత్వం పేర్కొన్నట్టు తెలిపారు. దీనిలో ఎక్కడ కూడా వికలాంగులకు రిజర్వేషన్ అమలు చేయాలని పేర్కొనలేదనీ, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో వారికి ఐదు శాతం కేటాయించాలని విడుదల చేసిన జీవో 1కి ఇది భిన్నంగా ఉందని తెలిపారు. ఆ రకంగా మద్యం పాలసీ వికలాంగుల తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు.

మా సేవలను క్రమబద్ధీకరించాలి


- మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నామనీ, తమ సేవలను క్రమబద్ధీకరించాలని మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని మత్స్యభవన్ ముందు కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రమేశ్ నాయకత్వంలో ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరేండ్లుగా సేవలందిస్తున్నట్టు తెలిపారు.

ప్రత్యామ్నాయ ఆర్థిక ప్రణాళికలు రూపొందించాలి

- ప్రతిపక్షాలు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి :ఎస్వీకే వెబినార్‌లో ఆర్థికరంగ విశ్లేషకులు డీ పాపారావు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న దోపిడీ ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించి, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉందని ప్రముఖ ఆర్థికరంగ విశ్లేషకులు డీ పాపారావు అభిప్రాయపడ్డారు. ప్రజల్లో వాటిపై చర్చ జరిగితేనే చైతన్యవంతులు అవుతారనీ, ఆ బాధ్యతల్ని ప్రతిపక్ష రాజకీయపార్టీలు తీసుకోవాలని సూచించారు. గురువారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'ప్రయివేటు రంగానికి గనులు, ఖనిజాలు పార్లమెంటు ఆమోదం-పర్యవసానాలు' అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. పార్లమెంటులో ప్రతిపక్షాలు మణిపూర్ సంక్షోభంపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న తరుణంలో, దాన్ని అవకాశంగా తీసుకొని కేంద్రం ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నదని తెలిపారు. దేశానికి, దేశ ప్రజలకు అత్యంత ప్రమాదకరమైన లిబరలైజేషన్, ప్రయివేట్రైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్పీజీ)ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు. దేశంలో ఇప్పటికే 95 రకాల మినరల్స్ ఉంటే, వాటిని లైసెన్స్‌డ్ కాలంలో సక్రమంగా వినియోగించుకోలేకపోయామనే వాదనలు ఉన్నాయని చెప్పారు. జాతీయ భద్రత కోసం ఈ ఖనిజాలను ప్రభుత్వమే వినియోగించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో బ్యాటరీల తయారీకి విదేశాలపై ఆధారపడకుండా, స్వదేశంలోని ఖనిజాలను వినియోగించుకోవాలని నిర్ణయించారన్నారు. అయితే ఇవి ఎంతమాత్రం స్వదేశీ విధానాలు కావన్నారు. పైగా స్వదేశంలోని చిన్న, మధ్య తరగతి పారిశ్రామికవేత్తలు తీవ్రంగా దెబ్బతిన్నారని విశ్లేషించారు. కేవలం అదానీ, అంబానీలను మాత్రమే పోషిస్తున్నారని చెప్పారు. అదానీకి ఆస్ట్రేలియా నుంచి బొగ్గు గనులు ఇప్పించేందుకు స్వయంగా ప్రధానమంత్రే ఎస్‌బీఐ ద్వారా ఆర్థిక సహకారాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆర్థికవనరులు, దేశసంపదను కొద్దిమందికి కొల్లగొట్టి, అప్పగించడం కోసం కేంద్ర ప్రభుత్వం తాపత్రయపడుతున్నదనీ, ఇది అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రయివేటురంగం పర్యావరణాన్ని పట్టించుకోదనీ, దానికి కేవలం లాభాలు మాత్రమే కావాలన్నారు. ప్రపంచం గ్లోబల్ వార్మింగ్ దశ నుంచి గ్లోబల్ బాయిలింగ్ దశకు చేరినట్టు ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని తెలిపారు. దేశంలోకి కొత్తగా ఎలాంటి పరిశ్రమలు, పెట్టుబడులు రావట్లేదని చెప్పారు. ఖనిజ సంపద అధికంగా ఉన్న ఆఫ్రికా దేశాల్లో మైనింగ్ మాఫియా విజృంభిస్తున్నదనీ, ఆకలి, దారిద్ర్యంతో అక్కడి ప్రజలు అల్లాడుతున్నారని అన్నారు. అమెరికా వంటి దేశంలో ప్రస్తుతం మార్కెట్ విధానం వెళ్లిపోయి, పారిశ్రామిక విధానాలు అమల్లోకి వస్తున్నాయనీ, చైనాతో పోటీని తట్టుకొని నిలబడాలంటే అమెరికాకు అది అవసరమని విశ్లేషించారు. ప్రజా సంక్షేమంలో ప్రభుత్వ పాత్ర పెరగాలని అభివృద్ధి చెందిన దేశాల్లో డిమాండ్లు ముందుకొస్తున్నాయని చెప్పారు. సోవియట్ యూనియన్‌లోని లేబర్ ప్లానింగ్ విధానం ఇప్పుడు ప్రపంచానికి అవసరం అనీ, ఆర్థికవేత్తలు దీనిపై దృష్టి పెట్టాలని 'మింట్' పత్రిక పేర్కొందని ఉదహరించారు. హిమాలయాల్లో మంచు కరిగిపోయి, తీవ్రమైన పర్యావరణ విఘాతం జరుగుతున్న సమయంలో గనుల్ని ప్రయివేటుకు అప్పగించడం పెను ప్రమాదాలను సూచిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

రుణమాఫీ కోసం రూ. 167.59 కోట్లు విడుదల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తొలివిడత రుణమాఫీ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 167.59 కోట్లు విడుదల చేసింది. రూ.37వేల నుంచి రూ.41వేల మధ్య ఉన్న రుణాలను మాఫీ చేసింది. గురువారం ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో 44,870 మంది రైతులకు లబ్ధిచేకూరిందని పేర్కొన్నారు.

రైతు బీమా కోసం కొత్త దరఖాస్తులు అప్‌లోడ్ చేయండి

రైతు బీమాకు గడువు ముగుస్తున్న నేపథ్యంలో వెంటనే కొత్త వచ్చిన దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. సేంద్రీయ ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులను మరింత ప్రోత్సహించాలని ఒక ప్రకటనలో కోరారు. పంటల సాగు వివరాలు వెంటనే తెలపాలని ఆదేశించారు. వరి, కంది, పంటలు ఈ నెలాఖరు వరకు, మిరప సెప్టెంబరు మొదటి వారం వరకు సాగు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. గురువారం ఈమేరకు సచివాలయంలో అన్ని జిల్లాల డీఏవో, డీహెచ్ఎస్‌వో, ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రత్యేక కమిషనర్ హన్మంతు కొండిబ, ఆగ్రోస్ ఎండీ రాములు, ఏడీడీ విజయ్‌కుమార్, ఉద్యానశాఖ జేడీ సరోజి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముందు యూత్ కాంగ్రెస్ ఆందోళన

- ఉద్రిక్తత.. నేతల అరెస్టు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై యూత్ కాంగ్రెస్ శుక్రవారం ఆందోళన చేపట్టింది. నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని, ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ క్రమంలో అసెంబ్లీలోకి దూసుకుపోవడానికి యూత్ కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. గన్‌పార్కు వద్ద నడిరోడ్డుపైనే యూత్ కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. రెండు గ్రూపులుగా వచ్చిన నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. అసెంబ్లీ వైపు దూసుకొస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డితో పాటు నగర అధ్యక్షుడు మోటా రోహిత్, ఇతర నేతలను అరెస్టు చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వడంలో, ఉద్యోగాలను భర్తీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని వారు ఈ సందర్భంగా విమర్శించారు.

వరద బాధితులకు టీడీపీ చేయూత

- మృతుల కుటుంబాలకు రూ.10 వేలు
- నిత్యావసర సరుకులతో ప్రత్యేక వాహనాలు :కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-హైదరాబాద్

భారీ వర్షాలతో వరద ముంపు ప్రాంతాల్లో నిరాశ్రయులైన ప్రజలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ప్రకృతి విపత్తులో సర్వస్వం కోల్పోయిన బాధితులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులను అందించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే తమ ఉద్దేశమన్నారు. గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్ నుంచి రాష్ట్రంలోని వరద ముంపు ప్రాంతాలైన భూపాలపల్లి, ములుగు జిల్లాల బాధిత ప్రజలకు టీడీపీ ఆధ్వర్యంలో పంపిణీ చేసే దుప్పట్లు, బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల వాహనాలను కాసాని పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వరద ముంపుతో ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం కొండాయి, మాల్యాల, పసర, దొడ్డంపి, భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామాలు పూర్తిగా దెబ్బతిని ప్రాణ, ఆస్తి నష్టం జరిగాయన్నారు. ఈ గ్రామాల్లో నిరాశ్రయులైన ప్రజలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు రెండు బందాలుగా ఏర్పడి స్థానిక నాయకులు, శ్రేణులతో కలిసి వరద ముంపు బాధిత ప్రజలకు 15 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. నిత్యావసర సరుకుల్లో దుప్పట్లు, బియ్యం, ఉప్పు, పప్పు, మంచినూనె, మిరపకాయలు, చింతపండు ఉంటాయన్నారు. వరద ఉధృతిలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 వేల రూపాయలను అందించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం టీడీపీ రూ. 15 లక్షలను ఖర్చు చేస్తున్నట్టు ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ క్రమ శిక్షణ కమిటి సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, జక్కిలి ఐలయ్య, అజ్మీరా రాజు నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొల్కంపల్లి అశోక్, నల్లగొండ, జహీరాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు కసిరెడ్డి శేఖర్ రెడ్డి, పైడి గోపాల్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి బిక్షపతి ముదిరాజ్, పుట్టి రాజు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రక్షక్‌దళం వరద సహాయం

- ఎమ్మెల్యే సీతక్కకు అందజేత



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో ములుగు నియోజక వర్గ ప్రాంతం అతలాకుతలం అయిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే సీతక్క సహాయ, పునరావాస కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరదల్లో పుస్తకాలు కొట్టుకుపోయిన విద్యార్థులకు సహాయం చేయడం కోసం బీసీ యువసే రక్షక్ దళం సభ్యులు గురువారం ఎమ్మెల్యే సీతక్కను కలిసి లక్ష రూపాయల చెక్కును అందచేశారు. ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులమై తమ వంతుగా ఈ సహాయం చేసినట్టు 26 బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో బీసీ యువసేన జాతీయ సమన్వయకర్త పెచ్చటి మురళీ రామకృష్ణా రెడ్డి, రక్షక్ దళం సభ్యులు గుత్తుల రమణమూర్తి, గుబ్బల వెంకటరమణ, వాసంశెట్టి నాగార్జున, మద్దూరి రాజు, సాగ బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం పునర్జన్మనిస్తుంది

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అమ్మ జన్మనిస్తుంది.. అవయవ దానం పునర్జన్మనిస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి తెలిపారు.గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో 13వ జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవయవదానం వల్ల ఒక్కరే పదుల సంఖ్యలో జీవితాలను నిలబెట్టవచ్చనే నిజం తెలుసుకోవాలన్నారు. 2022 సంవత్సరంలో బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలను దానం చేయడంలో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానంలో నిలిచిందని తెలిపారు. అవయవ మార్పిడి శస్త్ర చికిత్సల్లోనూ మొదటి స్థానంలో ఉన్నామని పేర్కొన్నారు. దీనికి గుర్తింపుగా కేంద్రం ప్రభుత్వం తెలంగాణకు 'స్టేట్ విత్ హయ్యెస్ట్ నంబర్ ఆఫ్ డీసీజ్డ్ డోనర్స్' అవార్డును ప్రకటించిందని గుర్తుచేశారు. అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవన్‌దాన్ అనే సంస్థను ఏర్పాటు చేసిందని తెలిపారు. అవయవాలు కావాల్సిన వారు ఈ సంస్థలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.



పిల్లలతో కలిసి తిరిగితే ఎట్లన్న!

జగ్గన్నపై కేటీఆర్ సరదా వ్యాఖ్య

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ లాబీల్లో మంత్రి కేటీఆర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మధ్య సరదా చర్చ జరిగింది. టీషర్ట్‌లో ఉన్న జగ్గారెడ్డిని చూసి పిల్లలతో కలిసి తిరిగితే ఎట్లన్న..? అని కేటీఆర్ సరదాగా వ్యాఖ్యానించారు. టీషర్ట్ వేసుకుంటే పిల్లలవుతారా? అని జగ్గారెడ్డి అడిగారు. అప్పటికే జగ్గారెడ్డితో టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్ కలిసి ఉండగా, మీ ఇద్దరికి ఎక్కడ దోస్తాన్ కుదిరింది అని కేటీఆర్ అడిగారు. దీంతో మాది ఒకే కంచం, ఒకే మంచమని మామిళ్ల రాజేందర్ జవాబిచ్చారు. అయితే జగ్గారెడ్డిని గెలిపిస్తావా..? అని కేటీఆర్ ప్రశ్నించగా, సంగారెడ్డిలో జగ్గారెడ్డిని గెలిపిస్తా.. మన దగ్గరకు పట్టుకొస్తా అని రాజేందర్ సరదాగా వ్యాఖ్యానించారు.



మోడీకి తెలంగాణ కనిపించడం లేదా?

- బీజేపీ పాలిత రాష్ట్రాలకే నిధులిస్తారా...
- కేంద్రం నుంచి వరదసాయం ఏదీ
- మండలిలో బీఆర్ఎస్ సభ్యుల ఆవేదన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాన మంత్రి మోడీకి తెలంగాణ కనిపించడం లేదా?అని బీఆర్ఎస్ సభ్యులు బండ ప్రకాశ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తాత మధు ప్రశ్నించారు. భారత్‌లో తెలంగాణ భాగం కాదా?అని అడిగారు. ప్రకృతి విపత్తులు, భారీ వర్షాలు, వరదలొస్తే బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్‌కే నిధులిస్తారా? అంటూ నిలదీశారు. తెలంగాణ పట్ల ఎందుకు వివక్ష చూపుతున్నారని సూటిగా ప్రశ్నించారు. శాసనమండలి వర్షాకాల సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్సీ వేదాల వెంకట నరసింహాచారి మరణం పట్ల మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం శాసనమండలికి కొత్తగా ఎన్నికైన బీఆర్ఎస్ సభ్యులు దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రామ్‌రెడ్డి, ఎంఐఎం సభ్యుడు మీర్జా రహమత్ బేగ్, బీజేపీ సభ్యుడు ఏవీఎన్ రెడ్డిని పరిచయం చేశారు. అనంతరం రాష్ట్రంలో అత్యధిక వర్షపాత పర్యవసానాలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై లఘు చర్చ ప్రారంభమైంది. ఈ అంశంపై బీఆర్ఎస్ సభ్యులు ప్రకాశ్, రవీందర్‌రావు, తాత మధు మాట్లాడుతూ భారీగా కురిసిన ఈ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. అయినా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, అధికారులు నిద్ర, ఆహారం మాని ప్రజలకు అండగా ఉన్నారని అన్నారు. బాధితులకు రక్షణగా నిలబడ్డారని వివరించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. మోరంచపల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా ఆరుగురిని భూపాలపల్లిలోని సురక్షిత ప్రాంతాలకు తరలించామని వివరించారు. రోడ్లు దెబ్బతిన్నాయనీ, ఇండ్లు నీట మునిగాయనీ, పశువులు, పలు వాహనాలు కొట్టుకుపోయాయని చెప్పారు. అయితే గతనెల 31న నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తక్షణ సహాయ, పునరుద్ధరణ కోసం ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేసిందన్నారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్షతను ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. 2020లో వరదలు వచ్చినపుడు సాయం చేయలేదని గుర్తు చేశారు. ఇంకోవైపు బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై రాళ్లు వేస్తున్నారనీ, విమర్శలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలను, తెలంగాణను గాలికొదిలేయకుండా కేంద్రం కాపాడాలనీ, విపత్తుల సమయంలో సహాయం అందించి తక్షణమే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ నాయకులు, ఆ పార్టీ ఎంపీలు కేంద్రం నుంచి నిధులు తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఎంఐఎం సభ్యుడు మీర్జా రహమత్ బేగ్ మాట్లాడుతూ తాను డ్రైవర్‌గా పనిచేసినా ఎమ్మెల్సీగా అవకాశమివ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా పాతబస్తీలోని ప్రజలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ, వాటిని పరిష్కరించాలని కోరారు. నల్లగొండ చౌరస్తా నుంచి సంతోష్‌నగర్ ఓవైసీ ఆస్పత్రి వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జీ పనులను వేగవంతం చేసి పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

వరద సాయం రూ.10 వేల కోట్లకు పెంచాలి : జీవన్‌రెడ్డి

వరద సాయం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ.500 కోట్లు ఏమాత్రం సరిపోవనీ, దాన్ని రూ.10 వేల కోట్లకు పెంచాలని కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని కోరారు. బాధితులు, నిస్సహాయులకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా భూముల ఆనవాళ్లు లేకుండా పంట పొలాల్లోకి ఇసుక మేటలు వచ్చాయని అన్నారు. వాటిని తొలగించేందుకు ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కడెం ప్రాజెక్టుకు 18 గేట్లు సరిపోవడం లేదనీ, అదనపు గేట్లు అమర్చాలని సూచించారు. కుట్టి ప్రాజెక్టును నిర్మించాలని కోరారు. గతేడాది వరదల సమయంలో భద్రాచలానికి సీఎం కేసీఆర్ వచ్చి రూ.వెయ్యి కోట్లు ప్రకటించినా, ఇంత వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. తెలంగాణ పట్ల కేంద్రానికి వివక్ష ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సాయం తీసుకోవాలని సూచించారు. ఈ సమయంలో బీఆర్ఎస్ సభ్యులు కవిత జోక్యం చేసుకుని పార్లమెంటులో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్ని ప్రశ్నించడం లేదన్నారు. భానుప్రసాదరావు రన్నింగ్ కామెంటరీ చేస్తే 'మీరు చీఫ్ విప్. అది మరిచిపోవద్దు'అంటూ చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చురకలంటించారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తుంటే బీఆర్ఎస్ సభ్యులు తనను అభినందించాల్సింది పోయి ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని జీవన్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రశ్నించారు.

ఫారెస్ట్ అధికారి శ్రీనివాసరావు హత్య కేసులో..

ఇద్దరికి జీవిత ఖైదు

ఏడు నెలల్లోపే విచారణ పూర్తి చేసిన పోలీసులు



(ఫైల్)

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసరావు హత్య కేసులో ఇద్దరు నిందితులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సంచలన తీర్పు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం చంద్రుగొండ రేంజ్ రావికంపాడు సెక్షన్ శిక్షణ ఆఫీసర్ తేజావత్ రామారావు, చంద్రుగొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావుతో కలిసి 2022 నవంబర్ 22న పోకలగూడెం అటవీ ప్రాంతంలోని ప్లాంటేషన్ పనులు పరిశీలించి తిరిగి వెళుతున్న సమయంలో రావికంపాడు బేస్ క్యాంపు వాచర్లు.. ప్రసాద్, భుక్య రాములు ఫోన్ చేసి.. ఎర్రబోడుకు చెందిన గుత్తికోయలు స్థానిక ప్లాంటేషన్‌లో పశువులు మోపుతున్నారని, వద్దని చెప్పినా వినడం లేదని ఫిర్యాదు చేశారు. దాంతో ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు అక్కడికి చేరుకొని పశువులు మొక్కలను తొక్కుతాయని, వేరేచోట మేపుకోవాలని నిందితులు మడకంతుల, పోడియం నంగాలుకు సూచించారు. అయినప్పటికీ వారు అలాగే మేపుతుండటంతో ఎఫ్ఆర్ఓ సెల్‌ఫోన్‌లో ఫొటో తీయడానికి ప్రయత్నించగా వారు అడ్డుకొని గొడవకు దిగారు. వారి వద్ద ఉన్న కత్తులతో శ్రీనివాసరావుపై దాడిచేశారు. దాంతో కంగుతిన్న తోటి ఉద్యోగులు వెంటనే.. శ్రీనివాసరావును కారులో చంద్రుగొండ పీహెచ్‌సీకి తీసుకెళ్లి ఫస్ట్ ఎయిడ్ చేసి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల సమయంలో మృతిచెందారు. ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు హత్యపై చంద్రుగొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.విజయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా, ఏడు నెలల్లో దర్యాప్తు పూర్తి చేసి ందితులపై కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయస్థానం 20 మంది సాక్షులను విచారించారు. కాగా, గురువారం ఆ ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ పీపీ పోసాని రాధా కృష్ణమూర్తి నిర్వహించారు. కోర్టు లైసన్ ఆఫీసర్ బాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎం.రవి సహకరించారు.

రాజకీయ ఎజెండాగా రవాణా రంగం కార్మికుల సమస్య

- అన్ని సంఘాలతోనూ ఒకే వేదిక

ఏర్పాటు: ఆల్ ఇండియా కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య




నవతెలంగాణ -యాదగిరి గుట్ట

రవాణా రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టి రాజకీయ ఎజెండాగా మారుస్తామని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయు) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. అన్ని సంఘాలతోనూ ఒకే వేదిక ఏర్పాటు చేస్తామని చెప్పారు. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో జరిగిన తెలంగాణ పబ్లిక్ & ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మోటార్ వాహన చట్టం-2019 కార్మికులకు తీవ్ర నష్టం చేసేవిధంగా ఉందని చెప్పారు. ఈ చట్టాన్ని ఉపసంహరించే వరకు పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అధిక పెనాల్టీలు వేస్తూ రవాణా రంగం నుంచి ఒక్కొకరిని తప్పుకునే విధంగా ప్రభుత్వం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అక్టోబర్ 6న దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాట కార్యక్రమం చేపట్టనున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం మాట్లాడుతూ.. ఈ నెల 8న ట్రాన్స్‌పోర్ట్ ఐక్య కార్యాచరణగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. యాదగిరిగుట్టపైకి ఆటోలకు అనుమతి ఇవ్వాలని 486 రోజులుగా పోరాటం చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. 300 కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు యండి పాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర కుమార్, కోటయ్య, రాంబాబు, రాష్ట్ర కార్యదర్శులు సాయిలు, పున్నం రవి, రవికుమార్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం నిర్ణయాలతో ప్రతిపక్షాలకు మాస్టర్ స్ట్రోక్ : మంత్రి హరీశ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పోడుభూముల పంపిణీ, వీఆర్ఏల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, రైతు రుణమాఫీ తదితర ప్రభుత్వ నిర్ణయాలతో ప్రతిపక్షాలకు మాస్టర్ స్ట్రోక్ వచ్చిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సీఎం కేసీఆర్ దెబ్బ మీద దెబ్బ కొట్టడంతో విపక్షాలు తట్టుకోకపోతున్నాయని ఎద్దేవా చేశారు. కీలక నిర్ణయాల వల్ల ప్రతిపక్షాలకు ఏం చేయాలో తోచడం లేదని చెప్పారు. వాటి గొంతు మూగబోయిందనీ, వారికి ఓ వాయిస్ అంటూ లేకుండా పోయిందని విమర్శించారు. బయటే కాదు అసెంబ్లీలో కూడా విపక్షాలను సమర్థంగా ఎదుర్కొంటామని మంత్రి ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

మా జిల్లాలో రాజకీయ వరదలు: మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్లగొండ జిల్లాలో రాజకీయ వరదలు వస్తాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కొత్త, పాత వరదలు కలుస్తాయని ఎద్దేవా చేశారు. రాజకీయ పార్టీల్లో అంతర్గత కలహాలు సహజమేనని పేర్కొన్నారు.

తెలంగాణ యాసలో సినిమాలు తీస్తా: మంత్రి మల్లారెడ్డి



కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు డబుల్ బెడ్ రూమ్ అంశం తప్ప మరో అజెండా లేదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ఎస్. మల్లారెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో తనను కలిసిన విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డిపై తొడగొట్టిన తర్వాత తన గ్రాఫ్ పెరిగిందని వ్యాఖ్యానించారు. కొంతమంది తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. త్వరలోనే మీడియా సంస్థను ప్రారంభిస్తాననీ, తెలంగాణ యాసలో ఏడాదికి నాలుగు సినిమాలు తీస్తానని వెల్లడించారు. ఏదీ జరిగినా అంతా మన మంచికేనని తాను భావిస్తానని చెప్పారు.

చర్చలకు సమయం చాలదు : సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



పోడు భూములు, ధరణి పోర్టల్, సింగరేణి, బీసీ సబ్ ప్లాన్ తదితర అంశాలపై అసెంబ్లీలో చర్చించాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కోరారు.నీటిపారుదల ప్రాజెక్టులు, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై చర్చించాలని స్పీకర్‌కు లేఖ రాస్తామని తెలిపారు. గురువారం తనను కలిసిన విలేకర్లతో భట్టి మాట్లాడారు. దేశంలో అతి తక్కువ రోజులు అసెంబ్లీ నడిపిన చరిత్ర తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రుణమాఫీని వడ్డీతోసహా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏ సమస్యను సభలో లేవనెత్తాలో తమ పార్టీకి తెలుసన్నారు. ప్రభుత్వ భూముల అమ్మకాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్నదని అన్నారు. గత ప్రభుత్వాలు అమ్మిన భూములను గుంజుకుంటామని చెప్పిన కేసీఆర్...అధికారంలోకి వచ్చాక ఇప్పుడు విచ్చలవిడిగా భూములు అమ్ముతున్నారని విమర్శించారు.

ఇప్పుడైనా గుర్తుకు రావడం సంతోషకరం రుణమాఫీపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



ఎన్నికలు సమీపిస్తుండటంతో సీఎంకు రైతు రుణ మాఫీ గుర్తుకు వచ్చిందనీ, ఇప్పటికైనా అది గుర్తుకు రావటం సంతోషకరమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. కేవలం 36 వేల వరకు ఉన్న రైతుల రుణాన్ని మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. పాత అప్పు కట్టనిదే కొత్త అప్పు బ్యాంకులు ఇవ్వని పరిస్థితి ఉందని గుర్తు చేశారు. గత నాలుగేండ్లుగా రైతుల రుణ మాఫీ గురించి సీఎం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ కాలంలో వడ్డీ విపరీతంగా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రుణ మాఫీ కాదు. వడ్డీ మాఫీ పథకమంటూ ఎద్దేవా చేశారు. రైతు బంధు పథకాన్ని జూన్ 26 నుండి ప్రారంభించి ఇప్పటివరకు కేవలం 6 ఎకరాల లోపు ఉన్నవారికి మాత్రమే ఇచ్చారని తెలిపారు.దాన్ని పూర్తి స్థాయిలో అందించాలనీ, రుణమాఫీ కూడా వాయిదా పద్ధతిలో కాకుండా సత్వరమే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. భూగోళం బద్దలయినా ఆర్టీసీని ప్రభుత్వంలో కలుపబోమంటూ గతంలో సీఎం చెప్పారని గుర్తు చేశారు.ఆర్టీసి కార్మికులకు పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలనీ, లేదంటే వారు నష్టపోతారని తెలిపారు.

బీఏసీ సమావేశానికి బీజేపీని పిలవకపోవటం అన్యాయం : ఈటల రాజేందర్



బీఏసీ సమావేశానికి బీజేపీని ఆహ్వానించకపోవటం అన్యాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క సభ్యుడున్న లోక్ సత్తాను కూడా గతంలో బీఏసీకి పిలిచేవారని గుర్తుచేశారు. సమైక్య పాలకులకు ఉన్న సోయి... తెలంగాణ ప్రభుత్వానికీ, సీఎం కేసీఆర్‌కు లేదని విమర్శించారు. గతంలో శాసనసభ ఆవరణలో అన్ని పార్టీలకు ఆఫీసుల కోసం గదులు ఉండేవనీ, ప్రస్తుతం తమకు శాసనసభాపక్షం కార్యాలయాలు ఇవ్వలేదని వాపోయారు. ఇది అత్యంత అవమానకర చర్య అని విమర్శించారు. మూడు రోజులు మాత్రమే సభను జరపటం సిగ్గుచేటన్నారు. ఆరునెల్లకోసారి సభ జరగాలి కాబట్టి నిర్వహిస్తున్నారు తప్ప.. ప్రభుత్వానికి ప్రజా సమస్యలు చర్చించాలన్న సోయి లేదని విమర్శించారు.

వరద బాధితుల దు:ఖం వర్ణనాతీతం :ఎమ్మెల్యే సీతక్క



తమ పార్టీ తరుపున వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించామనీ, అక్కడి బాధితుల దుఃఖం వర్ణనాతీతమని కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లల్లోకి వరద పోటెత్తిన వారికి రూ.25 వేలు ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట నష్టం జరిగిన నేపథ్యంలో రైతులకు పరిహారం అందించాలన్నారు. తానే ఇంజనీర్ అవతారం ఎత్తి కాళేశ్వరం నిర్మించానంటూ సీఎం చెప్పారనీ, ఆయన ఇంజనీరింగ్ వల్లే ప్రస్తుతం మంచిర్యాల పట్టణం మునిగిపోయిందని ఎద్దేవా చేశారు. వేలాది ఎకరాల పంట పొలాలు మునిగిపోయా యన్నారు. ఆ ప్రాజెక్టు కట్టకముందు సుభిక్షంగా ఉన్నామని ప్రజలు చెబుతున్నారని సీతక్క గుర్తు చేశారు. రైతు ఏడుస్తున్నాడు... సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ అంటే భారత 'రైతు'సమితి మంత్రి కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'బీఆర్ఎస్ అంటే భారత "రైతు" సమితి అని మరోసారి రుజువైంది. జై కిసాన్ అనేది మాకు కేవలం ఓ నినాదం కాదు. మా ప్రభుత్వ విధానమని మరోసారి తేలిపోయింది' అంటూ మంత్రి కేటీఆర్ గురువారం ట్వీట్ చేశారు. 'కేంద్రం ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం తగ్గినా, బీజేపీ సర్కారు అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు సష్టించినా రైతు రుణమాఫీని సంపూర్ణంగా పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇది సీఎం కేసీఆర్ సంకల్ప బలానికి నిలువెత్తు నిదర్శనం. రైతు సంక్షేమంలో తొమ్మిదేండ్ల తెలంగాణ ప్రస్థానం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయం. రైతుకు రక్షణ కవచంగా అమలుచేసిన ప్రతి పథకం వ్యవసాయ రంగ చరిత్రపై చెరగని సంతకం. దేశవ్యాప్తంగా వ్యవసాయం అంటే సంక్షోభం కానీ...ఒక్క తెలంగాణలోనే వ్యవసాయమంటే సంతోషం. యావత్ తెలంగాణ రైతాంగం ముక్తకంఠంతో చేస్తున్న నినాదమిది' అని కేటీఆర్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.


సంపాదకీయం

అమెరికా డొల్లను వెల్లడించిన ఫిచ్!

ప్రపంచ రేటింగ్ సంస్థలలో ఒకటైన ఫిచ్ వికృత చర్యకు పాల్పడినట్లు జో బైడెన్ సర్కార్ మండిపడింది. అమెరికా ప్రభుత్వ రుణ పరపతి రేటింగ్‌ను ఎఎఎ స్థాయి నుంచి ఎఎ ప్లస్‌కు తగ్గిస్తూ మంగళవారం నాడు ఫిచ్ చేసిన ప్రకటనతో బుధ, గురువారాల్లో ప్రపంచ స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడింది. అనేక

వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో లబ్ది పొందేందుకు రిపబ్లికన్ పార్టీ, దాని తరపున తిరిగి బరిలోకి దిగాలని చూస్తున్న డోనాల్డ్ ట్రంప్ హస్తం ఫిచ్ ప్రకటన వెనుక ఉందని అధ్యక్ష భవన మీడియా అధికారి కరీనే జీన్ పెరీ, బైడెన్ ఎన్నికల ప్రచార కమిటీ ప్రతినిధి కెవిన్ మునోజ్ ఆరోపించారంటే వాటిని తేలికగా తీసుకోలేము. గొర్రెల గోత్రాలు కాపరులకు ఎరుక అన్నట్లుగా రేటింగ్ సంస్థల లోగుట్టు గురించి డెమోక్రటిక్ పార్టీ వారికి తెలియకుండా ఉండదు. అవి ప్రభుత్వాలనే గడగడలాడించగలవు. ఇప్పుడు జరిగింది అదా కాదా అన్నది పక్కన పెడితే ఫిచ్ చెప్పిన కారణాలు వాస్తవమైనవే అనటం నిస్సందేహం.

సూచీలు దిగజారాయి, అన్నింటికీ మించి అమెరికా పరువు గంగలో కలిసింది. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షానికి ఒక ప్రచార అస్త్రం దొరికింది. అందుకే బైడెన్ సర్కార్ చిందులు తొక్కింది. ఫిచ్ సంస్థ లోపాలతో కూడిన పద్ధతిలో లెక్కించిందని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోలేదని, దాంతో తాము ఏకీభవించటం లేదని ప్రకటన వెలువడిన కొద్ది నిమిషాల్లోనే అమెరికా విత్త మంత్రి జానెట్ ఎలెన్ ఆగ్రహం ప్రకటించింది. గడచిన రెండు దశాబ్దాలలో పాలనా ప్రమాణాలు క్రమంగా దిగజారుతున్నాయని, ప్రభుత్వ రుణ పరిమితి గురించి రాజకీయ ప్రతిష్ఠంభనలు, చివరి నిమిషాల్లో పరిష్కారాలతో ఆర్థిక యాజమాన్యంపై విశ్వాసం పోతోందని ఫిచ్ ప్రకటించింది. అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చిన 1776 నుంచి 1917 వరకు వరకు ఎప్పుడు కావాలంటే అప్పుడు ప్రభుత్వం చట్టం చేసి రుణబాండ్ల ద్వారా అప్పు తీసుకొనేవారు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత 1917లో ఒక చట్టం చేసి రుణపరిమితి విధించారు. దాన్ని సవరించాలంటే పార్లమెంటు అనుమతి తీసుకోవాలన్న నిబంధన చేర్చారు. తరువాత 1939లో దాన్ని మరింత పటిష్టం గావించారు. దాంతో 1941 నుంచి 2023 వరకు వాద, ప్రతివాదాలు, అదిరింపులు బెదిరింపులతో తొంభైసార్లకు పైగా పార్లమెంటు అనుమతితో రుణపరిమితిని పెంచారు. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు లేదా తాము కోరిన విధంగా తెచ్చిన రుణాలను ఖర్చు చేసేందుకు అవసరమైన ఒత్తిడి, ఇతర రాజకీయ కారణాలతో ప్రతిపక్షంలో ఎవరు ఉన్నా ఆమోదం తెలపకుండా ఇరుకున పెట్టటం, చివరిక్షణం వరకు ఉత్కంఠకు దారితీసేట్లు చూసి పంతం నెగ్గించుకోవటం జరుగుతోంది. గడువు లోగా రుణ పరిమితి పెంచకపోతే ప్రభుత్వ రుణ కిస్తీలను చెల్లించలేక దివాలా తీసినట్లు ప్రకటించాల్సిన పరిస్థితి వస్తోంది. అధికారంలో డెమోక్రాట్లు, రిపబ్లికన్లు ఎవరున్నా అదే జరుగుతోంది. 1995లో బడ్జెట్ ఆమోదం పొందకపోవటంతో మూడు దఫాలుగా 21 రోజులు ప్రభుత్వం పని చేయలేదు.



ఈ ఏడాది కూడా రుణ పరిమితి మీద చివరి వరకు తేల్చకుండా ఎట్టకేలకు పెంచేందుకు ప్రతిపక్ష రిపబ్లికన్లు అంగీకరించటంతో బైడెన్ సర్కార్ గట్టెక్కింది. గతంలో 2011లో అమెరికా ప్రభుత్వ పరపతిని తగ్గిస్తూ స్టాండర్డ్ అండ్ పూర్ అనే రేటింగ్ సంస్థ చేసిన ప్రకటనతో ఇప్పటి మాదిరే సంచలనం చెలరేగింది. రేటింగ్స్ తగ్గించిన కారణంగా అధిక వడ్డీలతో ప్రభుత్వం రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో లబ్ది పొందేందుకు రిపబ్లికన్ పార్టీ, దాని తరఫున తిరిగి బరిలోకి దిగాలని చూస్తున్న డోనాల్డ్ ట్రంప్ హస్తం ఫిచ్ ప్రకటన వెనుక ఉందని అధ్యక్ష భవన మీడియా అధికారి కరీనే జీన్ పెరీ, బైడెన్ ఎన్నికల ప్రచార కమిటీ ప్రతినిధి కెవిన్ మునోజ్ ఆరోపించారంటే వాటిని తేలికగా తీసుకోలేము. గొర్రెల గోత్రాలు కాపరులకు ఎరుక అన్నట్లుగా రేటింగ్ సంస్థల లోగుట్టు గురించి డెమోక్రటిక్ పార్టీ వారికి తెలియకుండా ఉండదు. అవి ప్రభుత్వాలనే గడగడలాడించగలవు. ఇప్పుడు జరిగింది అదా కాదా అన్నది పక్కన పెడితే ఫిచ్ చెప్పిన కారణాలు వాస్తవమైనవే అనటం నిస్సందేహం. అంకెలతో ఎలా అయినా ఆడుకోవచ్చు. ప్రభుత్వం రుణ కిస్తీలు చెల్లించ లేక చేతులెత్తేసింది అనిపించేందుకు రుణ పరిమితి పెంపుదలకు అంగీకరించవద్దని రిపబ్లికన్ పార్టీ ఎంపీలను డోనాల్డ్ ట్రంప్ ప్రోత్సహించినట్లు మునోజ్ విమర్శించాడు. మాంద్యం అని భయపెట్టారు తిరిగి కోలుకున్నది రేటింగ్ సంస్థకు కనపడలేదా అని డెమోక్రాట్లు రచ్చరచ్చ చేస్తున్నారు.

అమెరికా ప్రభుత్వ రుణం తీరుతెన్నుల రేటింగ్ తగ్గించిన తరువాత మిగతా ధనిక దేశాల్లోనే కాదు, వర్ధమాన, పేద దేశాల్లో కూడ దాని పలుకుబడికి గండి పడుతుంది. మూడు పెద్ద రేటింగ్ సంస్థలు కూడా ఎఎఎ రేటింగ్ కానసాగిస్తున్న దేశాలు జర్మనీ, డెన్మార్క్, నెదర్లాండ్స్, నార్వే, సింగపూర్, స్వీడన్, స్విడ్జర్లాండ్,ఆస్ట్రేలియా మాత్రమే ఉన్నాయి.ప్రపంచ పెత్తనం చేయాలంటే ఆర్థికంగా పటిష్టంగా ఉండాలి. తమ ఇంటినే చక్కదిద్దుకోలేని అమెరికా తమనెలా గట్టెక్కిస్తుందని ఇంతకాలం దాని కోసం వెంపర్లాడుతున్న దేశాలన్నీ ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాయి. అమెరికా డొల్లతనాన్ని ఫిచ్ వెల్లడించి అనేక మందికి కనువిప్పు కలిగించింది.

ఆరో తరగతి చదివిన అహంకారి రాజు కథ

ఇప్పుడు కేంద్ర హోంమంత్రిగా ఉన్న అమిత్‌షా ఒక నేరస్థుడు - అని తీర్పు చెప్పిన సీబీఐ స్పెషల్‌కోర్టు జడ్జిని నిర్దాక్షిణ్యంగా అమిత్‌షా చంపించాడు. ఆ తరువాత 15 రోజులకు వచ్చిన కొత్తజడ్జి తీర్పుకు సంబంధించిన ఒక్క పేపరు కూడా చూడకుండా అమిత్‌షా నిర్దోషి అని తీర్పు ఇచ్చాడు. సత్యాన్ని, న్యాయాన్ని పరిరక్షించే పద్ధతి ఇదేనా? 1200 పేజీల సుదీర్ఘమైన చార్జ్‌షీట్‌లో ఒక పేజీ కూడా కొత్త జడ్జి చదవలేదు. ఒక్కసాక్షిని కూడా విచారించలేదు. 390 పేజీల డేటా రికార్డులో ఏ ఒక్కటీ చూడలేదు. ఊరికే కండ్లు మూసుకుని దోషి అయిన అమిత్‌షాకు క్లీన్ చిట్ ఇచ్చి, కేసు నుంచి విడుదల చేసాడు.

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒక భారీ బహిరంగ సభలో హిందీలో చెప్పిన కథ... చెప్పింది చెప్పినట్లుగా నా తెలుగు పాఠకులకు అందిస్తున్నాను. అది ఇలా సాగుతుంది...

"ఎవడో రాజుగారికి చెప్పాడు. దేశంలోని నోట్లు రద్దు చేయ్. దేశంలో లంచగొండితనం, తీవ్రవాదం లేకుండా పోతాయ్ అని. అంతే, ఒక రోజు సాయంత్రం రాజుగారు టివిలోకి వచ్చి నోట్లు రద్దు చేస్తున్నానని ప్రకటించాడు. ఏమయ్యిందీ? బేంకుల ముందు పెద్ద పెద్ద క్యూలు కనిపించాయి. క్యూలలో ఎంతో మంది చచ్చిపోయారు. చిన్నా, చితక వ్యాపారాలన్నీ మూలపడ్డాయి. వారికి ఏ ఆధారమూ లేకుండా పోయింది. మరొకనాడు ఒకడెవరో వచ్చి రెండువేల రూపాయల నోట్లు తీసుకురా అని చెప్పాడు. రాజుగారు తీసుకొచ్చారు. నాలుగేళ్ళ తర్వాత కొందరెవరో రెండువేల నోట్లు రద్దు చేయమని అడిగారు. రాజుగారు అలాగే చేశారు. రాజుగారికి తెలివిలేదు. చదువులేదు. ఎవడో వచ్చి చెప్పాడు. రైతుల బతుకులు తెల్లగా చేయడానికి నల్లచట్టాలు తెమ్మని. అవివేకపు రాజుకు ఆలోచించే శక్తిలేదు. రైతు వ్యతిరేక చట్టాలు అమలు చేశాడు. దేశంలోని రైతులందరూ రోడ్లమీదికి వచ్చారు. ఆందోళనలు చేశారు. బుద్ధిహీనుడైన రాజు నిర్దయంతో 750 మంది రైతులు మరణించారు. ఒక సంవత్సరం తర్వాత రాజు తన మూర్ఖత్వం పక్కనపెట్టి, విధిలేక రైతు చట్టాలు రద్దు చేసుకోవాల్సి వచ్చింది.



డాక్టర్ దేవరాజు మహారాజు

రాజు తన మిత్రులను బాగా చూసుకునేవాడు. రాజు స్నేహితుడొకరు రూ.పదివేల కోట్లు దొంగతనం చేశాడు. రాజు అతణ్ణి విదేశాలకు పంపి రక్షించుకున్నాడు. రాజుగారి మరొక మిత్రుడు ముప్ఫయి వేల కోట్లు లూటీ చేస్తే... రాజుగారు అతణ్ణి కూడా పారిపొమ్మని సైగ చేసి రక్షణ కూడా కల్పించాడు. రాజుగారికి మరొక ప్రియ మిత్రుడున్నాడు. అతనికి మాత్రం రాజుగారు మొత్తం విమానాశ్రయాలు అమ్మేశాడు. నౌకలు, పోర్టులూ అమ్మేశాడు. దేశపు కోశాగారమే అతనికి అమ్మేశాడు. ఎనలేని సౌకర్యాలు, వసతులు కల్పించి, స్నేహంలో తనకు ఉన్న నిజాయితీని ప్రదర్శించాడు. రాజుగారికి మరో ప్రియమైన ఫ్రెండున్నాడు. అతను అంతర్జాతీయ క్రీడారంగంలో ఎన్నో మెడల్స్ గెల్చుకుని వచ్చిన, మహిళా క్రీడాకారులతో అసభ్యంగా ప్రవర్తించాడు. అతణ్ణి రాజు చట్టానికి అప్పగించాల్సింది. కానీ, అలా చేయకుండా స్నేహధర్మం పాటించాడు. మహిళల్ని అవమాన పరిచిన మిత్రుడి గూర్చి ఒక్కమాట మాట్లాడలేదు.

ఆరో తరగతి చదివిన అహంకారి రాజు కథ ఇది! ఈ కథలో రాజు మాత్రమే ఉన్నాడు. రాణిగారు లేరు. ఎందుకు లేరన్నది బహిరంగ రహస్యం. ఈ సువిశాల దేశంలోని ఒక మారుమూల గ్రామంలో ఓ రోజు ఓ పిల్లవాడు పుట్టాడు. జ్యోతిషుడొకడు చెప్పాడు తిమ్మిని బమ్మి చేసి ఎలాగైనా వీడు చాలా పెద్దవాడైపోతాడని! క్రమంగా పిల్లవాడు పెరుగుతున్నాడే గానీ, వాడికి చదువుమీద ధ్యాస ఉండేది కాదు. బడికి సరిగా వెళ్ళేవాడు కాదు. ఆరోతరగతిలో ఉండగా పాఠశాల రిజిస్టర్‌లో అతని పేరు కొట్టేశారు. అయితే ఊరికి కూతవేటు దూరంలో ఒక రైల్వేస్టేషన్ ఉండేది. ఈ పిల్లవాడు ఆ స్టేషన్‌లో చాయ్ అమ్ము తుండేవాడు. ఎలాగైతేనేం ఆ పిల్లవాడు ఆ దేశానికి సమ్రాట్ అయిపోయాడు. కాని ఏం లాభం? రాజుగారికి చదువు లేదు. తెలివిలేదు. అయినా కింది అధికారులను ఏదీ అడిగేవాడు కాదు. అడిగితే తన అజ్ఞానం బయట పడుతుందేమోనని భయం! అందుకే వాళ్ళు ఏ ఫైలు తెచ్చినా కళ్ళు మూసుకుని సంతకం చేసేవాడు. రాజు చదువుకోలేదన్న విషయం మెల్లమెల్లగా దేశమంతా తెలిసిపోయింది. రాజుగారు నొచ్చుకున్నారు. వెంటనే ఓ యం.ఎ. డిగ్రీ సృష్టించుకున్నారు. యం.ఎ. డిగ్రీ అబద్ధపుదని- ఎవరికీ తెలియగూడదనుకున్నాడు. దాన్ని ఒక రహస్య విషయం చేసేసాడు. భార్యను తన్ని తగలేసిన ఘనకార్యం కూడా ఎవరికీ తెలియగూడదనుకుని రహస్యంగా ఉంచాడు. ఎన్ని విషయాలు రహస్యంగా ఉంచుదామనుకున్నా అన్నీ దేశ ప్రజల్లో చర్చనీయాంశాలైపోయాయి. పదవితో అహంకారం వచ్చిందే కాని, మెదుడు ఖాళీ అని దేశ ప్రజలకు తెలిసిపోయింది.

ఒకసారి దేశంలో ఒక మహమ్మారి ప్రవేశించింది. ఫలితంగా జనం ఎక్కడికక్కడ చచ్చిపోతున్నారు. ఒకడెవడో వచ్చి సాయంత్రం వేళ చప్పట్లు చరిపించమని, ప్లేట్లు మోగించమని సలహా ఇచ్చాడు. అద్భుతమైన తన పరిపాలనకు దేశ ప్రజలు హర్షించి ఎలాగూ చప్పట్లు కొట్టరు. కానీ, ఏదో వంకతో చప్పట్లు కొట్టించుకోవాలని ఒక పథకం ప్రకారం, రాజుగారు టివిలో కనపడి దేశ ప్రజలకు దిశానిర్దేశం చేశారు. చప్పట్లు చరిచినా, గరిటెలతో ప్లేట్లు మోగించినా, ఆ చప్పుళ్ళు మహమ్మారి వినిపించుకోలేదు. పైగా దేశం విడిచి పోలేదు. డాక్టర్ల అవసరం, మందుల అవసరం, ఇంజక్షన్ల అవసరం, వాక్సిన్‌ల అవసరం ఉంటుందని దేశ ప్రజలకు తోచింది. ఎవరి ప్రయత్నాలు వారు చేసుకున్నారు. రాజుగారి మరో మిత్రుడు రైతుల మీదికి కారు నడిపించాడు. వారిని నుగ్గునుగ్గు చేశాడు. అయినా, రాజుగారు స్నేహధర్మానికి కట్టుబడి ఉన్నారు. శిక్షించాల్సిన స్నేహితుణ్ణి రక్షించుకున్నారు. దేశంలో జరుగుతున్న అన్యాయాల గూర్చి రాసిన రచయితలను, జర్నలిస్ట్‌లను, హేతువాదులను వెతికి వెతికి పట్టుకుని చంపించాడు. లేదా జైళ్ళలో వేశాడు. రాజుగారికి లేదా ఆయన సహచరులకు వ్యతిరేకంగా తీర్పులు చెప్పిన జడ్జిల్ని చంపించేవాడు. లేదా రాజ్యసభ సీటిచ్చి నోరు మూయించేవాడు.

ఓరోజు భోరున వర్షం కురిసింది. ప్రకృతి విలయతాండవం చేసింది. అందులో ఆకాశవాణి పలికింది... ఇంత గొప్ప దేశంలో ఉన్న ప్రజలారా! మీరు రాజుగారి లాగా చదువురాని వారు కాదు. తెలివి, వివేకం లేనివారు కాదు. ఎందుకు ఉపేక్షిస్తున్నారూ? మీరంతా వివేకవంతులు. అందరూ ఏకంకండి! గొంతెత్తి పలకండి. అహంకారి రాజును దింపేయండి! అని అంది. అంతే!! ప్రజలు మేల్కొన్నారు. తిరగబడ్డారు. ఐక్యమత్యంతో రాజును ఎదిరించారు. రాజు దిగిపోయాడు. గడ్డు రోజులు పోయాయి. ప్రగతి శీఘ్రగతిన సాధించుకున్నారు. ఉత్తుత్తి 'అచ్ఛేదిన్' కాదు, నిజంగానే మంచిరోజులొచ్చాయి!"

... ...

భారత ప్రధాని ఇటీవలి అమెరికా పర్యటనను నిరసిస్తూ వాషింగ్టన్ డిసి రోడ్లమీద పెద్ద ఎత్తున పలు నిరసన కార్యక్రమాలు జరిగాయి. అందులో అమెరికా అధ్యక్ష భవనం సమీపంలో జరిగిన ఒక నిరసన కార్యక్రమంలో భారత జర్నలిస్ట్ నిరంజన్ టక్లే ఇంగ్లీషు ఉపన్యాసానికి మార్పులు, చేర్పులూ లేని తెలుగు అనువాదం నా పాఠకుల కోసం !! ఆ ఉపన్యాసం ఇలా సాగింది...

"నేను ఇండియాలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా 25ఏళ్ళకు పైగా పనిచేశాను. నా చివరి ఇన్వెస్టిగేషన్ రిపోర్టు ఒక జడ్జి-జస్టిస్ లోయా ఎలా హత్య చేయబడ్డాడూ? అనేది. నా పరిశోధనాత్మక రిపోర్టు. ఆ విషయం ఎందుకు చెపుతున్నానంటే, ఇండియాలో జర్నలిస్ట్‌ల పరిస్థితి, జర్నలిజం పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో మీరు అర్థం చేసుకుంటారని! అది 2017లో ఇండియాలో అతిపెద్ద సంచలనాత్మకమైన కథనం! నేను ఇప్పుడు ఈ సమావేశానికి ఎందుకొచ్చానంటే... అమెరికా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని, మానవ హక్కుల్ని పరిరక్షిస్తుందని, ప్రెస్‌కు, మీడియాకు పూర్తి స్వేచ్ఛనిస్తుందనీ విన్నాను. మరి వీటన్నిటినీ తొక్కిపెట్టి దుర్మార్గ పాలనను



అందిస్తున్న భారత ప్రధానికి అమెరికా ప్రభుత్వం ఎందుకు స్వాగతం పలుకుతోందో మీ అందరికీ అర్థం కానట్టే, నాకూ అర్థం కావడం లేదు. 2002లో, గుజరాత్‌లో జరిగిన మారణకాండకు కారకుడు నరేంద్రమోడీ. అప్పుడే కాదు, ఇప్పుడు కూడా ఒకటిన్నర నెలలుగా మణిపూర్‌లో మానవహననం జరుగుతోంది. జాతుల మధ్య విద్వేషాలు చెలరేగిపోయి మనుషులు హత్య చేయబడుతున్నారు. ఇళ్ళూ, వాకిళ్ళూ కాలిపోయి అనాథలై ప్రజలు రోడ్డున పడుతున్నారు. స్థావరాలు కోల్పోయి దిక్కులేని పక్షుల్లాగా అయిపోయారు. అయినా భారత ప్రధాని దాని గురించి ఒక్కమాట కూడా మాట్లాడడు. మనం ఎన్నో ఉదాహరణలు చూశాం. ఓ సినీనటికి జలుబు చేస్తే దేశ ప్రధాని ట్వీట్ ద్వారా తన బాధ వ్యక్తం చేస్తాడు. కానీ, మారణహోమాలకు స్పందించడు. విచిత్రం? నేనొక జర్నలిస్ట్‌ని నిజాల్ని జనం ముందుంచడం నా నైజం! దోషిని ఎత్తిచూపడం నా నైజం!! దోషి తలదించుకునేట్లు చేయడమే నా ప్రవృత్తి.

ఇప్పుడు భారతదేశంలో జరుగుతున్న వాస్తవాలు తెలుసుకుంటే ఎవరూ హర్షించరు. అలాంటిది, అమెరికా ప్రభుత్వం స్వాగతించడం, ఆయనగారు యు.ఎస్. కాంగ్రెస్ జాయింట్ సెషన్‌లో ఉపన్యసించడం అవసరమా? ఆయనకు ఎలాగూ సిగ్గులేదు. ఆహ్వానం పలుకుతున్న అమెరికా ప్రభుత్వానికైనా ఉండాలి కదా?

ఇది కాదు ప్రజాస్వామ్యం. నా పూర్వీకులు పోరాటాలు చేసి సాధించుకున్న దేశ స్వాతంత్ర్యం అభాసుపాలవు తోంది. ఇదిగో చూడండి. జడ్జి హత్య గురించి నేను రాసిన పుస్తకం ఇదే. **WHO KILLED JUDGE LOYA-BY.NIRANAN TAKLE.** ఇప్పుడు కేంద్ర హోంమంత్రిగా ఉన్న అమిత్‌షా ఒక నేరస్థుడు - అని తీర్పు చెప్పిన సీబీఐ స్పెషల్‌కోర్టు జడ్జిని నిర్దాక్షిణ్యంగా అమిత్‌షా చంపించాడు. ఆ తరువాత 15 రోజులకు వచ్చిన కొత్తజడ్జి తీర్పుకు సంబంధించిన ఒక్క పేపరు కూడా చూడకుండా అమిత్‌షా నిర్దోషి అని తీర్పు ఇచ్చాడు. సత్యాన్ని, న్యాయాన్ని పరిరక్షించే పద్ధతి ఇదేనా? 1200 పేజీల సుదీర్ఘమైన చార్జ్‌షీట్‌లో ఒక పేజీ కూడా కొత్త జడ్జి చదవలేదు. ఒక్కసాక్షిని కూడా విచారించలేదు. 390 పేజీల డేటా రికార్డులో ఏ ఒక్కటీ చూడలేదు. ఊరికే కళ్లు మూసుకుని దోషి అయిన అమిత్‌షాకు క్లీన్ చిట్ ఇచ్చి, కేసు నుంచి విడుదల చేసాడు. ఇండియాలో న్యాయవ్యవస్థ ఎలా పనిచేస్తోందో ఎత్తి చూపడానికే అన్ని వివరాలు సేకరించి నేను ఈ పుస్తకం రాశాను. ఇప్పుడున్న ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. స్వేచ్ఛకు మానవ హక్కులకూ వ్యతిరేకం. కొన్ని శతాబ్దాలుగా వివిధ జాతులతో, మతాలతో విభిన్న ఆలోచనా ధోరణులతో, అనేక భాషా సంస్కృతులతో విరాజిల్లుతున్న నా భారతదేశాన్ని బలవంతంగా మార్చాలనుకుంటున్నారు. మన భారత రాజ్యాంగంలో మొట్టమొదట ఒక వాక్యం ఉంది. 'ఇండియా కొన్ని రాష్ట్రాల కూటమి' అని! దానికి మనం విలువనివ్వాలి కదా? గౌరవించు కోవాలి కదా? ఎన్నో భిన్నత్వాలున్న ఈ దేశాన్ని తమ హిందుత్వ ఎజెండాతో మోడీ ప్రభుత్వం నాశనం చేయాలనుకుంటోంది.

వివేచన లేని ఒకానొక మనిషి నా దేశానికి ప్రధానిగా ఉన్నాడని ఇక్కడ వాషింగ్టన్ డి.సి.లో వైట్‌హౌస్ దగ్గరలో నిలబడి చెప్పుకోవడానికి నేను సిగ్గుపడుతున్నాను. నేను తిరిగి ఇండియాకు వెళ్ళిపోతాను. వెళ్ళిపోయాక ఏమవుతుందో నాకైతే తెలియదు. కానీ, పోరాడడానికి సిద్ధపడే మళ్ళీ నేను నా దేశానికి వెళతాను. పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్న ప్రజాస్వామ్య దేశంలో అన్ని జాతుల, మతాల మధ్య సుహృద్భావం వెల్లివిరిసిన దేశంలో నేనూ, నాలాంటి వారూ అంతా పుట్టి పెరిగాం. అలాంటి అందమైన, ప్రశాంతమైన దేశాన్ని నాశనం చేసిన మోడీ ప్రభుత్వంపై పోరు సల్పడం అనివార్యమైపోయింది. రాబోయే తరాల వారి కోసమైనా మనం పోరాడక తప్పదు. త్యాగాలు చేయకతప్పదు. భిన్నత్వంలో ఏకత్వం సాధించడానికి మానవీయ విలువల్ని పరిరక్షించుకోవడానికి భారతీయులంతా ఏకం కాక తప్పదు - చదువు, నైతికత, క్రమశిక్షణ ప్రపంచ జ్ఞానం, ఇంగిత జ్ఞానం ఏవీ లేని ఈ ప్రస్తుత పాలకుల్ని దింపేసే వరకు భారతీయులెవరూ నిద్రపోరు. అను నిత్యం పోరు సల్పు తూనే ఉంటారు - జైహింద్!" అని ముగించాడు నిరంజన్ టక్లే!

రోఫెల్‌గాంధీ పేరుతో సోషల్ మీడియాలో తిరిగిన ఒక కవితా చరణం ఈ విధంగా ఉంది... "డిగ్రీన పూఛో ఫకీర్‌కి / కరియే బస్ గుణోంక జాప్ / చర్చాకరే ఎగ్జామ్‌కి / చాహే ఖుద్ రహే అంగూఠా ఛాప్" (మణిపూర్ అల్లర్ల విషయంలో పార్లమెంట్‌కు ముఖం చాటేసి, పూనా వెళ్ళి దేశ ప్రధాని తిలక్ అవార్డు స్వీకరించిన సందర్భంగా..)

- వ్యాసకర్త సుప్రసిద్ధ సాహితీవేత్త,విశ్రాంతి బయాలజీ ప్రొఫెసర్.

మెయిల్ @ నవతెలంగాణ

'రాగిజావ' ముచ్చటింతేనా?

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాగిజావ పంపిణీ కార్యక్రమం మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. జూన్ నెలలో రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన విద్యా దినోత్సవం రోజున రాగిజావ కార్యక్రమాన్ని ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది. జూలై నెల నుంచి అన్ని బడుల్లో అమలు చేస్తామని ప్రకటించింది. ఈమేరకు అన్ని జావ తయారీ కోసం పాఠశాలలకు రాగిపిండి, బెల్లం ప్యాకెట్లు సరఫరా కాకపోవడంతో పంపిణీ వాయిదా పడింది. దీంతో ఎంతో ఆశగా ఎదురు చూసిన లక్షలాది మంది పిల్లలకు నిరాశే ఎదురైంది. ఇప్పటికే దాదాపు అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని సర్కార్ గుర్తించింది. ఒకటినుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉదయం వేళలో రాగి జావ పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఒక్కో విద్యార్థికి 10గ్రాముల జావలో మరో 10గ్రాములు బెల్లంపొడి కలిపి ఇవ్వాల్సి ఉంది. ఈ నెల ఒకటో తేదీలోపే అన్ని పాఠశాలలకు రాగిపిండి అందాల్సి ఉన్నా సరఫరాలో జాప్యం కారణంగా విద్యార్థులకు జావ పంపిణీ ప్రారంభం కాలేదు. ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయకుండానే కేవలం ప్రచారం కోసమే కార్యక్రమాన్ని ప్రారంభించిందని పలువురి నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రాగి జావ అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, 9848445134

న్యాయం చేయండి...

2003-డీఎస్సీలో అన్యాయానికి గురైన అభ్యర్థులు న్యాయం కోసం అభ్యర్థిస్తుంటే ఆ సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లే నాథుడే కరువయ్యారు. సకాలంలో డీఎస్సీ ఫలితాలొచ్చినా నియామకాలు రెండేండ్లు ఆలస్యమయ్యాయి. దీంతో ఉద్యోగులు పాతపెన్షన్ కోల్పోయారు. కొత్త పెన్షన్‌లోకి నెట్టబడ్డారు. ఈ విషయమై సుప్రీంకోర్టు ఈ మధ్య రాజకీయ కారణాలతో ఫలితా లొచ్చినా నియామకాలు ఆలస్యమైనవారికి పాత పెన్షన్ వర్తింపచేయాలని చాలా స్పష్టమైన తీర్పునిచ్చింది. అయినప్పటికీ న్యాయం జరగడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో నష్టం జరిగిందని భావించినప్పటికీ కొత్తరాష్ట్రంలో సమస్యను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి ఈ విషయంలో కాలయాపన చేయడం సరైంది కాదు. సుప్రీం ఇచ్చిన తీర్పును కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నా ఇక్కడ మాత్రం పట్టించుకోవడం లేదు. ఎంతోమంది కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించి, వివిధ శాఖల్లో గెజిటెడ్ సమానమైన పోస్టులను కూడా క్రమబద్ధీకరించిన ప్రభుత్వం ఇలాంటి న్యాయపరమైన అంశాల్లో జాప్యం చేయడం తగదు. సుప్రీం కోర్టు తీర్పుననుసరించి జీఓ నెం.57ను అర్హులందరికీ వర్తింపజేసి న్యాయం చేయాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరుతున్నాను.

- సి.శేఖర్, 9010480557.

ఆవుపేడ కాదు, కావాల్సింది సెమీ కండక్టర్ల పరిశోధన!

ప్రధాని నరేంద్ర మోడీ గారికి,

అయ్యా! ప్రతి నెలా మీ మన్ కీ బాత్ అంశాలను చదివే వారిలో నేనూ ఒకరిని. ఒక జర్నలిస్టుగా జన్‌కీ బాత్‌లో ఉన్న కొన్నింటిని ఈ బహిరంగ లేఖ ద్వారా మీ ముందుకు తీసుకు వస్తున్నాను. జులై 28-30 తేదీలలో గుజరాత్ రాష్ట్ర రాజధాని గాంధీనగర్‌లోని మహాత్మామందిర్‌లో తమరు సెమికాన్ ఇండియా 2023 రెండవ వార్షిక సమావేశాన్ని ప్రారంభించారు. ఆ సందర్భంగా దేశమంతటా పత్రికల్లో పూర్తి పేజీ ప్రకటనలు కూడా జారీ చేశారు. దేశాన్ని సెమీకండక్టర్ల కేంద్రంగా మార్చుతామని, మూడు వందల కాలేజీల్లో సెమీకండక్టర్ కోర్సులను ప్రవేశపెడతామని తమరు ప్రకటించటం సంతోషం. గతంలో దేశంలో జరిగిన అనర్ధాలకు, దేశం వెనుకబడి ఉండటానికి, మనకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం రాకపోవటానికి నెహ్రూనే కారణం అని బీజేపీ, దాని మాతృసంస్థ సంఘపరివారం తకీమని సమాధానం చెబుతుంది. సెమీ కండక్టర్ల రంగంలో వెనుకబడటానికి కూడా నెహ్రూనే నిందిస్తారా?

నరేంద్ర మోడీ పెద్ద విజనరీ అంటే భూత, వర్తమాన, భవిష్యత్‌ను చూడగలిగిన దృష్టి కలవారని ప్రచారం చేశారు. నిజమే కావచ్చు, సర్వేల్లో వచ్చే సమాచారం ఎలాంటిదో మీకు ముందే తెలిసి ఉంటుంది గనుక దాని రూపకర్తనే తొలగించారు. అన్నట్లు మరిచాను. ఈ ఏడాది మీ మీద ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతాయని మీరు ముందే గ్రహించి ఆ విషయాన్ని ఎన్నో సంవత్సరాల ముందే మీరు చెప్పినట్లు కొందరు సామాజిక మాధ్యమంలో మీ గొప్ప గురించి ప్రచారం చేస్తున్న పోస్టు ఉంది. దాని నిజానిజాలు మీకే ఎరుక. నిజంగా మీకు తెలిసి ఉంటే మణిపూర్ దురంతాన్ని ఎందుకు నివారించలేకపోయారు అన్న ప్రశ్న వస్తోంది. దాన్ని వదలివేద్దాం. నాలుగవ తరం పారిశ్రామిక విప్లవం గురించి కూడా మీరు చెప్పారు. పిండి లేకుండా రొట్టెలు రావు కదా? దానికి అవసరమైన పరిశోధన, అభివద్ధి రంగాల ప్రాధాన్యత, దానిలో సెమీకండక్టర్ల గురించి ప్రధాని కాగానే లేదా అంతకు ముందు గుజరాత్ సీఎంగా ఎందుకు పసిగట్టలేకపోయినట్లు? ఈ రంగానికి నిధుల కేటాయింపు కేంద్ర ప్రభుత్వం లేదా ప్రయివేటు సంస్థలు చేయాల్సి ఉంది. రెండూ జరగటం లేదు. ముంబై కేంద్రంగా పని చేస్తున్న గేట్‌వే హౌస్ అనే ఒక మేథో సంస్థ 2015 జనవరి పదహారున టెక్నాలజీ పరుగులో చైనా ముందు భారత్ ఓడిపోనుందా అనే శీర్షికతో ఒక విశ్లేషణను ప్రచురించింది. మీ సలహాదారులకు దీని గురించి తెలియదని అనుకోలేము. లేదా ఇలాంటి వాటిని పట్టించుకోకపోతే మన దేశ ఖర్మ అనుకోవటం తప్ప చేసేదేమీ లేదు. దానిలో పరిశోధన, అభివృద్ధి ఖర్చు గురించి చర్చించారు. 1991 నుంచి చైనా పరిశోధన ఖర్చును ఏటా 19 శాతం పెంచుతూ 2012 నాటికి జిడిపిలో 1.97 శాతానికి చేరినట్లు పేర్కొన్నారు. అప్పటికి మన దేశ ఖర్చు 0.9 శాతం మాత్రమే ఉంది. ఫస్ట్ పోస్ట్ అనే పత్రికలో 2023 ఫిబ్రవరి ఒకటిన ప్రచురితమైన ఒక విశ్లేషణలో జిడిపిలో మన దేశ తాజా ఖర్చు 0.7 శాతమే అని చైనా 2.1 శాతంగా పేర్కొన్నారు. జిడిపిలో రెండు శాతం ఖర్చు చేయాలని గతంలో వాజ్‌పేయి సర్కార్ కూడా చెప్పింది. దూరదృష్టి గల మీ పాలనలో గతం కంటే తగ్గిందేమిటి? మన దేశంలో నిపుణులకు, పరిశోధకులకు కొరత ఉన్నదా ?

కుహనా అంశాలమీద పరిశోధనకు మీరు చూపుతున్న శ్రద్ధ సెమీకండక్టర్ల వంటి ప్రాధాన్య రంగాల మీద లేదు. ఆవు పేడ, మూత్రం, పాలలో బంగారం ఉందా, ఇంకా ఏమైనా ఉన్నాయా అంటూ పరిశోధనలకు ప్రజాధనాన్ని ప్రభుత్వం వృథా చేస్తున్నదని 2020 సంవత్సరంలో వందలాది మంది శాస్త్రవేత్తలు ప్రభుత్వ తీరుతెన్నులను తప్పు పడుతూ ఆ పరిశోధనలను ఆపివేయాలని కోరినా మీరు పట్టించుకోలేదు. అంతకు ముందు 2017లో పంచగవ్య గురించి ఆయుర్వేద పుస్తకాల్లో రాసిన వాటిని రుజువు చేసేందుకు పరిశోధనలు చేసేందుకు ప్రభుత్వం పూనుకుంది. మొత్తంగా పరిశోధనలకు తగినన్ని నిధులు కేటాయించకుండా ముందుకు పోవటానికి మీ దగ్గర మంత్రదండమేదైనా ఉంటే హాంఫట్ అంటూ తిప్పండి. ప్రతి లక్ష మంది జనాభాకు ఇజ్రాయెల్‌లో 834, దక్షిణ కొరియా 749, అమెరికాలో 441, చైనాలో 130 మంది పరిశోధకులు ఉండగా మన దేశంలో కేవలం 25 మంది మాత్రమే ఉన్నారని చెప్పటం మీకు ఇష్టముండదని తెలిసినా తప్పటం లేదు.

గత పది సంవత్సరాలుగా ఈ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారు. దీనికి కూడా నెహ్రూ, కాంగ్రెసే కారణం అని మీ మద్దతుదార్లు చెప్పినా ఆశ్చర్యంలేదు. అమెరికా వాణిజ్య మంత్రి



గినా రైమండోతో మన మంత్రి పియూష్ గోయల్ 2023 మార్చి పదవ తేదీన సెమీకండక్టర్ల సరఫరా, నూతన ఆవిష్కరణల భాగస్వామ్యం గురించి ఒక ఒప్పందం చేసుకున్నారు. అంతకు ముందు జనవరిలో సంక్లిష్టమైన, వర్తమాన సాంకేతికతల (ఐసిఇటి) సహకారం గురించి ఒప్పందం జరిగింది. చిత్రం ఏమంటే అధ్యక్ష కార్యాలయం వెల్లడించిన వాస్తవాల పత్రంలో మిగతా అంశాల గురించి ఉంది తప్ప సెమీకండక్టర్ల మీద నిర్దిష్టంగా ఏమీ లేదు అని కార్నెగీ ఇండియా వెబ్‌సైట్‌లో 2023 మే నెల 23వ తేదీన కోణార్క భండారీ రాశారు. మన దగ్గర దానికి భిన్నమైన సమాచారం ఉంటే ఆ పత్రాన్ని విడుదల చేస్తే వాస్తవం తెలుస్తుంది. మనదేశంలో ఉత్పత్తి చేసి ఎగుమతి చేసే వాటిని ప్రోత్సహించేందుకు ఉత్పాదకతతో ముడివడిన ప్రోత్సాహక (పిఎల్ఐ) పథకాన్ని 2021 నుంచి ఐదేండ్లలో రూ.1.97 లక్షల కోట్లు ఇచ్చే ప్రవేశపెట్టారు. కానీ దాన్ని ఆచరణలో ఉత్పత్తి బదులు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న విడిభాగాలను ఒక దగ్గర చేర్చే సెల్‌ఫోన్లకు, చిప్స్ పరీక్షలకు ఇస్తున్నారు. అందుకే భలే మంచి పథకం, వదితే దొరకదని పోలోమంటూ ఆపిల్, మైక్రాన్ వంటి కంపెనీలు మన దేశానికి వస్తున్నాయి.

రెండు దిగ్గజ దేశాలైన అమెరికా, చైనా సెమీకండక్టర్ల రంగంలో పైచేయి సాధించేందుకు భారీ సబ్సిడీలతో పోటీ పడుతున్నాయి. అదే సమయంలో చైనా తన స్వంత రూపకల్పన, ఉత్పత్తికి గాను భారీ మొత్తంలో పరిశోధనకు నిధులు వెచ్చిస్తున్నది. మన దేశంలో ఒక సమగ్ర విధానాన్ని కూడా ఇప్పటికీ రూపొందించుకోలేకపోయాము. ఆలూ లేదూ చూలూ లేదు అన్నట్లుగా ఉంటే మన దేశాన్ని సెమీకండక్టర్ హబ్‌గా మారుస్తానని మీరు చెబుతున్నారు. వరల్డ్ పాపులేషన్ రివ్యూ తాజా (2023) సమాచారం ప్రకారం సెమీకండక్టర్ల ఉత్పత్తిలో తైవాన్, దక్షిణ కొరియా, జపాన్, చైనా, అమెరికా తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఫ్యాబ్రికేషన్‌లో 2022 డిసెంబరు నాటికి జపాన్‌లో 102, తైవాన్ 77, అమెరికా 76, చైనా 70, జర్మనీ 20, బ్రిటన్ 12, మలేషియా 7 ప్లాంట్లను కలిగి ఉన్నాయి. తరువాత స్థానాల్లో ఇజ్రాయెల్, నెదర్లాండ్స్ ఉన్నాయి. గుజరాత్‌లో 70 శాతం సబ్సిడీ ఇచ్చి అమెరికా మైక్రాన్ కంపెనీతో ఒక పాకింగ్ కేంద్రాన్ని పెట్టించి దీంతో ప్రపంచ హబ్‌గా మారుస్తానని మీరు జనాలకు చెబుతున్నారు. ఇది ఎంతకాలం నడుస్తుంది?

కుహనా అంశాలమీద పరిశోధనకు మీరు చూపుతున్న శ్రద్ధ సెమీకండక్టర్ల వంటి ప్రాధాన్య రంగాల మీద లేదు. ఆవు పేడ, మూత్రం, పాలలో బంగారం ఉందా, ఇంకా ఏమైనా ఉన్నాయా అంటూ పరిశోధనలకు ప్రజాధనాన్ని ప్రభుత్వం వృథా చేస్తు న్నదని 2020 సంవత్సరంలో వందలాది మంది శాస్త్రవేత్తలు ప్రభుత్వ తీరుతెన్నులను తప్పు పడుతూ ఆ పరిశోధనలను ఆపివేయాలని కోరినా మీరు పట్టించుకోలేదు.

అమెరికా మనలను తన సహజ భాగస్వామిగా పరిగణిస్తున్నదని, పిలిచి పెద్ద పీటవేస్తున్నదని చెబుతున్నారు. గతేడాది (2022) మార్చి నెలలో తొలిసారిగా అమెరికా చొరవతో చిప్స్ 4 లేదా ఫాబ్ 4 కూటమి ఏర్పడింది. దానిలో తైవాన్, జపాన్, దక్షిణ కొరియా ఇతర భాగస్వాములు తప్ప మనకు చోటు లేదు. ప్రపంచ సెమీకండక్టర్ల పరిశ్రమలో 70 శాతం వాటా ఈ నాలుగు దేశాలదే. విధాన రూపకల్పన, ఉత్పత్తిలో పరస్పరం సహకరించుకొనేందుకు, విస్తరణకు దీన్ని ఏర్పాటు చేశారు.

గత తొమ్మిది సంవత్సరాల్లో దేశ అప్పును విపరీతంగా పెంచివేశారు. కాగ్ ఖరారు చేసిన గణాంకాల ప్రకారం 2014 మార్చి 31 నాటికి కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.50,68,235 కోట్లు. కాగా 2015 మార్చి నాటికి అంటే తొలి ఏడాది దాన్ని రూ.56,07,315 కోట్లకు తరువాత మీరు దాన్ని ఎడాపెడా పెంచారు. కేవలం మీరు చేసిన అప్పు 2024 మార్చి నాటికి రూ.118,78,431 కోట్లకు పెంచుతామని ప్రతిపాదించారు. మీరు అధికారానికి వచ్చినపుడు కేంద్ర ప్రభుత్వ రుణం జిడిపిలో 67.1 శాతం కాగా 2021లో 88.5 శాతానికి పెరిగింది, 2023 నాటికి అది 83.1 శాతంగా ఉంది. ఇంత చేసిన వారు పరిశోధనకు పెంచకపోగా ఎందుకు తగ్గించిందీ ఏదైనా ఒక మన్‌కీ బాత్‌లో చెబితే సంతోషం. ఆవు పేడ పరిశోధన నిధులు సెమీ కండక్టర్లకు మళ్లించండి, సబ్సిడీలతో పాటు పరిశోధనలకూ నిధులు ఇవ్వండి. ఇప్పటికి ఇంతటితో ముగిస్తున్నా.

-సత్య (తోటి భారతీయుడు)






10.36 కోట్ల జన్‌ధన్ ఖాతాల్లో జీరో లావాదేవీలు

న్యూఢిల్లీ : గతేడాది దేశవ్యాప్తంగా 10.36 కోట్ల జన్‌ధన్ బ్యాంక్ ఖాతాల్లో జీరో లావాదేవీలు జరిగాయని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి భగవత్ కరాడ్ తెలిపారు. రాజ్యసభలో సీపీఐ ఎంపీ బినయ్ విశ్వం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2022-23లో ప్రభుత్వ బ్యాంకుల్లో (ప్రాంతీయ బ్యాంకులతో సహా) ఉన్న10.36 కోట్ల జన్‌ధన్ బ్యాంక్ ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా లావాదేవీలు జరగలేదని మంత్రి తెలిపారు. 2022-23లో ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాల్లో జరిగిన మోసాలపై 796 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు.

కోకాపేట భూములు ఆల్‌టైమ్ రికార్డు

- వేలంలో ఎకరం ధర రూ.100 కోట్లు
- 45.33 ఎకరాలు వేలంలో ప్లాట్లు దక్కించుకున్న 11 సంస్థలు
- ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ. 3319 కోట్లు



నవతెలంగాణ రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా కోకాపేట నియో పోలీస్ ఫేజ్-2 వేలంలో భూములకు రికార్డు స్థాయిలో ధర పలికాయి. 10వ నెంబర్ ప్లాట్‌లో ఎకరం ధర రూ. 100 కోట్ల మార్క్ దాటింది. గురువారం కోకాపేటలో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో 45.33 ఎకరాల్లోని 7 ప్లాట్లను వేలం వేశారు. ప్లాటు కనీస విస్తీర్ణం 3.9 ఎకరాల నుంచి 9.1 ఎకరాలుగా ఉంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంఎస్‌టీసీ నిర్వహించిన ఈ వేలంలో ఆన్‌లైన్‌లో కూడా పాల్గొనే అవకాశాన్ని కల్పించారు. ఎకరానికి హెచ్‌ఎండీఏ ధర రూ.35 కోట్లుగా నిర్ణయించింది. కానీ ఆ భూములు రెట్టింపు ధర పలికాయి. అత్యధికంగా 10వ ప్లాట్ ధర రూ.100 కోట్లు పలకగా, అత్యల్పంగా 11వ ప్లాట్ ధర రూ.67.25 కోట్లు పలికింది. ఈ వేలం ద్వారా హెచ్‌ఎండీఏ అధికారుల అంచనాలకు మించి ప్రభుత్వానికి రూ.3319.60 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా, వేలంలో 11 సంస్థలు పాల్గొని ప్రభుత్వ అంచనాలకు మించి పోటాపోటీగా వేలం వేయడం విశేషం.

ప్రభుత్వ హోమియోపతి జూనియర్ డాక్టర్ల ధర్నాకు గడ్డం సాయి కిరణ్ సంఘీభావం




నవతెలంగాణ- హైదరాబాద్

స్థానిక రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రిలో ఎనిమిదేండ్లుగా స్టైఫండ్ పెంచకుండా వైద్య విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోన్న ప్రభుత్వ వైఖరి మారాలని శాంతియుతంగా 8 రోజుల నుండి ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు బీఆర్‌వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం సాయి కిరణ్ హాజరై వైద్య విద్యార్థుల ధర్నాకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో విద్యా, వైద్యంపై ప్రభుత్వం పూర్తి అలసత్వం ప్రదర్శించడం తెలంగాణ రాష్ట్రానికి మంచిది కాదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. గౌరవ హైకోర్టు తక్షణమే విద్యార్థులకు స్టైఫండ్ పెంచి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్య పరిష్కరించలేని పక్షంలో ఆందోళన ఉధతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ జూనియర్ డాక్టర్లు ,పీజీ విద్యార్థులు, టీఆర్‌వైఎఫ్ సభ్యులు రాఘవేంద్ర రెడ్డి, రాంబాబు, కార్తీక్, అరవింద్, రవీందర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పాలిట ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్

- బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శిరీష ఓం ప్రకాష్ యాదవ్



నవతెలంగాణ- హైదరాబాద్

రైతుల పాలిట సీఎం కేసీఆర్ ఆపద్బాంధవుడు అని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, డాక్టర్ శిరీష ఓం ప్రకాష్ యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ రుణ మాఫీ ప్రకటించడం పట్ల గురువారం నగరంలోని కాచిగూడలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, డాక్టర్ శిరీష ఓం ప్రకాష్ యాదవ్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎర్ర భీష్మ దేవ్, సీనియర్ నాయకులు బద్దుల రవీందర్ యాదవ్, ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, సదానందు, బబ్లు సింగ్, రాజేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల కష్టానికి గుర్తింపేది?

బోధనేతర పనులతో అవస్థలు

- మానసిక ఒత్తిడి, పనిభారంతో తిప్పలు
- సక్సెస్‌లో వారి పాత్ర వీడదీయలేనిది
- బాధల్ని పట్టించుకోని సర్కార్
- సమస్యల పరిష్కారంకోసం రేపు హైదరాబాద్‌లో మహాధర్నా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సమస్యలు వెంటాడుతున్నాయి. వీరిని ఉపాధ్యాయులు అనడం కంటే మల్టీపర్పస్ వర్కర్లు అనడం సముచితంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వేలాది మంది విద్యార్థులు ఉండే ఆ పాఠశాలల్లో ఉపాధ్యాయులే వార్డెన్ విధులనుంచి మొదలుకుని హౌజ్ మాస్టర్, కేర్ టేకర్, డిప్యూటీ వార్డెన్, సూపర్వైజరీ స్టడీస్, నైట్ స్టే, ఎస్కార్ట్ తదితర బోలెడు పనులు చేయాల్సి వస్తున్నది. నిరంతరం కంటికి రెప్పలా విద్యార్థులను వారు కాపాడుకుంటున్నారు. సెలవు రోజుల్లో సైతం కొంత మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి వస్తున్నది. వీటికి తోడు రోజూ పాఠశాలకు కాపలా కాసే పనికూడా చేయాల్సి వస్తున్నది. అంతే కాదు..మహిళా ఉపాధ్యాయులకు సైతం ఈ పని తప్పడం లేదంటే ..వారి పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

కష్టానికి తగిన గుర్తింపేది?

గురుకుల ఉపాధ్యాయుల కష్టానికి తగిన గుర్తింపు దక్కడం లేదు. పైగా వారిపై పనిభారం ఎక్కువ. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. అధికారుల వేధింపులతో మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఆయా విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యకు అంకిత భావంతో కృషి కొనసాగిస్తున్నారు. గురుకులాల్లో విద్యా ర్థులు సాధించిన విజయాలను ఈ నేపథ్యంలోంచే చూడాలి. కానీ.. విద్యార్థుల సక్సెస్‌కు మూలమైన ఉపాధ్యాయుల బాధలు పట్టించుకునేందుకు సర్కారుకు మనసు రావటం లేదు. వారి సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తు న్నది. వేతనంలో వివక్షను కొనసాగిస్తున్నది. తగిన సౌకర్యాలు కల్పించటం లేదు.

ఒత్తిడి లేని పనితోనే ఫలితాలు ..

ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఒత్తిడి లేకుండా ఉంటేనే..ఫలితాలు వస్తాయి. ఇందుకు స్వేచ్ఛగా బోధించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలి. అప్పుడే విద్యార్థుల మానసిక స్థితికి తగిన విధంగా విద్యను అందించటం సాధ్యమవుతుంది. సవాలక్ష సమస్యలు బోధించే ఉపాధ్యాయులనే వెంటాడుతుంటే..ఇక విద్యార్థులకు నాణ్యమైన చదువును ఎలా చెబుతారు? మరో పక్క ఆయా గురు కులాల్లో విద్యార్థులనూ పలు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఉపాధ్యాయు ల, విద్యార్థుల, వసతి గృహాల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం మీన మేషాలు లెక్కించట మేంటని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. సమస్యలు పరిష్కరించకపోగా విధి నిర్వహణలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారంటూ అధికారుల వేధింపులు ఎక్కువవతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏకరూపత లేక ఇబ్బందులు..

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత పది జిల్లాల్లో అన్ని యాజమాన్యాలలో కలిపి కేవలం 298 గురుకుల విద్యాసంస్థలు మాత్రమే ఉండేవి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేజీ టు పీజీ పథకంలో భాగంగా ప్రభుత్వం ఒకేసారి 700 పైగా గురుకుల విద్యాసంస్థలు ఏర్పాటు చేసింది. దీంతో రాష్ట్రంలో రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలతో సహా మొత్తం 1002 గురుకుల విద్యాసంస్థలు ఉన్నాయి. ఒక్కో సొసైటీలో ఒక్కో రకంగా పరిపాలన, అజమాయిషీ కొనసాగుతున్నది. బోధనా సమయాల్లో సైతం ఏకరూపత లేదు. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమవు తున్నాయి. కొత్త విద్యా సంస్థలు అన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు సమాన సంఖ్యలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గెస్ట్, పార్ట్ టైం టీచర్లు పనిచేస్తున్నారు. వారికి కనీస వేతనాలు లభించటం లేదు. 2018, 2019 సంవత్సరాల్లో నియామకమైన రెగ్యులర్ టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్స్ పూర్తి చేయడంలో, ప్రమోషన్లు ఇవ్వటంలో ఒక్కో సొసైటీ ఒక్కో రకంగా వ్యవహరిస్తున్నది.



సర్కారు స్పందించాలి :చావ రవి,ప్రధాన కార్యదర్శి టీఎస్‌యూటీఎఫ్

గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం గత ఐదేండ్లుగా టీఎస్ యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తున్నది. వారి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి పలు సార్లు విన్నపాలు అందజేసింది. ఈ క్రమంలో కొన్ని సమస్యలు పరిష్కారం అయినప్పటికీ ఇంకా పలు ముఖ్యమైన సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి.వాటి పరిష్కారం కోసం ఈ నెల ఐదున హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నాం. ఇప్పటికైనా సర్కారు స్పందించాలి. గురువుల బాధలు పట్టించుకోవాలి. సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలి.

ఢిల్లీ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం

సుప్రీం తీర్పును అధిగమించి ఆర్డినెన్స్ తెచ్చారు

- ముఖ్యమంత్రి అధికారాలను ఎల్‌జీ అధిగమిస్తారు
- ఇది సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం
- ఈ బిల్లుకు మా పార్టీ వ్యతిరేకం : సీపీఐ(ఎం) ఎంపీ ఎఎం ఆరీఫ్
- ఎన్నికైన ప్రభుత్వంపై పెత్తనమా? : బీఆర్‌ఎస్ ఎంపీ జి.రంజిత్ రెడ్డి

న్యూఢిల్లీ : ఢిల్లీ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని సీపీఐ(ఎం) ఎంపీ ఎఎం ఆరీఫ్ విమర్శించారు. ఢిల్లీ బిల్లుపై లోక్‌సభలో గురువారం జరిగిన చర్చలో సీపీఐ(ఎం) తరపున ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బిల్లును తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని అన్నారు. మే 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన ఏడు రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొ చ్చిందనీ, సుప్రీంతీర్పును అధిగమించి ఆర్డి నెన్స్ తెచ్చారని విమర్శించారు. ఆఘ మేఘా ల మీద ఆర్డినెన్స్ తీసుకురావల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆర్టికల్ 123(1) ప్రకారం రాష్ట్రపతి అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఆర్డినెన్స్ తీసుకొస్తారని చెప్పారు. అధికారాలకు సంబంధించిన ఆర్డినెన్స్ తీసు కొచ్చేటప్పుడు ఆర్టికల్ 123(1)ని పరిశీలించా లని సుప్రీంకోర్టు చాలాసార్లు తెలిపింద న్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం అలాంటిదేమీ చేయకుండా తొందరపడిందని విమర్శించా రు. ఆర్టికల్ 239 ఎఎ ప్రకారం సివిల్ సర్వీస్ లకు సంబంధించిన చట్టాలను చేసే అధికా రం ఢిల్లీ ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) పాత్రను పబ్లిక్ ఆర్డర్, పోలీస్, భూమి అంశాలకు మాత్రమే పరిమితం చేసిం దని తెలిపారు.

రాష్ట్ర మంత్రి వర్గం సలహా మేరకు నడుచుకోవాలని సూచించిందని స్పష్టం చేసిందన్నారు. సమాఖ్య వ్యవస్థ ఢిల్లీకి కూడా వర్తింప చేసిందని తెలిపారు. ముగ్గురు సభ్యులు ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం ప్రిన్సిపల్ కార్యదర్శితో ఉన్న కమిటీ ప్రతిపాదిస్తుందని ఈ బిల్లులో పేర్కొన్నారనీ, అయితే అందులో ఇద్దరు (మెజార్టీ) అధికారులు కేంద్ర ప్రభుత్వం ద్వారా నియమితులైన వారేనని అన్నారు. అయితే ఈ కమిటీలో మెజార్టీ ప్రతిపాదన లపై ఎల్‌జీ తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. అలాగైతే ఎన్నికైన ముఖ్య మంత్రి అధికారాలను ఎంపికైన అధికారులు అధిగమిస్తారని తెలిపారు. అలాంటప్పుడు ముఖ్యమంత్రి కింద ఎవరు పని చేస్తారని ప్రశ్నించారు. ఎల్‌జీ అంతిమ నిర్ణయం తీసు కోవడమనేది సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేక మని అన్నారు. ఎన్నికైన ప్రభుత్వంపై ఎల్‌జీ ఆధిపత్యమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశ్యంగా ఉందని విమర్శించారు. ఢిల్లీ పట్ల కేంద్ర ప్రభుత్వం ప్రజా తీర్పుకు భిన్నంగా వ్యవహరి స్తున్నదని ఆరోపించారు. బీజేపీ ఢిల్లీ మున్సి పాల్టీపై ఆధిపత్యం కొనసాగించడం కోసం నాలుగు మున్సిపాల్టీ కౌన్సిళ్లను ఒక కౌన్సిల్‌గా విలీనం చేస్తూ ఇక్కడే బిల్లు ఆమోదించారనీ, కానీ ఏమైందో అందరికీ తెలుసని అన్నారు. ఢిల్లీ మేయర్ ఎన్నికల సమయంలో కూడా తమకు మెజార్టీ లేకపోయినా అడ్డదార్లో ఎల్‌జీని ఉపయోగించి మేయర్ పదవిని కాజేయాలని చూశారని విమర్శించారు. ప్రజల తీర్పు ఉన్నప్పటికీ కోర్టు తీర్పు తరువా తనే ఆప్ తరపున మేయర్ అయ్యారని అ న్నారు. బీజేపీయేతర రాష్ట్రాలపైన గవర్నర్ల ను ప్రయోగిస్తున్నారని విమర్శించారు. లక్ష్య దీప్, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో గవర్నర్లు ఎన్నికైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారనీ, తమిళనాడులో ఏకంగా గవర్నర్ మంత్రిని తొలగించారని పేర్కొ న్నారు. అలాగే జమ్మూకాశ్మీర్ వలే ఎన్నికైన అసెంబ్లీలను కూలదోసి, ఎంపికైన అధికారులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని విమర్శిం చారు. చాలా రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొని బీజేపీ అధికారంలోకి వచ్చిందనీ, ఇలాంటి పరిస్థితుల కోసం బ్యూరోక్రసీ అధికారాలను ఉపయోగించే విధంగా ఈ బిల్లు ఉందని విమర్శించారు.

మణిపూర్‌లో పూర్తిగా రాజ్యా ంగ ఉల్లంఘన జరిగిందని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, కానీ బీజేపీ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని ఎందుకు మార్చటం లేదని ప్రశ్నించారు. మణిపూర్ అంశంపై బీజేపీ కేంద్ర నాయకత్వం ఎందుకు మౌనంగా ఉందనీ.. ఎందుకంటే, అక్కడ ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ అజెండాతోనే అల్లర్లు జరుగుతున్నా యని తెలిపారు. ఈ బిల్లు ప్రజాస్వామ్య, రాజ్యాంగ, సమాఖ్య వ్యవస్థకు విరుద్ధంగా ఉందని అన్నారు.

అధికారాలను కేంద్రం నియంత్రిస్తుంది

ఎన్నికైన ప్రభుత్వంపై పెత్తనమా? అని బీఆర్‌ఎస్ ఎంపీ జి.రంజిత్ రెడ్డి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను నియంత్రిస్తున్నదని విమర్శిం చారు. వెంటనే ఈ బిల్లును ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

లోక్‌సభలో ఢిల్లీ బిల్లుపై జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ తరపున జి. రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉద్దేశం ఏమిటో తెలియాలని ఆశిస్తు న్నాను. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలోని విలువలకు విరుద్ధంగా ఉండే ఈ బిల్లును తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఢిల్లీ బ్యూరో క్రసీపై చాలా ఏళ్లగా చర్చ జరుగుతుందనీ, ఎవరు ఎవరికి రిపోర్టు చేయాలనీ, వారి బాధ్యతేమిటనీ, ఎవరికి జవాబుదారీతనంగా ఉండాలి అనే దానిపై చర్చ జరుగుతోందని అన్నారు. ప్రజల చేత ఎన్నికోబడిన ప్రభుత్వం గురించి బీజేపీ తరపున చర్చలో పాల్గొనేవారు మాట్లాడటం లేదని అన్నారు.

బ్యూరోక్రసీ మంత్రులు, ముఖ్యమంత్రికి జవాబుదారీగా ఉండాలని, మంత్రులు, ముఖ్యమంత్రి రాష్ట్ర అసెంబ్లీకి జవాబుదారీతనంగా ఉండాలని, రాష్ట్ర అసెంబ్లీ ప్రజలకు జవాబుదారీతనంగా ఉం డాలని అన్నారు. మొత్తం జాతీయ రాజధాని ప్రాంతంలో చట్టాలు చేసే అధికారం రాష్ట్ర అసెంబ్లీకి ఉందని తెలిపారు. ఈ బిల్లులో ముగ్గురు సభ్యుల కమిటీ గురించి పేర్కొన్నారనీ, అందులో ఇద్దరు సభ్యులు కేంద్ర ప్రభుత్వం నియమించి వారేనని, అలాంటప్పుడు ముఖ్యమంత్రి ఏం చేస్తాడని ప్రశ్నించారు. లెఫ్టినెంట్ గవర్నరే నిర్ణయిస్తే, ముఖ్యమంత్రి పాత్ర ఏంటని ప్రశ్నించారు. వాటర్ రెగ్యూలేటరీ, ట్రాన్స్ పోర్టు, టూరిజం, జలబోర్డు వంటి 50 అధికా రాలను కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తుందని, ఇక ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయ గలదని విమర్శించారు. లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఎటువంటి స్వతంత్ర అధికారం లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ ఎంపీ జి.రంజిత్ రెడ్డి

ఇక మూడ్రోజులే అసెంబ్లీ...

(మొదటిపేజీ తరువాయి)

చేశారని కొనియాడారు. ఆ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో కలిపించాలని చాలా ప్రయత్నం చేశారనీ, ఇదే అంశంపై తనకు పలుమార్లు లేఖలు కూడా రాశారని తెలిపారు. కంటోన్మెంట్ లో బలహీన వర్గాల కోసం ఇండ్లు కట్టించాలని తపించే వారన్నారు. కంటోన్మెంట్లను నగరపాలక సంస్థల్లో కలపాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తు న్నట్టు తెలిసిందన్నారు. ఈ రకంగానైనా సాయ న్న కోరిక నెరవేరాలని ఆకాంక్షించారు. సీఎం ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ మంత్రులు ప్రశా ంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎంఐఎం సభ్యులు సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, బీజేపీ సభ్యులు రఘునందన్ రావు, బీఆర్‌ఎస్ నుంచి దానం నాగేందర్, ముఠా గోపా ల్ మాట్లాడారు. వారంతా సాయన్నతో తమ కున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన సేవల్ని కొని యాడారు. సాయన్న మృతిపట్ల సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివా ళులర్పించింది. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే విజ యరామారావు మృతి పట్ల సభ సంతాపం ప్రక టించింది. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సభను శుక్రవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

ఈటల-కేటీఆర్ ఆత్మీయ ఆలింగనం

శాసనసభ తొలిరోజు సమావేశంలో ఈటల రాజేందర్-మంత్రి కేటీఆర్ ఆత్మీయ ఆలింగనం హైలెట్‌గా నిలిచింది. సమావేశాల ప్రారంభానికి ముందు సభలో ఎమ్మెల్యేలు, మంత్రులు ఒకరి నొకరు పలుకరించుకున్నారు. అదే సమయంలో మంత్రి కేటీఆర్..ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ వద్దకెళ్లి ఏదో మాట్లాడుతుండగానే అక్కడకు డిప్యూటీ స్పీకర్ పద్మారావు అక్కడకు చేరుకున్నారు. ఆ ముగ్గురు మాట్లాడుతుండగా బాల్కసుమన్, మరో ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు పోగయ్యారు. అదే సమయంలో ఈటల రాజేం దర్ సభలోకి వచ్చి తనకు కేటాయించిన సీట్లో కూర్చోబోతుండగా కేటీఆర్ షేక్‌హ్యాండ్ ఇచ్చి ముందుకు రా అన్నట్టుగా లాగారు. దీంతో ఈట ల సీటు ముందువైపునకు వచ్చారు. ఈ సందర్భ ంగా కేటీఆర్, ఈటల రాజేందర్‌ను ఆలింగనం చేసుకున్నారు. పద్మారావు కూడా ఈటలను ఆలి ంగనం చేసుకుని పలుకరించారు. వారంతా న వ్వుతూ ఏదో మాట్లాడుతుండగా సీతక్క దండం పెట్టుకుంటూ వారి వద్దకు చేరుకున్నారు.

వలస కార్మికులకు హిందూత్వ శక్తుల బెదిరింపులు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు ఇక్కడ ఉన్నారు. కాని నా కుటుంబం భయపడింది. మేము నగరం నుంచి బయలుదేరు తున్నాము" అని అలీ వాపోయాడు. అయితే, వారు వలస వెళ్తున్న దృశ్యాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పరిస్థితులను అదుపులోకి తీసురావటంలో విఫలమవుతున్న బీజేపీ రాష్ట్ర ప్రభుత్వంపై నెటిజన్లు, సామాజికవేత్తలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మసీదులకు నిప్పుపెట్టేందుకు దుండగులు యత్నం

మత ఘర్షణలు చెలరేగిన మూడు రోజుల తర్వాత కూడా హర్యానా జిల్లాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. హిందూత్వ శక్తుల ఆగడాలు, బెదిరింపులు ఇంకా తగ్గుముఖం పట్టటం లేదు. బుధవారం రాత్రి నుహ్‌లోని టౌరు పట్టణంలో గుర్తు తెలియని దుండగులు రెండు మసీదుల కు నిప్పుపెట్టేందుకు ప్రయత్నించారు. నుహ్ కర్ఫ్యూలో ఉన్న సమయంలో కూడా రాత్రి 11.30 గంటల ప్రాంతం లో రెండు మసీదులపై దాడులు జరగటం గమనార్హం. ఈ దాడుల్లో ఎవరూ గాయపడలేదని పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి మోటార్‌సైకిళ్లపై వచ్చిన దుండగులు నుహ్‌లోని రెండు మసీదులపై క్రూడ్ పెట్రోల్ బాంబులు విసిరి, స్వల్ప నష్టం కలిగించారని సాక్షులు తెలిపారు. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక దళం ఇంజిన్‌లను పంపినట్టు పోలీసులు తెలిపారు. అయితే, ఎవరూ కాల్పులకు ప్రయత్నించడం తమకు కనిపించలేదని వెల్లడించారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

- తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ చైర్మెన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోధ్
- ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి పాదయాత్ర ,అరెస్టు



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ చైర్మెన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోధ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల నుంచి తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో సిద్దిపేట వరకు పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 80 రోజుల నుంచి విశ్వవిద్యాలయాల్లో ధర్నాలు, పోరాటాలు, సదస్సులు నిర్వహి స్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అందువల్ల పాదయాత్ర చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. ఈ పాదయాత్ర సిద్దిపేట జిల్లా కోయినపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా, పాద యాత్రకు బయలుదేరిన అధ్యాపకులను పోలీసులు అరెస్టు చేసి ఓయూ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వర్కింగ్ చైర్మెన్ డాక్టర్ ఎం.రామేశ్వరరావు, చైర్‌పర్సన్ పల్లా రేష్మారెడ్డి, కో చైర్మెన్ జరుపుల చందులాల్, ఆర్‌డీ ప్రసాద్, డాక్టర్ విజయ్ కుమార్, కె.హరీష్, డాక్టర్ అశోక్ డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్, కిరణ్ ప్రేమ్, సుజాత, వాణి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

15 తర్వాత సమ్మె ఉధృతం

కరెంట్, తాగునీటి సేవల్నీ బంద్‌చేస్తాం

- 6న పార్టీలు, ప్రజా, సామాజిక సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం
- 7న రాస్తారోకోలు.. 8,9,10 తేదీల్లో మహాపడావ్‌లు
- 13, 14 మండల కేంద్రాల్లో రచ్చబండ
- రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ అల్టిమేటం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల్ని పరిష్కరించకపోతే ఆగస్టు 15 నుంచి సమ్మె ఉధృతం చేస్తామనీ, అత్యవసర సేవలైన కరెంటు, తాగునీటి సరఫరా సేవల్నీ బంద్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ అల్టిమేటం జారీ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్ అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. సమావేశంలో జెఏసీ సలహాదారులు ఎమ్‌డీ. యూసుఫ్ (ఏఐటీయూసీ), కె. సూర్యం(ఐఎఫ్‌టీయూ), వెంకరాజం (ఏఐటీయూసీ), పి. శివబాబు (ఐఎఫ్‌టీయూ), చాగంటి వెంకటయ్య (సీఐటీయూ), కో-కన్వీనర్స్ పి. సుధాకర్, గ్యార పాండు, శ్రీకాంత్ (సీఐటీయూ), నర్సింహారెడ్డి (ఏఐటీయూసీ), యాదయ్య (ఐఎఫ్‌టీయూ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల వలె గ్రామ పంచాయతీ కార్మికులకూ జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జేఏసీ ప్రభుత్వం ముందుంచిన 14 డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సమ్మెను ఉధృతం చేయబోతున్నట్టు ప్రకటించారు. అందులో భాగంగా ఈ నెల ఆరోతేదీన రాజకీయ పార్టీలు, ప్రజా, సామాజిక సంఘాలతో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించబోతున్నా మన్నారు. ఏడో తేదీన రాస్తారోకోలు చేపట్టాలనీ, 8, 9, 10 తేదీల్లో కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే మహాపడావ్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 8 నుంచి 12వ తేదీ వరకు తమ సమ్మెకు మద్దతివ్వాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలనీ, కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. 13,14 తేదీల్లో రచ్చబండ కార్యక్రమాలను మండల కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మాకు స్వతంత్రం రాలేదా? ఇంకెన్నాళ్ళు మాకీ బానిసత్వం? గ్రామ పంచాయతీ సమ్మెను పరిష్కరించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి లేదా!' అంటూ ప్లకార్డుల ప్రదర్శనలు మండల కేంద్రాల్లో చేయాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత సమ్మెను ఉధృతం చేస్తామన్నారు.

పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీకి జేఏసీ వినతి

జేఏసీ సమావేశం అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాకు వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు ఆయనకు సమ్మె డిమాండ్ల గురించి వివరించారు. జేఏసీ డిమాండ్లను సీఎం, మంత్రి దృష్టికి తీసుకెళ్తామనీ, తమ పరిధిలోని అంశాలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీనిచ్చారని జేఏసీ నేతలు తెలిపారు. జాప్యం చేయకుండా తక్షణమే చొరవ చూపి సమ్మె డిమాండ్లను పరిష్కరించి సమ్మెను నివారించాలనీ, చర్చలకు పిలిస్తే జెఏసి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

అల్లరి మూక దాడి.. తృటిలో తప్పించుకున్న మహిళా జడ్జి

చండీగఢ్ :అల్లరి మూక దాడి నుంచి ఒక మహిళా జడ్జి తటిలో తప్పించుకున్నారు. మూడేండ్ల కుమార్తెతో కలిసి కారు దిగి ప్రాణ భయంతో పరుగులు తీసి ఓ వర్క్ షాప్‌లో దాక్కున్నారు. ఆ తర్వాత కొందరు న్యాయవాదులు ఆమెను అక్కడి నుంచి రక్షించారు. అయితే రోడ్డుపై వదిలేసిన మహిళా న్యాయమూర్తి కారుకు ఆందోళనకారులు నిప్పుపెట్టడంతో అది పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటన హర్యానాలోని నూహ్‌లో జరిగింది. నూహ్ కోర్టులో అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (ఏసీజేఎం)గా ఉన్న అంజలి జైన్ సోమవారం మధ్యాహ్నం 1 గంటకు తన మూడేండ్ల కుమార్తె, గన్‌మ్యాన్‌తో కలిసి కారులో ఎస్‌కేఎం మెడికల్ కాలేజీకి వెళ్లారు.

కార్యదర్శి కాళ్లపై పడిన జీపీ కార్మికులు

- సమ్మెను నిర్వీర్యం చేయొద్దని వేడుకోలు
- ఆత్మహత్యాయత్నం చేసిన కార్మికుడు

నవతెలంగాణ - విలేకరులు

యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలో గురువారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో భీమలింగం కాల్వ వద్ద చెత్త పేరుకుపోయింది. గ్రామపంచాయతీ అధికారులు జేసీబీ సాయంతో చెత్తను తరలించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్మికులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. పనిని అడ్డుకోవద్దని అధికారులు చెప్పడంతో.. సమ్మెను నిర్వీర్యం చేయొద్దు.. కనికరించండి అంటూ కార్మికులు కార్యదర్శి కాళ్లపై పడి ప్రాధేయపడ్డారు. ఇదే సమయంలో పంచాయతీ అధికారులు మొండిపట్టు వీడాలంటూ కార్మికుడు కొండె నర్సింహా జేసీబీపైకి ఎక్కి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. గమనించిన తోటి కార్మికులు నర్సింహా చేతిలోని పెట్రోల్ బాటిల్ లాక్కుని సర్దిచెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గుండాల మండల కేంద్రంలో వీరభద్రుని వేషధారణ, బోనాలతో కార్మికులు నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారిపై గ్రామ పంచాయతీ కార్మికులు వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు.

వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలి : కార్పొరేటర్



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్జీవోస్ కాలనీలో వెంటనే రోడ్డు పనులను ప్రారంభించాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సంబంధిత వాటర్ వర్క్స్ డీజీం రాజగోపాల్, జీహెచ్ఎంసీ ఏఈ రాకేష్‌తో కలిసి గురువారం కార్పొరేటర్ మట్టి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రయినేజీ పనులు పూర్తి చేసినా, రోడ్డు ఇబ్బందికరంగా ఉందని కాలనీ వాసులు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. త్వరలోనే నూతన రోడ్డును వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి, సుధీర్, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



నవతెలంగాణ - సంతోష్ నగర్

గత వారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు సాయం చేసేందుకు సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సభ్యులు మల్లు లక్ష్మి, మహ్మద్ అబ్బాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు విఠల్, మీనా, నాగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ సత్తార్, జంగయ్య, బాలు నాయక్, లక్ష్మమ్మ శశికళ, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శం



- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - నాగోల్

రాష్ట్రంలో గుణాత్మక ప్రగతి కార్యాచరణను అమలు చేస్తూ తెలంగాణను దేశానికే ఆదర్శంగా సీఎం కేసీఆర్ నిలుపుతున్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. గురువారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలోని సీఎం చాంబర్ లో సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రైతు సంక్షేమం, ప్రజా సంక్షేమం, ఎల్బీనగర్ నియోజకవర్గంలో మెట్రో రైలు విస్తరణ, నోటరీ ఆస్తుల క్రమబద్ధీకరణలతోపాటు తదితర అభివృద్ధి పనులపై సీఎంతో చర్చించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డిలు ఉన్నారు.

'సోయం బాబురావు వ్యాఖ్యలను ఖండిస్తున్నం'

- మల్ రెడ్డి రాంరెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

రాష్ట్రంలో లంబాడీలను గిరిజన జాబితా నుండి తొలగించాలని, లేదంటే మణిపూర్ మారణ హోమం తరహా ఆందోళన చేస్తామని బీజేపీ ఎంపీ సోయం బాబురావు మాట్లాడిన విధానాన్ని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల వైఖరిని తప్పు పట్టారు. ఎల్బీనగర్ లంబాడీ గిరిజన విభాగం చైతన్యపురిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాంరెడ్డి సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న బీఆర్ఎస్ పార్టీ రెండుసార్లు అధికారంలోకి వచ్చి మోసం చేసిందని అన్నారు. గిరిజనుల మధ్య చిచ్చుపెట్టే నాయకులను సహించేది లేదన్నారు. లంబాడీలకు రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన గిరిజన రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ గాంధీ నాయక్ మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయంలో లంబాడీలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సోయం బాబురావును ఎంపీ పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పార్టీలో ఉన్న లంబాడీ నాయకులు దీనిపై స్పందించాలని కోరారు. లేనియెడల అందరూ కలిసి బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎస్టీ సెల్ చైర్మన్ రమేష్ నాయక్, డివిజన్ అధ్యక్షులు చందులాల్, కుర్ర శంకర్ నాయక్, దీప్లా నాయక్, శ్రీనివాస్ నాయక్, అనిత భాయ్, జె.శ్రీనివాస్ నాయక్, మధు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కన్నీళ్లను తుడిచిన కేసీఆర్



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్

ఒక్క నిర్ణయంతో సీఎం కేసీఆర్.. కార్మికుల కన్నీళ్లను తుడిచేశారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వంలో విలీనం చేసి..దాదాపు 43 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన నేపథ్యంలో గురువారం హయత్ నగర్ డిపో 1, 2 లలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సర్కార్ చారిత్రక నిర్ణయం తీసుకుందని కొనియాడారు. ఆర్టీసీని సర్కారులో విలీనం చేస్తున్నట్టు ప్రకటించి కార్మికులు, ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిందని ఆనందం వ్యక్తం చేశారు. సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల రెడ్డి, కొప్పుల విఠల్ రెడ్డి, ముద్రబోయిన శ్రీనివాసరావు, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సాగర్ రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్, డివిజన్ల అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కటికరెడ్డి అరవింద్ రెడ్డి, చింతల రవికుమార్, మహిళా అధ్యక్షురాలు అంజలిగౌడ్, నాయకులు భాస్కర్ సాగర్, గుడాల మల్లేష్, జగదీష్ యాదవ్ నాయకులు ఆర్టీసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎంవీఎస్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాల
ఉద్యోగుల సహకార సంఘం అధ్యక్షుడిగా శ్రావణ్ కుమార్



నవతెలంగాణ - బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని ఎంవీఎస్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉద్యోగుల సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రవణ్ కుమార్ ఎన్నిక య్యారు. గురువారం కళాశాలలో ఎన్నికల నిర్వాహణ అధికారిగా కె.వెంకటేశ్వర్ రెడ్డి వ్యవహరించారు. కళాశాలలో 292మంది ఉద్యోగులు ఉండగా..అందులో 256 మంది ఓట్లు వేసి నూతన అధ్యక్షుడిగా శ్రావణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎన్.కవిత, ప్రధాన కార్యదర్శిగా ఎన్.సంజు, కోశాధికారిగా ఎ.గౌరీదేవిలు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల నిర్వాహకులు వెంకటేశ్వర్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎ.వెంకటయ్య, ఐలయ్య, జె.శ్రీశైలం తదితరులు ఉన్నారు.

జులైలో 10,683 'సోనాలికా' ట్రాక్టర్ అమ్మకాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్త రికార్డు సాధనతో, సోనాలికా ట్రాక్టర్స్ 2024 ఆర్థిక సంవత్సరంలో కేవలం 4 నెలల వ్యవధిలో (ఏప్రిల్-జూలై23) 50వేల ట్రాక్టర్ అమ్మకాల మార్కును దాటింది. జూలై నెలలో కంపెనీ మొత్తం 10,683 ట్రాక్టర్ల అమ్మకాలను నమోదు చేసింది. ఇది 14శాతం దేశీయ వద్ధిని కలిగి ఉంది. తద్వారా పరిశ్రమ వద్ధిని (అంచనా 6.4శాతం) అధిగమించింది. భారతీయ వ్యవసాయ మార్కెట్‌లో సోనాలికా ఆవిష్కరణ ఆధారిత విధానం సుస్థిర రైతు అభివద్ధి దిశగా సరైన మార్గంలో ఉందని ఈ అద్భుతమైన పనితీరు స్పష్టం చేసింది. ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ మాట్లాడుతూ "మా హెవీ డ్యూటీ ట్రాక్టర్ శ్రేణికి రైతుల మద్దతు లభించడం మాకు సంతోషంగా ఉంది. మా బ్రాండ్ పట్ల ప్రేమను పొందడం ప్రతిసారీ 'ఉత్తమమైన దానికంటే మెరుగ్గా చేయడానికి', భారతీయ రైతుల ప్రాంతీయ అవసరాలకు అధునాతన వ్యవసాయ సాంకేతికతను త్వరగా స్వీకరించడానికి మమ్మల్ని ప్రేరేపిస్తుంది. రైతులకు శ్రేయస్సును అందించడం ఐటీఎల్ మూలం, మేం చేసే ప్రతి కొత్త ఆవిష్కరణలో ఎల్లప్పుడూ అంతర్భాగంగా ఉంటుంది. వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించడం, దాన్ని అవలంబించడానికి రైతులకు మద్దతు ఇవ్వడం మా మొదటి ప్రాధాన్యత. ఎందుకంటే ఇది రైతులు శ్రేయస్సు వైపు వేగంగా వెళ్ళడానికి సహాయపడుతుంది' అని తెలిపారు.

మంత్రి నాయకత్వంలో మీర్‌పేట్ అభివృద్ధి

- డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సమగ్ర అభివృద్ధికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి బాటలు వేస్తున్నారని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత మీర్ పేట్..మంత్రి సబితా ఇంద్రారెడ్డి నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని చెప్పారు. వర్షం కురుస్తుందంటే ముంపు ప్రాంతాల్లో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించేవారని అన్నారు. కానీ మంత్రి ఈ విషయాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి.. నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఎస్ఎన్డీపీ నాలా నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. మీర్ పేట్ కార్పొరేషన్ పరిధిలోని మూడు చెరువులను(పెద్ద చెరువు, మంత్రాల చెరువు, చందన చెరువు) ఒకదానికొకటి అనుసంధానం చేస్తూ.. ఎస్ఎన్డీపీ నాలా మొదటి దశలో రూ. 18.19 కోట్ల నిధులతో పెద్ద చెరువు నుండి సీతా హోమ్స్, తిరుమల ఎంక్లేవ్, బాలాజీ నగర్, ఎంఎల్ఆర్ కాలనీ మంత్రాల చెరువు వరకు ఒకటి, అయోధ్య నగర్, బాలాజీ నగర్, ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ, ఎంఎల్ఆర్ కాలనీ మంత్రాల చెరువు వరకు మరొకటి రెండు నాలాలను మంత్రాల చెరువు వరకు నిర్మాణం చివరి దశలో ఉన్నాయన్నారు. రెండో దశ పనులకు ప్రభుత్వం రూ. 35కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ దశలో బీజేపీ క్వార్టర్స్ నుండి చందన చెరువు వరకు ఒక నాలా, విజయ హోమ్స్, ఓంసాయి నగర్, ఆదిత్య నగర్, టికేఆర్ కాలేజీ సౌత్ గేట్ మీదుగా ఆర్ఎన్ రెడ్డి నగర్, నందిహిల్స్ వరకు మరో నాలాను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్‌కు మంత్రి మల్లారెడ్డి ధన్యవాదాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇచ్చిన మాట ప్రకారం రూ.19 వేల కోట్లతో రూ.లక్ష వరకు రైతుల రుణాలు మాఫీ చేయడానికి నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర రైతుల పక్షాన సీఎం కేసీఆర్‌కు శాసనసభలోని సీఎం కార్యాలయంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామ కూర మల్లారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

రహదారిపై పంచాయతీ కార్మికుల భోజనాలు



నవతెలంగాణ - హయత్‌నగర్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజయవాడ జాతీయ రహదారిపై గురువారం వంట వార్పు చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు 29 రోజులుగా సమ్మె చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీ సిబ్బందిని చిన్నచూపు చూస్తూ.. నెల రోజులవుతున్న చర్చలకు రావడం లేదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌ను భూములు, ఇండ్లు, ఆస్తులను గ్రామ పంచాయతీ కార్మికులు అడగలేదన్నారు. కనీస వేతనాలు, ప్రభుత్వ ఉద్యోగులుగా, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని మాత్రమే అడుగుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కనకయ్య, ప్రభాకర్, కార్మికులు వెంకటమ్మ, మన్నెమ్మ, యాదమ్మ, లలిత, స్వరూప, లక్ష్మీమ్మ, మల్లయ్య, అశోక్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్'



నవతెలంగాణ- చైతన్యపురి

సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అన్నారు. రైతులకు లక్ష రూపాయల వరకు రుణాలు మాఫీ చేసినందుకు గాను సీఎం కేసీఆర్ చిత్రపటానికి పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ లాంటి పథకాలతో రైతులను రాజును చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ పథకాలతో పాటు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రామాచారి, న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, ముప్పిడి లింగస్వామి గౌడ్, కంచర్ల శేఖర్, వెంకటేష్ గౌడ్, దుబ్బాక శేఖర్, జగన్, శ్రీరాములు, రమేష్, దేవేందర్, మహిళా అధ్యక్షురాలు లిక్కీ ఊర్మిళా రెడ్డి, అను రాధ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి'



నవతెలంగాణ- చైతన్యపురి

సీఎం కేసీఆర్ 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ తెలంగాణ యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు నిరుద్యోగ భృతి చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ఆయనను చైతన్యపురి పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో వంగాల శ్రీకాంత్ రెడ్డి శ్రీధర్, హరి, శ్రావణ్, విజయ్, అనుదీప్, ఐతగోనిశివగౌడ్, శ్రీనాథ్, నగేష్, రాజు తదితరులు ఉన్నారు.

ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు



ఏలుకొండ రామ్ కోటి

నవతెలంగాణ-హయత్‌నగర్

ఎల్బీనగర్‌లో ప్రతి పక్ష్యాలు ఏకమైనా మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ రెడ్డిదే గెలుపు అని మలి దశ ఉద్యమ కారుడు ఏలుకొండ రామ్ కోటి ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో సారి సుధీర్ రెడ్డి గెలుపుతో ఎల్బీనగర్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని అన్నారు. ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాలు, అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తుందని కొనియాడారు. 60 ఏండ్లలో కానీ అభివృద్ధి తెలంగాణ వచ్చాక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో మరో సారి సుధీర్ రెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

'అధికారుల నిర్లక్ష్యం వలనే
పాఠశాల ముందు మురుగు నీరు'



నవతెలంగాణ-హయత్ నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కేబీఆర్ ఫంక్షన్ హాల్ ఎదుట ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వద్ద డ్రయినేజీ మురుగునీరు కుంటలా మారిందని..దీనికి కారణం అధికారుల నిర్లక్ష్యమే కారణం అని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. డ్రయినేజీ సమస్యను పలుమార్లు జీహెచ్ఎంసీ, సీఆర్ఎంపీ, వాటర్ వర్క్స్ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదన్నారు. దీంతో స్కూల్ ముందు మురుగునీరు నిలిచిందని..విద్యార్థులు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైన ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

'డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా'



నవతెలంగాణ - సంతోష్ నగర్

ఐఎస్ సదన్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ కాలనీ, ఇంద్ర ప్రస్థ కాలనీ పరిధిలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, కాలనీ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, అధికారులతో కలిసి కార్పొరేటర్ ఎస్ఎన్ డీసీ, సీల్డ్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. తర్వాత డివిజన్ లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పలు కాలనీల పరిధిలోని రోడ్ల పనులను త్వరలోనే పూర్తిచేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ అన్సారి, కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ- చైతన్యపురి

సీఎం సహాయ నిధి పేదలకు ఓ వరం అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఫేస్ 3కి చెందిన వినోద్ అనే వ్యక్తికి సీఎం సహాయ నిధి నుంచి రూ.60,000 చెక్కు మంజూరైంది. ఈ మేరకు గురువారం ఆ చెక్కును మంత్రి లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, బీడీ కార్మికులకు, నేతన్నలకు పింఛన్లు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, ప్రధాన కార్యదర్శి సిద్దగోని వెంకటేష్ గౌడ్, మురళీధర్ రెడ్డి, పబ్బు శేఖర్ పాల్గొన్నారు.

ఉబ్బిపోయిన మూత్రపిండం తొలగింపు

- మినిమల్ ఇన్‌వాసివ్ లాపరోస్కోపిక్ విధానం ద్వారా చికిత్స



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారీ స్థాయిలో ఉన్న రాయి కారణంగా తీవ్రంగా ఉబ్బిపోయిన మూత్రపిండాన్ని మినిమల్ ఇన్‌వాసివ్ లాపరోస్కోపిక్ విధానం ద్వారా తొలగించినట్టు ఏసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ సికింద్రాబాద్ వైద్యులు వెల్లడించారు. 68 ఏండ్ల పురుషుడు తన మూత్రపిండాలు ఉబ్బిపోయి దీర్ఘకాలంగా సమస్యతో బాధపడుతున్నప్పటికీ ఎలాంటి రోగ నిర్ధారణ పరీక్షలు చేసుకోకుండా సమస్యను గుర్తించకుండా ఉన్న తరుణంలో ఏఐఎన్‌యూ సికింద్రాబాద్ వైద్యులు ఈ మేరకు శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయ ముప్పును తప్పించారు. ఏఐఎన్‌యూ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ రాఘవేంద్ర కులకర్ణి ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఈ వ్యక్తి మా ఆస్పత్రికి విచ్చేసినపుడు, ఆయనకు వివిధ రకాలైన సమగ్ర పరీక్షలు నిర్వహించగా ఆయన కుడి మూత్ర పిండంలో భారీ స్థాయిలో ఉన్న రాయి మూత్రపిండానికి-మూత్రాశయానికి మధ్య నిలిచిపోవడం వల్ల ఆ కిడ్నీ పనితీరు పూర్తిగా దెబ్బతిందని నిర్ధారణయ్యింది. ఒకవేళ, ఈ రాయిని ఇదే విధంగా ఏండ్ల పాటు ఉండిపోయినా లేదా తగు చికిత్స చేయకపోయినా దానివల్ల మూత్రపిండం పనితీరు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది' అని వెల్లడించారు. చక్కెర వ్యాధి, రక్తపోటు అనారోగ్య సమస్యలతో దీర్ఘకాలంగా బాధపడుతున్న ఈ రోగి సాధారణ రక్తపరీక్షకు వెళ్లారు. సీరం సెరటైనిన్ అధిక శాతం ఉందని గమనించడంతో, ఆల్ట్రాసోనోగ్రఫీ పరీక్ష చేయించుకోగా, ఆయన కుడి మూత్ర పిండం 192-96 మిల్లీమీటర్ల మేర ఉండి కటి వద్ద సమస్యను ఏర్పరచటం, పెల్వియూరెటిక్ వద్ద 19ఎఎ, మూత్రపిండం వద్ద 6ఎఎ ఉందని నిర్ధారణ అయ్యింది. బీఎంఐ పెద్ద ఎత్తున ఉన్నందున పొత్తికడుపు పరీక్షలో ఎలాంటి సానుకూల స్పందన రాలేదు. అనంతరం ఆయనను ఏఐఎన్‌యూ సికింద్రాబాద్‌కు తరలించారు. సిటీ స్కాన్ పరీక్ష అనంతరం కుడి మూత్రపిండంలో సమస్యలు ఉండి 190 ఎక్స్ 107 ఎంఎం మేర విస్తరించిందనీ, పెల్వియూరెటిక్ జంక్షన్ వద్ద 22.1 ఎక్స్ 10.7 ఎక్స్ 13.8 ఎంఎం విస్తరించి మూత్రపిండం, మూత్రాశయంలో సమస్యలు ఏర్పడినట్టు గుర్తించారు. 99 ఎంటీసీ డీటీపీఏ రెనోగ్రామం ద్వారా పరీక్ష నిర్వహించగా కుడి మూత్రపిండంలో సమస్య ఉన్నట్టుగా నిర్ధారణ అయ్యింది. ఎడమ మూత్రపించడం జీఎఫ్ఆర్ 40.76గా నిర్ధారణ అయ్యింది.

పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించాలి



- కార్పొరేటర్ చింతల అరుణ

నవతెలంగాణ - నాగోల్

పరిసరాల పరిశుభ్రత తోపాటు వ్యక్తిగత శుభ్రతను పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటామని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా గురువారం నాగోలు డివిజన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, బండ్లగూడలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. అప్పుడే రోగాలు మన దరి చేరవని అన్నారు. సంవత్సరం వయసు నుండి 19 ఏండ్ల వయస్సు గల వారు ఆరోగ్యంగా ఉండాలంటే.. ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. నులిపురుగుల నివారణ మాత్రలను అన్ని ప్రభుత్వ పాఠశాలలో, అంగన్ వాడీ కేంద్రాల వద్ద ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు.

చిన్నపిల్లలకు మాత్రలు వేసే ముందు గొంతులో ఇరుక్కోకుండా ఉండటానికి శుభ్రమైన తాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మాత్రను వేసిన తర్వాత నులిపురుగులు అధికంగా ఉన్న పిల్లలకు వికారం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం వచ్చే అవకాశం ఉంటుందని.. కంగారు పడకుండా అత్యవసర పరిస్థితిలో మీమీ సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో 104ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, పీటర్, అంగన్‌వాడీ ఆశా వర్కర్లు, ఆయాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'హార్డ్ వేర్ పార్క్ ప్రతిపాదనలను రద్దు చేయండి'



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని హార్డ్ వేర్ పార్క్ ప్రతిపాదనలను రద్దు చేసేదాకా విశ్రమించేది లేదని హార్డ్ వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ హెచ్చరించింది. ఈ నెల 7న నాదర్‌గుల్ నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించనున్న మహా పాదయాత్ర పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హార్డ్ వేర్ పార్క్ హటావో, తెలంగాణ బచావో అనేది తమ నినాదమని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్ వల్ల గత రెండు దశాబ్దాలుగా నాదర్ గుల్, ఆదిభట్ల, ఎం.ఎం. కుంట గ్రామాల ప్రజలకు చెందిన భూములను, నివాస స్థలాలను అక్రమంగా స్వాధీనం చేసుకొని, హార్డ్ వేర్ పార్క్ పేరుతో అప్పటి ప్రభుత్వాలు భూ దోపిడికి పాల్పడ్డారని ఆరోపించారు. అప్పటి ఆంధ్ర పాలకులు హార్డ్ వేర్ పార్కుకు సంబంధించిన నోటిఫికేషన్‌కు ముందే ఈ ప్రాంతంలోని భూములు 80 శాతం నివాస స్థలాలుగా అభివృద్ధి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మొత్తం భూమిని వ్యవసాయానికి పనికిరాని భూమిగా నమోదు చేసి భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదే నోటిఫికేషన్‌లో పేర్కొన్న మొత్తం భూమిని సైతం ప్రభుత్వం సేకరించలేదని, అవసరం ఉన్నంతవరకు భూమిని సేకరించడం జరిగిందని తెలిపారు. మిగిలిన భూములను అన్యాయంగా ప్రభుత్వ ఖాతాలో వేసుకోవడం అన్యాయం ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర పాలకుల నుంచి తెలంగాణను సాధించుకోవడం కోసం మన హక్కుగా పోరాడామన్నారు. ఇప్పుడు మన భూముల కోసం పోరాటం చేయడం మన హక్కు కాదా అని జేఏసీ సభ్యులు అన్నారు.

ఉద్యమానికి సంపూర్ణ మద్దతు..

హార్డ్ వేర్ పార్క్ తొలగింపు కోసం జేఏసీ చేస్తున్న పోరాటాలకు తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని బడంగ్ పేట నగర పాలక సంఘం మాజీ వైస్ చైర్మన్, సీనియర్ నేత చిగిరింత నరసింహా రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండ రామ్ ఇస్తున్న సంపూర్ణ మద్దతును స్వాగతిస్తున్నామన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎంపీటీసీ సభ్యులు, జేఏసీ వైస్ చైర్మన్ కందాడి శ్రీరాం రెడ్డి, కల్లం చంద్రారెడ్డి, హైకోర్టు న్యాయవాది, జేఏసీ నాయకులు మాధవరం రామేశ్వర్ రావు, పెత్తుల్ల ఆనందరెడ్డి, కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన, ఉట్టి శివ, సామ సుధాకర్ రెడ్డి, హార్డ్ వేర్ వ్యతిరేక పోరాట కమిటీ కో కన్వీనర్ టి.నవీన్ యాదవ్, రంగారెడ్డి జిల్లా తెలంగాణ జన సమితి ప్రధాన కార్యదర్శి దారా సత్యం, బంగారి అశోక్, పుట్టగళ్ల జగన్, యాతం కుమార్, ఎం. లింగారెడ్డి, యాతం జంగయ్య, సుభాన్ యాదవ్, బంగారి సుమన్ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్‌గా అశోక్ రెడ్డి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్‌గా వై.అశోక్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. యాదాద్రి భువ నగిరి జిల్లా నుంచి అశోక్ రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన వై. అనిత రెడ్డి.. హైదరాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. అనంతరం నూతన తహసీల్దార్‌ను పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

మృతుడి కుటుంబానికి బీఎల్ఆర్ ట్రస్టు ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ ఎల్లారెడ్డి గూడకు చెందిన మామిళ్ల సత్యనారాయణ ముదిరాజ్ అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి భైరి నవీన్‌గౌడ్ వారికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బండారి లక్ష్మారెడ్డి అనేక సేవా, సామజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిరణ్‌గౌడ్, దాస్‌గౌడ్, కావలి బాల నర్సింహా, సతీశ్ ముదిరాజు, కయిదాల అశోక్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, ఉప్పల్ నుంచి ఈసీఎల్ వరకు మెట్రో రైల్ విస్తరణ, రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని చేపట్టడాన్ని ఆకాంక్షిసూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో యూనియన్ సమస్యలు పరిష్కరిస్తా



- బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

ఆటో యూనియన్ సభ్యుల సమస్యలను పరిష్కరిస్తానని బీఎల్ఆర్చ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం సైనిక్‌పురిలోని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో లక్ష్మారెడ్డిని ఆటో యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ .. ఆటో యూనియన్ సభ్యులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మాస శేఖర్, టీఏ అండ్ డీఏ రాష్ట్ర అధ్యక్షుడు నభి, బాలు, సతీశ్, ఆటో యూనియన్ అధ్యక్షుడు యాదగిరి, రఫిక్, మల్లేశ్, తిరుపతి, వెంకటేశ్, శివ శంకర్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, గజ్జల సత్యరాజ్ గౌడ్, అవినాష్ యాదవ్, కట్ట వీరారెడ్డి, ప్రవీణ్ ముదిరాజ్, సాయి ధీరజ్ రెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ డివిజన్‌లోని లక్ష్మీనారా యణ కాలనీలో రూ.10లక్షల వ్య యంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి జీహె చ్ఎంసీ అధికారుల తో కలిసి గురువా రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భ ంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, ప్రముఖ పారిశ్రామిక వేత్త సంద్రపల్లి వెంకటయ్య, బీఆర్ఎస్ ఉప్పల్ అధ్యక్షుడు వేముల సంతోష్ రెడ్డి ఉన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బాలగంగాధర్‌రావు జయంతి



నవతెలంగాణ-కాప్రా

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో పార్టీ మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ లావు బాలగంగాధర్‌రావు 102వ జయంతిని కమలానగర్ ఆఫీసులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలగంగాధర్‌రావు చిత్రపటానికి పార్టీ కార్యదర్శి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. బాలగంగాధర్‌రావు తెలంగాణ సాయుధ పోరాటంలో జైపాల్ సింగ్ శిక్షణతో నిజాం నిరంకుశ సైన్యాలకు, పటేల్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడి ప్రజల హక్కులను కాపాడారని గుర్తు చేశారు. సుందరయ్య, బసవ పున్నయ్య, మోటూరు హనుమంతరావుల తో పని చేశారని చెప్పారు. పార్టీ కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరో సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సున్నం రాజయ్య సేవలను కూడా కొనియాడారు. ఈ సభకు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. అనంతరం సభకు హాజరైన వారందరూ నివాళులర్పించారు. కార్యక్రమం లో నవతెలంగాణ జీఎం లింగారెడ్డి పీబీచారి, గౌసియా, శోభ, ఉన్నీ కృష్ణ, శ్రీనివాసు, రాజమల్లు, ప్రసాద్ బాబు, సాంబశివరావు, సీనియర్ రిపోర్టర్ యాదగిరి, భూపాల్ రెడ్డి, జహంగీర్, నవతెలంగాణ రవి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో.. ప్రజలకు రక్షణ లేదు: ప్రజా సంఘాలు



నవతెలంగాణ-జవహర్‌నగర్

బీజేపీ పాలనలో దేశ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, మణిపూర్ బాధితులకు అండగా నిలుద్దామని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. కార్పొరేషన్‌లోని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో దివ్యాంగుల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మబ్బుబాలు ఆధ్వర్యంలో మణిపూర్ బాధితులకు అండగా ఆగస్టు 6న అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి భద్రతలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీజేపీని గద్దె దింపే రోజులు దగ్గర ఉన్నాయని హెచ్చరించారు. మహిళల నగ్న ఊరేగింపునకు, సామూహిక అత్యాచారాలు దేశాన్ని కుదిపేశాయని, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర యాదగిరి, ఎర్రగుంట్ల వెంకటేశ్వర్లు, పద్మారావు, సీపీఐ(ఎం) శివన్నారాయణ, సీపీఐ దర్శనం యాదగిరి, యాకస్వామి, ఎల్లయ్య పాషామీయా, అహ్మదాఖాన్, సావిత్రి, ప్రకాష్, వేణు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని స్ట్రీట్ నెంబర్ 8లోని రోడ్డు నెంబర్ 1లో రోడ్డును కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మించుకున్న వారిపై చర్యలు తీసుకుని ప్రహరీగోడ ను తొలగించాలని ఉప్పల్ ఉప కమిషనర్ శ్రీనివాస్‌కు సీపీఐ (ఎం) నాయకులు ఎర్రం. శ్రీనివాస్, సీఐటీయూ నాయకు లు వెంకన్న, ఐద్వా నాయకురాలు వినోద వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు గా విధులు నిర్వహించిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగినే ప్రభుత్వ రోడ్లకు కబ్జా చేసి యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట భీష్మాచారి, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-ఉప్పల్

ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పల్ సర్కిల్‌లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, కాలనీలలోకి మురిరుగునీరు వస్తుండడంతో దోమలు బెడద ఎక్కువైందని తెలుగు దేశం పార్టీ లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు కొండ్రాన్ పల్లి గిరిబాబు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. కాలనీలలో రోడ్లు, డ్రయినేజీ, దోమలు సమస్యను నివారించాలన్నారు. దోమలతో ప్రజలకు డెంగ్యూ, మలేరియా వ్యాధులు సోకుతున్నాయని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉండేలా మున్సిపల్ సిబ్బందికి సూచించాలని కోరారు.



చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు మంజూరు చేయాల్సిన రోడ్లు, జరుగుతున్న అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌తో కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను కూడా మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు.

-నవతెలంగాణ,కాప్రా

మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

- మెట్రో రైల్‌ను మేడ్చల్ వరకు తీసుకురావాలి
- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్
- మేడ్చల్ జాతీయ రహదారి వివేకానంద విగ్రహం వద్ద రాస్తారోకో



నవతెలంగాణ-సిటీబ్యూరో/మేడ్చల్

మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనీ, మెట్రో రైల్‌ను హైదరాబాద్ నుంచి కండ్లకొయ్య వరకు కాకుండా మేడ్చల్ వరకు తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. ఈ రెండు విషయాలపై అసెంబ్లీలో మాట్లాడాలనీ, లేదంటే చలో అసెంబ్లీ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మేడ్చల్ జాతీయ రహదారి వివేకానంద విగ్రహం దగ్గర గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని 2007 నుంచి పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మేడ్చల్ నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చిన మంత్రి మల్లారెడ్డి గెలిచాక మాట తప్పారన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రాని పర్మిషన్, మల్లారెడ్డి యూనివర్సిటీ, మెడికల్ కాలేజీకి ఎలా వస్తుందని ప్రశ్నించారు. మేడ్చల్ పర్యటన సందర్భంలో మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేసే బాధ్యత మాదీ అని హామీనిచ్చి విస్మరించారన్నారు. పేద, బడుగు, బలహీన విద్యార్థులు చదువుకునే డిగ్రీ కళాశాల మంజూరు చేయండని ఏండ్లుగా పోరాటం చేస్తున్నా రాజకీయ నాయకులు మాత్రం ఆ విషయాన్ని రాజకీయ మేనిఫెస్టో వరకే ఉపయోగిస్తున్నారు తప్పా కళాశాల ఏర్పాటు చేయడం లేదన్నారు.

మేడ్చల్ వరకు మెట్రో రైల్ తీసుకురావాలి..

ఈ మధ్యకాలంలో హైదరాబాద్ నుంచి కండ్ల కొయ్య వరకు మెట్రో రైలు తీసుకొస్తామని కేటీఆర్ పత్రిక ప్రకటన చేశారని.. మెట్రో రైల్ కండ్లకోయ వరకు కాకుండా మేడ్చల్ వరకు తీసుకురావాలని కోరారు. మేడ్చల్‌లో కూడా జనాభా పెరిగిపోయిందని, పేద, బడుగు, బలహీన విద్యార్థులు, ప్రజలు హైదరాబాద్‌కి రావాలంటే ట్రాఫిక్ పెరిగిపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అందుకే మెట్రో రైల్‌ని హైదరాబాద్ నుంచి మేడ్చల్ వరకు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెట్రో రైలు విషయం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలని మంత్రి మల్లారెడ్డికి విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు ఎండీ ఆదిల్, మండల సహాయ కార్యదర్శి ఎండీ మహెూలానా, మండల నాయకులు కిరణ్, రమేష్, శ్రీను, శ్రీకాంత్, అరుణ్, ప్రసాద్, మురళి, కృష్ణ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్. బాల మల్లేష్
- ఓట్లు.. సీట్లు ప్రామాణికం కాదు



నవతెలంగాణ-కాప్రా

ఓట్లు, సీట్లు ప్రామాణికం కాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది కేవలం కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాల మల్లేష్ ఉద్ఘాటించారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సమావేశం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాల మల్లేష్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓట్లు ప్రాధాన్యత ప్రామాణికం అయినప్పటికీ ప్రస్తుతం రాష్ట్రంలో పాలకవర్గాలు ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం నష్టం కలిగించే విధానాలను అనుసరిస్తున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీటితో నిండిపోయాయని తెలిపారు. అయినా ప్రభుత్వం నివారణ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.500కోట్ల నిధులు సరిపోవని, తక్షణమే రూ.2000వేల కోట్ల నిధులను యుద్ధప్రాతిపదికన మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్దిదారులకు రెండు పడకల ఇండ్లను కేటాయించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ. సాయిలుగౌడ్ మాటా ్డుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను లబ్దిదారులకు అందించడంలో వైఫల్యం చెందుతున్నదని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శులు జీ. దామోదర్ రెడ్డి, ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, దశరథ్, జె. లక్ష్మీ, ఆర్. కృష్ణమూర్తి, రచ్చ కిషన్, కె. ధర్మేంద్ర పాల్గొన్నారు.

డీసీ వైఖరిని నిరసిస్తూ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి కార్మికులను ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని నిరసిస్తూ కాప్రా సర్కిల్ శానిటేషన్ కార్మికులు కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట గురువారం బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. శానిటేషన్ నిర్వహిస్తున్న కార్మికులపై డిప్యూటీ కమిషనర్ వేధింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. కార్మికుల ధర్నాకు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రవీణ్ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ యాదవ్ పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ధర్నాతో కాప్రా సర్కిల్ కార్యాలయంలో పనులు ముందుకు కొనసాగలేదు.



'ఇండ్లు కోల్పోతున్న బాధితులను ఆదుకోవాలి'



నవతెలంగాణ-ఘట్కేసర్

రైల్వే వంతెనలో ఇండ్లు కోల్పోతున్న బాధితులకు గతంలో ఇచ్చిన సర్టిఫికెట్ల ఆధారం భూమిని కేటాయించాలని కోరుతూ ఘట్కేసర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ పలుగుల మాధవరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి నివాసంలో గురువారం కలిశారు. కార్యక్రమం లో ఘట్‌కేసర్ మున్సిపాల్టీ బీఆర్ ఎస్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ముల్లి జంగయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ మేకల నర్సింగ్‌రావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సోషల్ మీడియా సభ్యులు సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

- గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్
- మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ కోరారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డిని గురువారం కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో జీపీ కార్మికుల సమస్యలపై మాట్లాడి పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. జీపీ కార్మికులు చేస్తున్న పనులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి రావాల్సిన హక్కులు కల్పించాలని కోరారు. కార్మికులందరికీ ప్రమాద బీమా పథకం, 11వ పీఆర్సీ ప్రకారం వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకుడు శివ బాబు, సీఐటీయూ నాయకులు సుధాకర్, గ్రామపంచాయతీ నాయకుడు సుధాకర్, ముత్యాలు, శ్రీనివాస్, బాబు, రవి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామాలైన ఘనపూర్, ఘనపూర్ తండాలను కలుపుతూ నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు గురువారం జిల్లా కలెక్టర్, డీపీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018ఏడాది లో కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటు చేయలేదని తెలిపా రు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాలలో 1500 మంది జనాభా నివసిస్తున్నారని తెలిపారు. 1200మంది ఓటర్లుగా నమోదు చేయబడ్డార ని చెప్పారు.ఈ రెండు గ్రామాలకు ఆదాయ వనరులైన కంపెనీలు, మెడిసిటీ ఆస్పత్రి, మెడికల్ కళాశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. జనాభా ప్రతిపాదన ప్రకారం ఘనపూర్ నూతన గ్రామపంచాయతీని ఏర్పాటు చేయాల ని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు మేకల సుధాకర్, గుల్లయ్య గారి రాజు గౌడ్, నవీన్ కుమార్, విఠల్ రెడ్డి,కిషన్ నాయక్ ఉన్నారు.

ప్రజా సేవలో నిరంతరం కొనసాగుతా..

ఘనంగా హరిశంకర్ రెడ్డి జన్మదిన వేడుకలు, శుభాకాంక్షలు తెలిపిన నేతలు

నవతెలంగాణ-బోడుప్పల్

నిరంతరం ప్రజా సేవలోనే ఉంటూ ప్రజలకు సేవ చేస్తానని పీర్జాదిగూడ నగర కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి అన్నారు. గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా మంత్రి మల్లారెడ్డి నివాసంలో ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మేయర్, కార్పొరేటర్లు, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నేతల సమక్షంలో కేక్ కటింగ్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపు కున్నారు. అనంతరం డివిజన్ ప్రజలు, అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనాథ ఆశ్రమంలో నిత్యావసర వస్తువులు అందించారు. ఈ వేడుకలో పీర్జాదిగూ డ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించాలని డాక్టర్ల ధర్నా



నవతెలంగాణ-ఉప్పల్

రామంతాపూర్‌లోని ప్రభుత్వ హెూమియోపతి ఆస్పత్రిలో ఎనిమిదేండ్లుగా స్టైఫండ్ పెంచకుండా వైద్య విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వ వైఖరి మారాలని జూనియర్ డాక్టర్లు ఎనిమిదిరోజులుగా ధర్నా నిర్వహిస్తున్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం సాయి కిరణ్ వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రభుత్వం విద్యా, వైద్యం పై పూర్తి అలసత్వం ప్రదర్శించడం రాష్ట్రానికి మంచిది కాదని హెచ్చరించారు. హైకోర్టు విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని ఆదేశాలు జారీ చేసినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. సమస్యలను సుప్రీంకోర్టులో దాఖలు చేసే దుస్థితికి తెచ్చారని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభు త్వాన్ని హెచ్చరించారు. వైద్య విద్యకు తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయుష్ జూని యర్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు, సభ్యులు రాఘవేంద్ర రెడ్డి, రాంబాబు, కార్తీక్, అరవింద్, రవీందర్, దినేష్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖాన సిబ్బంది సమయ పాలన పాటించాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

బస్తీ దవాఖాన సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం ఆయన మేడిపల్లిలోని భగత్‌సింగ్ నగర్ బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బస్తీ దవాఖాన ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి వైద్య సేవలను సద్వినియోగం చేసుకునేలా చైతన్యపర్చాలని సూచించారు. ఓపీ, సాధారణ ఇమ్యునైజేషన్, రక్త నమూనాల సేకరణ, టీ-డయాగ్నోస్టిక్ సేవలు, టెలి-కన్సల్టేషన్ సేవలను మెరుపర్చాలని ఆదేశించారు. భారీ వర్షాల దష్ట్యా పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో కండ్లకలక, ఏఎస్‌వీ (యాంటీ స్నేక్ వెనమ్), ఏవీఆర్ (యాంటీ రాబీస్ వ్యాక్సిన్) సహా అన్ని అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని, లేకుంటే జిల్లా కార్యాలయానికి సమాచారం అందిస్తే అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తామని సూచించారు. వైద్య అధికారులు, ఏఎన్ఎం, ఆశాలు అన్ని రెసిడెన్షియల్ స్కూల్స్, వెల్ఫేర్ హాస్టల్స్, వద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలను సందర్శించి హాస్టల్ వార్డెన్లు, ప్రిన్సిపాల్స్, కేర్‌టేకర్ల సమన్వయంతో వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ : మున్సిపల్ చైర్‌పర్సన్



నవతెలంగాణ-ఘట్కేసర్

విద్యార్థుల ఆరోగ్యంపై మున్సిపల్‌లో తగిన శ్రద్ధ తీసుకుంటున్నామని ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నులి పురుగుల మందును పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కడుపులో నులి పురుగులు వృద్ధి చెందితే అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. నులి పురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, బలహీతన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. 5 ఏండ్ల నుంచి 19 ఏండ్ల లోపు పిల్లలపై నులిపురుగులు తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎం విమలారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత, డాక్టర్ ఫణిద్ర, బీఆర్ఎస్ నాయకులు సిరాజ్ , ఏఎన్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను రాజులను చేయడమే సీఎం లక్ష్యం

నవతెలంగాణ-ఘట్కేసర్



రైతులను రాజులను చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారని రైతు సేవా సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ సింగిరెడ్డి రాంరెడ్డి అన్నారు. మండలంలోని ఎదులాబాద్‌లో సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీ ప్రకటించడంతో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం జరిపించారు. కార్యక్రమంలో మండల రైతు బంధు సమితి అధ్యక్షులు కొంత అజిరెడ్డి సహకార బ్యాంకు వైస్ చైర్మన్ అనంతరెడ్డి, ఉపసర్పంచ్ ఉప్పు లింగేశ్వర్, బ్యాంకు డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి, పోచిరెడ్డి, వార్డు సభ్యులు ఎర్రోళ్ల శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు కుమార్, మంకయ్య, సత్తయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అండగా ఉంటాం

మాజీ డీసీసీ అధ్యక్షులు కే. ఎం. ప్రతాప్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలో, సుచిత్ర చౌరస్తా నుండి జీడిమెట్ల గ్రామం, అంగడిపేట గ్రామం, మెయిన్ రోడ్డు హైవే నెంబర్ 44ను అనుకొని వీధి వ్యాపారం చేస్తున్న వ్యాపారులు వారి యొక్క వ్యాపారం సజావుగా నడుపుకోవ డానికి అండగా నిలవాలని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం. ప్రతాప్‌ని కోరారు. వెంటనే స్పందించి ప్రతా ప్ కుత్బుల్లాపూర్ సర్కిల్ 25 జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, సంబంధిత అధికారులతో చర్చించి వీధి వ్యాపారులకు ఐడి కార్డులను ఇప్పించారు. వ్యాపారులకు అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. దీంతో వ్యాపారులు ప్రతాప్‌ని కలిసి శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

నాలా పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

గురు గోవింద్ సింగ్ నగర్(సిక్కు బస్తీ)లో నాలాలో పూడిక తీత పనులను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలిం చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో,ఆల్విన్ కాలని డివి జన్ పరిధిలోని, గురు గోవింద్ సింగ్ నగర్ వాసుల ఇండ్లు వరద నీటితో ముంపుకు గురైందన్నారు. ఇప్పుడు వర్షాలు ఆగి వరద నీరు తగ్గగానే, గురువారం రోజున డివిజన్ కార్పొరేటర్ వరద నీటి సమ స్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా, జీఎచ్ఎంసీ సిబ్బందితో కలిసి నాలలోని పూడిక తీసే పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు, డివిజన్ అధ్యక్షుడు సమ్మా రెడ్డి, కాశీనాథ్ యాదవ్ పాల్గొన్నారు.

ఇబ్బడిముబ్బడిగా అక్రమ నిర్మాణాలు

- ఆఫీస్‌లో మాటలు.. చెట్ల కిందే సెటిల్ మెంట్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వినాయక్ నగర్, నేరేడ్‌మెట్ డివిజన్‌ల పరిధిలో అక్రమ నిర్మాణాలు ఊపందుకున్నాయి. అనేక ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే బహుళ అంతస్థుల భవన నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయంటే టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని పలువురు అంటున్నారు. మరికొన్నిచోట్ల ఒకటి రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని ఏకంగా ఐదు,ఆరు అంతస్తుల నిర్మాణాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ భవన నిర్మాణాలకు సంబంధించి స్థానికులు నుంచి ఫిర్యాదులు వస్తే టౌన్ ప్లానింగ్ అధికారులే మధ్యవర్తిత్వం వహిస్తూ జోరుగా సెటిల్మెంట్‌లు చేస్తున్నారని..ఆఫీస్‌లో మాటలు.. చెట్ల కిందే సెటిల్ మెంట్లు అంటూ విమర్శలు వస్తున్నాయి. వినాయక నగర్ డివిజన్ పరిధిలో జీ ప్లస్ 2 పర్మిషన్ తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా జీ ప్లస్ 5 అంతస్తులు నిర్మిస్తున్నారని తెలుస్తోంది. సెట్ బ్యాక్‌లు లేవు, సెల్లార్లకు పర్మిషన్లు లేవు...అయినా యజమా నులు తమ ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు మాత్రం వారి వాటా ఇచ్చుకోండి.. ఎన్ని అంతస్తులైనా కట్టుకోండి అంటూ చోద్యం చూస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. డివిజన్‌ల పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఓ సెక్షన్ ఆఫీసర్ వకాల్తా పుచ్చుకొని అటు టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు, ఇటు నిర్మాణదారులతో మాట్లాడి పెద్ద ఎత్తున సెటిల్మెంట్‌లు చేసి లక్షలాది రూపాయలు జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని వివేకానందపురం బస్ స్టాప్ సమీపంలో కింద కమర్షియల్ ఆపైన పెంట్ హౌస్‌ల నిర్మాణం ఊపందుకుంది. నియంత్రించాల్సిన అధికారులు ఆఫీసులో బ్రోకర్లతో కుమ్మక్కై, సెటిల్మెంట్లు ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్‌ను వివరణ కోరితే అక్రమ కట్టడాలు, సెటిల్ మెంట్స్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. న్యాక్ ఇంజనీర్స్ టాస్క్ ఫోర్స్ వారు చూసుకుంటున్నారని సమాధానం ఇచ్చారు. అధికారుల స్వలాభంతో జీహెచ్ఎంసీ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతున్నదని, అనుమతుల కోసం జీహెచ్ఎంసీకి చెల్లించాల్సిన డబ్బులు కాస్త అధికారుల జేబుల్లోకి నేరుగా వెళున్నాయనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. చేతివాటానికి అలవాటు పడ్డ అధికారులు కిందిస్థాయి సిబ్బంది నిర్వాకం కారణంగానే అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు అక్రమ నిర్మాణాలు, అవినీతి అధికారుల అమ్యామ్యాలపై దష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై కొత్తగా బాధితులు స్వీకరించిన టౌన్ ప్లానింగ్ డీసీపీ వివరణ కోరగా అక్రమ నిర్మాణాలను సహించేది లేదని, టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎవరైనా అక్రమ నిర్మాణాలకు సహకరిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రగతి యాత్రలో భాగంగా ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

129 సూరారం డివిజన్ పరిధిలోని కళావతి నగర్, టీఎస్ఐఐసీ కాలనీలో గురువారం 95వ రోజు "ప్రగతి యాత్ర"లో భాగంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పర్యటించారు. అదే విధంగా రూ. 84.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం టీఎస్ఐఐసీ కాలనీ శ్రీ వెంకటేశ్వరా స్వామి టెంపుల్ కమాన్ నిర్మాణాకి భూమి పూజా చేసారు. అదేవిధంగా ఎమ్మెల్యే సొంత నిధులతో బోరు ఏర్పాటు చేసి నల్లా కనెక్షన్‌ని ప్రారంభించారు. తమ కాలనీలో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేసినందుకు గాను ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తపరుస్తూ ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సౌకర్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సౌకర్యవంతమైన రహదారులు, త్రాగునీరు, మెరుగైన విద్యుత్, డ్రయినేజీలు వంటి మౌలిక వసతులతో ప్రతి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిదుతున్నమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు హెచ్ఎండబ్ల్యూఎస్ జీఎం. శ్రీధర్ రెడ్డి, డీఈఈ శిరీష, ఏఈ సంపత్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జనరల్ సెక్రెటరీ సిద్ధిక్, సీనియర్ నాయకులు చెక్క సురేష్ బాబు, కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నులి పురుగుల మందు పంపిణీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోగల పాపిరెడ్డి నగర్‌లోని, నోబుల్ ఛాన్స్ చిల్డ్రన్స్ పాఠశాలలో, స్థానిక అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన, ఆల్బెండజోల్ టాబ్లెట్స్ నులి పురుగుల నివారణకై మందు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణల ఆదేశాలతో గురువారం పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి హాజరై నులిపురుగుల మందులను పిల్లలకు వేసి పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సభ్యులు సబిత, శ్రీలత, ఆశ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: జాతీయ నులిపురుగుల దినోత్సవం



సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ఆదేశాల మేరకు గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్ లిల్లీ మోడల్ స్కూల్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రామూయాదవ్ గురువారం విద్యార్థులకు టాబ్లెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధా, లిల్లీ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ షేక్ సయ్యద్ అహ్మద్, ప్రిన్సిపల్ హాజ్రా బాయ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకి ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీపీహెచ్ఓ శేషు, పద్మ, డాక్టర్ కపూర్, సూపర్‌వైజర్ ప్రకాష్, సత్యనారాయణ రెడ్డి, మాధవి, ఎస్.ఆర్.ప్రసాద్, చెన్నా రెడ్డి, తిక్కం తదితరులు పాల్గొన్నారు.



నేరేడ్‌మెట్: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి అల్బెండజోల్ మాత్రలు వేయించాలని వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ఆమె వినాయక నగర్ డివిజన్ పరిధిలోని నలందా స్కూల్ విద్యార్థులకు సఫిల్ గూడ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో (నేషనల్ డి వార్మింగ్ డే) పాల్గొని, చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవన్, ఏఎన్ఎంలు స్వప్న, శైలజ, స్కూల్ ప్రిన్సిపల్ భాస్కర్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, గోపాల్, సంతోష్ పాల్గొన్నారు.



మద్యం దుకాణాలకు రిజర్వేషన్ల కేటాయింపులు



- జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

2023-25 సంవత్సరానికి నూతన మద్యం పాలసీ ద్వారా రిజర్వేషన్‌లను ఖరారు చేయడానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆబ్కారీశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ లక్కీ డ్రా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీ ప్రకారం జిల్లాలో మద్యం దుకాణాలను ఎస్టీ, ఎస్సీ, గౌడలకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి రిజర్వేషన్ మేరకు లాటరీ ద్వారా కేటాయించినట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు అరుణ్ కుమార్, విజయ భాస్కర్, జిల్లా బీసీ సంక్షేమాధికారి కేశూరామ్, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి వినోద్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పాలసీ ప్రకారం గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన జిల్లాలోని మద్యం దుకాణాలకు కేటాయింపులు జరిపారు. ఈ సందర్భంగా డ్రాలో మేడ్చల్ వ్యాప్తంగా 114 మద్యం దుకాణాలు ఉండగా... గౌడ కులస్తులకు 11 దుకాణాలు, ఎస్సీలకు 5 దుకాణాలు, ఎస్టీలకు ఒకటి చొప్పున వచ్చాయి. మల్కాజిగిరిలో 88 మద్యం దుకాణాలకు గాను గౌడ కులస్తులకు 12 దుకాణాలు, ఎస్సీలకు 7 దుకాణాలు, ఎస్టీలకు ఒక దుకాణం చొప్పు న వచ్చాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన కేటాయింపులు జరిపి వాటికి సంబంధించి డ్రా తీసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఆయా రిజర్వేషన్ల ప్రాతిపదికన డ్రా పద్ధతిన మద్యం దుకాణాలను కేటాయింపులు జరిపినట్టు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రాజేష్‌కుమార్, శ్యామ్ ప్రకాశ్, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ...

నవతెలంగాణ-కూకట్‌పల్లి



వరద బాధితుల సహాయార్థం సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండలం కమిటీ ఆధ్వర్యంలో, గురువారం రోజున సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుండి కళా మందిర్ బస్ స్టాప్ వరకు సాఫ్ట్ షాపులో విరాళాలు సేకరించారు. ఈ కార్యక్ర మానికి సీపీఐ(ఎం) కూకట్ పల్లి మండల కార్యదర్శి ,మేడ్చల్ జిల్లా నాయకులు, ఎం శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా భూపాలపల్లి ములుగు వరంగల్ జిల్లాలో, మోరంచపల్లి , భద్రాచలం తదితర గ్రామాల్లో వరదలు వచ్చి గ్రామాలు మొత్తం కూడా నీట మునిగాయని ఇల్లు వాకిలి వదిలి ప్రాణభయంతో ప్రజలు వేరే ప్రాంతాలకు చేరుకుని తమ ప్రాణాలను కాపాడుకున్నారని అన్నారు. వరదలు తగ్గిపోయాక చూస్తే అక్కడ సర్వం కోల్పోయిన పరిస్థితి ఉందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే సహాయక చర్యల్లో భాగంగా వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పార్టీగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు, అన్ని మండలాల్లో జిల్లాల్లో విరాళాలు సేకరించి వాళ్లకు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) స్థానిక నాయకులు కే కృష్ణ నాయక్, పి ధర్మారావు, బి రాజులు ,జి మల్లయ్య, రాఘవరావు పాల్గొన్నారు.

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో 9వ డివిజన్ కార్పొరేటర్ రజిత రవికాంత్ తరుపున, స్థానిక డివిజన్ ఆయా కాలనీ,అపార్ట్మెంట్స్ అసోసియేషన్ వారి సహకారంతో వరద బాధితుల కోసం నిత్యావసర వస్తువులు



సేకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ఇటీవలే ములుగు జిల్లాలో పలు గ్రామాలు నీట మునిగిన నేపథ్యంలో జిల్లా నియోజిక వర్గం దొడ్ల,మేడారం వంటి ప్రాంతాల్లో వరద బాధితుల కోసం సహాయార్థం బియ్యం, నిత్యావసరాలవస్తువులు, బట్టలు, దుప్పట్లు సామాగ్రి సేకరణ వంటివి దాదాపు వెయ్యి మంది వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేయడం జరుగుతుందని మేయర్ తెలిపారు. వరదల్లో నష్టపోయిన బాధితులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ప్రజలను కోరారు. సీనియర్ నాయకులు రవికాంత్, బీఆర్ఎస్ జాయింట్ సెక్రటరీ దండుగుల స్వామి,స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్, ఫణి కుమార్, శేషు, రాజు, రమేష్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలి

- నులిపురుగుల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి
- ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమాజంలోని పిల్లలకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం హబ్సిగూడలోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో 1-19 ఏండ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-19 ఏండ్ల మధ్య ఉన్న పిల్లలకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వేదిక ద్వారా మొత్తంగా సమాజంలో అంటువ్యాధుల వ్యాప్తిని తగ్గించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. నులిపురుగుల నిర్మూలన మెరుగైన ఆరోగ్యం, పాఠశాల హాజరుతో ముడిపడి ఉంటుందన్నారు. సమాజంలో పిల్లలకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించి జిల్లాను నులిపురుగుల రహితంగా తీర్చిదిద్దాలని కోరారు. కీసర డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నారాయణరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.సరస్వతి, డాక్టర్ రఘునాథ్ స్వామి, పీఓ ఎన్సిడీ డాక్టర్ కౌశిక్, డీఎస్ఓ, డాక్టర్ జీవనజ్యోతి, ఎంఓ, బీడీకే హబ్సిగూడ, స్కూల్ హెడ్‌మాస్టర్ రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి ఆదేశించిన సీఎం కేసీఆర్‌కి పాలాభిషేకం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దిండిగల్ మునిసిపాలిటీ బౌరంపేట్‌లోని ప్రాథమిక వ్యయసాయ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం వద్ద రైతులకు పంట రుణమాఫీ కార్యక్రమం పునఃప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించిన సందర్భంగా వారి చిత్రపటానికి రైతులతో కలిసి ఘనంగ పాలాభిషేకం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాక్స్ చైర్మెన్ మిద్దెల బాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 29.61 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి జరుగుతదని తెలిపారు. ఇప్పటికే రైతులకు 17,351 కోట్ల రుణాలు మాఫీ జరిగాయి, త్వరలో 19,000 కోట్ల రుణాలు మాఫీ జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంకర్ నాయక్, సాయి యాదవ్, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, మురళి యాదవ్, విష్ణు వర్ధన్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్లు జీతయ్య కిష్టయ్య, వెంకటేష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద రైతు రుణ మాఫీ పునః ప్రారంభించినందుకుగాను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రివర్యులు కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సూచనలతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు,నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్యాట్నీనుండి కండ్లకోయ వరకు, మియాపూర్ నుండి ఇస్నాపూర్ వరకు, ఎల్బీనగర్ నుండి పెద్ద అంబర్‌పేటకు, ఉప్పల్ నుండి బీబీనగర్ వరకు, తార్నాక నుండి ఈసిఐఎల్ వరకు మెట్రో రైల్‌ని విస్తరించినందుకు, కాపు సమతి సంక్షేమ సంఘం భవనానికి 5 ఎకరాల స్థలం కేటాయించినందుకు గాను, గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ని అసెంబ్లీలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరికపూడి గాంధీ, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్, ఎల్.బి. నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి , ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే దానం నాగేందర్, అంబర్ పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/కూకట్‌పల్లి

మైనంపల్లి వాణీ పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-మల్కాజిగిరి

నియోజకవర్గ శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంతరావు సతీమణి మైనంపల్లి వాణీ పుట్టినరోజు సందర్భంగా గురువారం శక్తి మహిళా మండలి అధ్యక్షులు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణా అధ్యక్షురాలు అనురాధ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. మహిళా సాధికారత కోసం ఎమ్మెల్యే దంపతులు నిత్యం కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసింబాయి, స్వప్న, పద్మ, వర్షిత, ఆశా,షేక్ జాను. ఎం.బాలేశ్వరి, కవిత, బుచ్చమ్మ, రేఖ, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో రైతు పక్షాన నిలిచి రుణమాఫీ, రైతుబంధు, ఉచిత విద్యుత్ పథకాలు తీసుకుని వచ్చి, ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తూ రైతుల గుండెల్లో కేసీఆర్ చెరగని ముద్ర వేసుకున్నారని ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తెలిపారు. రైతు రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ని గురువారం ప్రగతి భవన్‌లో కేసీఆర్ రైతులకు చేసిన మంచి పనులను తమ గుండెల్లో ముద్ర వేసుకున్న ఫోటోను బహుకరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్క సుమన్‌తో పాటు టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-దుండిగల్

సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు

నవతెలంగాణ-సిటీబ్యూరో



టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పి.సాయి బాబా అన్నారు. ఆర్టీసీకి ప్రభుత్వం బాకాయి ఉన్న రూ. 1600 కోట్లకుపైగా బకాయిల ఎగవేతలో భాగమేనని అన్నారు. గురువారం అశోక్‌నగర్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికలలో ఓట్లు రాబట్టు కోవడానికి చేస్తున్న కుట్రగా, ప్రభుత్వం ఆడుతున్న నాటకమని అయన అభివర్ణించారు. ఆర్టీసీకి తెలంగాణా వ్యాప్తంగా వివిధ జిల్లాలలో ఉన్న వేల కోట్ల ఆస్తులను అమ్ముకొని కమీషన్లు దండుకొనే ప్రయత్నంలో భాగమే ప్రభుత్వంలో ఆర్.టీ.సీని విలీనం చేయడమే అన్నారు. నిన్నటిదాకా ఆర్.టీ.సీ విలీనానికి వ్యతిరేకంగా మాట్లాడిన సీఎం కేసీఆర్ అకస్మాత్తుగా ప్రభుత్వంలో విలీనం చేయడంలో కుట్రదాగి ఉందన్నారు. రాష్ట్రంలోని ముఖ్య పట్టణాలు, నగరాల నడిబొడ్డులో ఉన్న ఆర్టీసీ ఆస్తులను అమ్ముకోవడానికి మార్గం సుగమం చేసుకున్నారని, బస్టాండ్లు, బస్ డిపోల వేల ఎకరాల ఆస్తులను దిగమింగాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినందుకు ఆర్టీసీ ఉద్యోగులకు పెద్దగా ఒరిగేదేమీ లేదన్నారు. ఆర్టీసీపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆర్టీసీకి ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసి ఉద్యోగులకు రావలసిన బకాయిలు చెల్లించాలని, చనిపోయిన ఆర్టీసీ కార్మికులకు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజు గౌడ్, సత్యనారాయణ, ఎల్.రవిగౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలతో మమేకమై పనిచేస్తా..



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ మరోసారి తిరిగి పట్టం కట్టేందుకు సంసిద్ధులై ఉన్నారని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా పాత బోయిన్‌పల్లి డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజలవద్దకే మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా మూడవరోజు గురువారం డివిజన్ పరిధిలోని తదితర ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. స్థానిక మహిళలతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్ది చేపడుతున్న అభివృద్ధి, అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు జరిగిన అభివృద్ధికి కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కృష్ణారావు ఆదేశించారు.

కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తుంది

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ మహిళా కాంగ్రెస్ కమిటీ సభ్యులకు టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం నియామక పత్రాలు అందజేశారు. గురువారం బోయిన్‌పల్లి డివిజన్ మహిళా అధ్యక్షురాలు విజయ లక్ష్మి ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ కమిటీని నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టీపీసీసీ అధికార ప్రతినిధి, పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం, మాజీ పీసీసీ కార్యదర్శి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ దండుగుల యాదగిరి హాజరయ్యారు. వారి చేతుల మీదుగా డివిజన్ జనరల్ సెక్రటరీగా కె. పద్మ వైస్ ప్రెసిడెంట్లుగా మానస కళ్యాణి, పి.సంతోషమ్మ, పి.నిర్మల, కె.శ్వేత, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి. దేవేంద్రమ్మ, ఇ. శ్రీదేవి, కె. కోమల, సెక్రటరీలుగా వై. భాగ్య లక్ష్మి, ఎ.ఇందిరలకు నియామక పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటూ సమాన గౌరవిస్తుందన్నారు. వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించిన కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరి కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పటిష్ట పరచాలని తెలిపారు. మహిళలకి సహాయ సహకారాలు అందిస్తామని సత్యం శ్రీరంగం తెలియచేసారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ యాదవ్, బాలాజీ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్ పుత్, ఏ బ్లాక్ అధ్యక్షురాలు రమాదేవి, బాలానగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు రేణుక, బేగంపేట్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు రాధా, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ అవసరం



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెక పూడి గాంధీ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నేటి సమాజంలో చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరం అని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెక పూడి గాంధీ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని బృందవన్ కాలనీకి చెందిన మార్షల్ ఆర్ట్స్ ఫిట్నెస్ అకాడమీ విద్యార్థి నాగసాయి అరుషి గత నెల 28 నుంచి 30వ తేది వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో రాజధాని సింగ్ బాబు స్టేడియంలో జరిగిన ఆరవ టైక్వాండో జాతీయ ఛాంపియన్షిప్ 2023లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి కాంస్యం పతకం సాధించింది. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే గాంధీ విద్యార్థినిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందచేసి ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి క్రీడాకారిని, కోచ్‌ను ప్రత్యేకంగా అభినదించారు. ఆత్మ రక్షణ కోసం టైక్వాడ్, కరాటే కుంఫూ విద్యలు ఎంతగానో దోహద పడుతాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని మరిన్ని పతకాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ మధుసూదన్, తండ్రి పవన్ కుమార్,బీఆర్ ఎస్ పార్టీ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్ కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ రెవెన్యూ డివిజన్ ఆఫీస్ పరిపాల నాధికారి (ఏఓ)గా పి.కృష్ణకుమార్, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ ఆఫీస్ (ఏఓ)గా జె.బుచ్చయ్యలకు పోస్టింగ్ లభించింది. మండల తహసీల్దార్లుగా కె.అనిత (సైదాబాద్), వై.అనితా రెడ్డి(షేక్‌పేట), సంధ్యారాణి(హిమాయత్‌నగర్), ఎస్.జ్యోతి(ఆసిఫ్‌నగర్), ఎండీ నయీమొద్దీన్(ఖైరతాబాద్), భీమయ్య గౌడ్(అమీర్‌పేట), ఎస్ అశోక్ కుమార్(తిరుమలగిరి), జయమ్మ(బండ్లగూడ), పద్మసుందరి (మారేడుపల్లి), ప్రేమ్‌కుమార్ (నాంపల్లి), పాండునాయక్(చార్మినార్), డి.అహల్య (గోల్కొండ)లకు పోస్టింగ్ లభించింది.

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర ప్రసాద్


పి.వెంకటేశ్వర ప్రసాద్


బి.రాంబాబు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడిగా పి.వెంకటేశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బి.రాంబాబు ఎన్నికయ్యారు. గురువారం ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షలుగా రాష్ట్ర కమిటీ పక్షాన రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వెంకటేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి కోర్టు వివాదాలను పరిష్కరించి వెంటనే షెడ్యూల్‌ను ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రామానందయ్య, జిల్లా, మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి సంచలనం..!


ఫైల్ ఫోటో

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తన నోటి మాటలతో ఎప్పుడూ ఏదో ఒక హాట్ కామెంట్ చేస్తూనే ఉంటారు. ఆయన మాట్లాడిన యాస గానీ.. ఆయన బిహేవియర్‌కు కొందరు జనాలు ఫిదా అవుతారు. మొన్నటికి మొన్న 'నాకు సినిమాల్లోకి రావాలని ఉంది. అవకాశం ఇస్తే వస్తానంటూ' ఓ సినిమా ఫంక్షన్‌లో మాట్లాడారు. ఏదైనా కార్యక్రమానికి వెళ్తే అక్కడున్న వాతావరణాన్ని బట్టి అక్కడి జనాలకు తనదైన శైలిలో జోష్ తెప్పిస్తారు. ఇదంతా ఒక ఎత్తయితే.. రెండు రోజుల క్రితం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై స్పందించిన మంత్రి మల్లారెడ్డి, నిన్న అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా కాంగ్రెస్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

- ఆర్టీసీ, కాంగ్రెస్‌పై కామెంట్లతో జనాల్లో చర్చ..!
- తన గ్రాఫ్ పెరిగిందంటూ వ్యాఖ్య..!

నవతెలంగాణ-సిటీబ్యూరో

తన వ్యాఖ్యలతో.. తన మ్యానరిజంతో ఎప్పుడూ సోషల్ మీడియాలో, మెయిన్ స్ట్రీమ్ మీడియాలో ట్రెండింగ్‌లోనే ఉంటారు మంత్రి మల్లారెడ్డి. ఆయన మైక్ పట్టుకున్నారంటే.. డైలాగుల వరద పారుతుంది. ఒక్కో డైలాగు ఒక్కో ఆణిముత్యంలా మారిపోయి.. మల్లారెడ్డిని సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తుంది. తనదైన శైలి వ్యాఖ్యలతో అలరిస్తుంటారు. ఒక్కోసారి ఆయన చేసే కామెంట్లు రాజకీయ వర్గాల్లో, జనాల్లో చర్చనీయాంశంగా కూడా మారుతుంటాయి. అలాంటి వ్యాఖ్యలే మరో సారి చేశారు మంత్రి మల్లారెడ్డి. ప్రస్తుతం ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. అన్ని పార్టీల్లో తనకు మంచి మిత్రులు ఉన్నారనీ, కాంగ్రెస్ అధిష్టానంలో తనకు దోస్తులు ఉన్నారని చెప్పారు మల్లారెడ్డి. తన నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది తానే నిర్ణయిస్తానని అన్నారు. గత ఎన్నికల్లో కేఎల్‌ఆర్‌కి తానే కాంగ్రెస్ నుంచి టికెట్ ఇప్పించినట్టు మంత్రి మల్లారెడ్డి చెప్పారు. ఈసారి కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు అనేది తానే డిసైడ్ చేస్తానని అన్నారు. ఈ సారి కూడా తన గెలుపును ఎవరూ ఆపలేరని మల్లారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతూ.. తొడ గొట్టిన తర్వాత తన గ్రాఫ్ మరింతగా పెరిగిందని మంత్రి మల్లారెడ్డి చెప్పుకొచ్చారు. కొన్ని మీడియా సంస్థలు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తూ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయన్న మంత్రి, త్వరలోనే మీడియా సంస్థను ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఏడాదికి నాలుగు తెలంగాణ యాస సినిమాలు తీస్తానని చెప్పారు. మంత్రివర్గ విస్తరణ అంటే మల్లారెడ్డి పోస్టు ఊడుతుంది అని తప్పుడు ప్రచారం చేశారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్, బీజేపీ దగ్గర 'డబుల్ బెడ్ రూం' అంశం తప్ప వేరే సబ్జెక్టు లేదని ఎద్దేవా చేశారు.

ఆర్టీసీ విలీనంపై వ్యాఖ్యలు..

"ఆర్టీసీ ఉద్యోగులు కూడా మన బిడ్డలే. మన కార్మికులే అని చెప్పి మొన్న క్యాబినెట్ మీటింగ్‌లో పెద్ద ఎత్తున డబుల్ కా మీటా, డబుల్ ధమాకా ఇచ్చినం. తాము ఇలా ప్రభుత్వ ఉద్యోగులు అవుతామని వాళ్లు కలలో కూడా ఊహించి ఉండరు. ఎప్పటికీ ఆర్టీసీలోనే ఉంటమని అనుకున్నరు. ఇయ్యాల అందర్నీ ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా ప్రభుత్వంలో కలుపుకున్నం. సీఎం కేసీఆర్ మహాత్ముడు, ఆయన భగవంతుడి స్వరూపం. ఏది చేసినా గొప్ప పని చేస్తడు. ఆయన లెక్క ఎవ్వరూ పని చేయలేరు." అని మంత్రి మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. ఇక ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం ఎన్నికల స్టంటా..? అని విలేకర్లు ప్రశ్నించగా, "ఎన్నికల స్టంట్ అనుకో.. ఏదైనా అనుకోండి.. మాది రాజకీయ పార్టీ, అని మంత్రి వ్యాఖ్యానించారు. "మాది రాజకీయ పార్టీ వయా.. ఎన్నికలనుకో.. ఏదన్నా అనుకో.. కార్మికులకైతే న్యాయం జరిగిందా లేదా..? వాళ్ల భవిష్యత్ మంచిగా అయిందా లేదా..? ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చినయా..? లేదా..? ఎన్నికలకు ఎట్లనన్నా పోతం, ఎన్నికల స్టంట్ ఉంటది. ఇది రాజకీయ పార్టీ. కానీ, చేసే దిల్, ధైర్యం కావాల. ఎంత ఫండ్స్ కావాలె. ఎంత ధైర్యం కావాల. అది మా కేసీఆర్‌కే ఉంది" అంటూ మంత్రి మల్లారెడ్డి జనాలు, రాజకీయ వర్గాల్లో చర్చ జరిగేలా చేస్తున్నారు.

పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ విధానం ద్వారా చాలా పారదర్శకంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైదరాబాద్ అబ్కారి జిల్లాకు సంబంధించిన 80 దుకాణాలకు, సికింద్రా బాద్ జిల్లాలో 99 మద్యం షాపులకు లాటరీ నిర్వహించారు. ఈ మద్యం దుకాణాల కేటాయింపులో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం, గౌడ సామాజిక వర్గానికి 15 శాతం చొప్పున రిజర్వేషన్లు కల్పించినట్టు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఎస్టీలకు-1, ఎస్సీలకు-4, గౌడ సామాజిక వర్గానికి-5, సికింద్రాబాద్ ఎక్సైజ్ జిల్లాలో ఎస్టీలకు-1, ఎస్సీలకు-7 గౌడ సామాజిక వర్గానికి-6 దుకాణాలు కేటాయించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, హైదరాబాద్ సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు విజయ్, పవన్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి యాదయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖాధికారి ఆశన్న, జిల్లా గిరిజనా భివృద్ధి అధికారి సంధ్య పాల్గొన్నారు.



జ్ఞాన్‌భాగ్ కాలనీలోని పారామౌంట్ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు నూలి పురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్న కార్పొరేటర్ లాల్ సింగ్. పానీపూర క్లస్టర్ ఎస్ పి హెచ్ ఓ డాక్టర్ మల్లీశ్వరి, మహారాజ్ గంజ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ చందర్., ఏఎన్ఎం అనిత, సంజీవ, ఆశ వర్కర్లు కల్పన, పుణ్యవతి, సునీత రేఖ, రేణుక, పద్మ భాగ్య, బాలమణి పాల్గొన్నారు
నవతెలంగాణ -సుల్తాన్ బజార్

అడ్డగుట్టలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని వెంటనే నిర్మించాలి

- మారేడుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలి
- ప్రజా ప్రయోజనాల కోసం ఆ భూములను ఉపయోగించాలి
- భూ కబ్జాదారులను కఠినంగా శిక్షించాలి సీపీఐ(ఎం) డిమాండ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

అడ్డగుట్టలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని వెంటనే నిర్మించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. సీపీఐ(ఎం) సికింద్రాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.వెంకటేష్, సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఎం.అజయ్ బాబులు మాట్లాడారు. కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని, ఆ భూములను ప్రజల అవసరాల కోసం ఉపయోగించాలని, భూ కబ్జాదారులను కఠినంగా శిక్షించాలన్నారు. పేద ప్రజానీకం అడ్డగుట్టను కష్టపడి 1978-79 సంవత్సరాలలో ఏర్పాటు చేసుకున్నప్పుడే భవిష్యత్తు అవసరాల కోసం అంజయ్య లాంటి పెద్దలు, అనునిత్యం పేదల పక్షాన ఉన్న కమ్యూనిస్టు పార్టీల నాయకులు కొంత భూమిని మిగిలించారని తెలిపారు. ఆ భూమిని అద్దె (కిరాయి) భవనాలలో ఉన్న ఎమ్మార్వో ఆఫీస్, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ హైస్కూలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, టెలిఫోన్ ఎక్స్చేంజ్ సంస్థలను సొంత స్థలాల్లో ఏర్పాటు చేయించుకోగలిగామన్నారు. దాదాపు 50 వేల జనాభా అడ్డగుట్ట, 2 లక్షలు దాటిన మండల జనాభాకు 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ఇంటర్, డిగ్రీ కాలేజీలు, కళ్యాణ మండపం, ప్రభుత్వ హైస్కూల్ ఆటంకంగా ఉన్న ఎమ్మార్వో ఆఫీస్‌కు స్థలం కావాల్సిన అవసరముందన్నారు. మారేడుపల్లి మండల పరిధిలోని సర్వే 74, 844/1లలో 603 ఎకరాల ప్రభుత్వభూమి ఉంటే సొసైటీల పేరుతో కబ్జాచేసి ఇండ్లు నిర్మించుకున్న వారు కొందరైతే, ఆ భూములు మావి అని కబ్జా చేయడానికి కొంతమంది ప్రభుత్వ అధికారులను, కొంతమంది స్థానిక రాజకీయ నాయకులను అండదండలతో కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. పేదవాళ్ళ నివాసం కోసం 50-60 గజాల ఇంటి స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. పేదలు గుడిసెలు వేసుకుంటే అరెస్టులు, జైలు పాలు చేసిన రెవెన్యూ అధికారులు, పోలీసులు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు భూ కబ్జా దారులకు ఇళ్ళు నిర్మించుకోడానికి పర్మిషన్ ఎలా ఇచ్చారు? ప్రశ్నించారు. దాదాపు 75శాతం భూమి కబ్జా అయిందన్నారు. పెద్దలకు ఒక న్యాయం, పేదలకు ఒక న్యాయమా? అంటూ ధ్వజమెత్తారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వ భూములను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల అన్ని రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఏ. బాలయ్య, జోన్ నాయకులు ఆర్. మల్లేష్, టీ. మహేందర్, ఆర్. వీరలక్ష్మి, ఎం.గోపాల్, ఆర్. అంజమ్మ, ఎం. కిరణ్, ఎం. భీమయ్య రాపర్తి, ప్రభాకర్, ఎస్. లలిత, పూలమ్మ నర్సింగ్, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్స్:

- అడ్డగుట్టలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం కోసం ఎం.పీ., ఎం.ఎల్.ఎ.లు రెండు సార్లు శంకుస్థాపన చేసిన ఆ స్థలంలోనే ఆసుపత్రిని వెంటనే నిర్మించాలి.

- మారేడుపల్లి మండల జనాభా 2 లక్షలు దాటింది. మండల కేంద్రం అయినా అడ్డగుట్టలో జనాభాకు అనుగుణంగా 100 పడకల ఆసుపత్రిని వెంటనే నిర్మించాలి.

-2004లో వచ్చిన రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం, 2005లో మహీంద్రాహిల్స్‌లో, 4 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇల్లు లేని పేదవారికి "రాజీవ్ గృహకల్ప" నిర్మిస్తానన్నా భూమిని పేదల ఇండ్ల స్థలాలకు కేటాయించాలి.

- కనీస సౌకర్యాలైన ఇంటర్, డిగ్రీ కళాశాలలు, కల్యాణ మండపం, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి, మారేడుపల్లి మండల ఆఫీసుకు కూడా ప్రభుత్వం స్థలం కేటాయించాలి.

గిరిజన సంచార తెగల కథలు 'ఇప్పపూలు' ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీవగిరిజన సంచార తెగల కథలు సంకలనం ఇప్పపూలును ఉస్మానియా విశ్వవిద్యాలయం లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మడి అనురాధ ఆవిష్కరించారు. ప్రముఖ కవి, కథకులు జీవన్ సంపాదకీయంలో వెలువడిన కథల సంకలనం ఇప్పపూలు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు అధ్యక్షతన జరిగిన సభలో అనురాధ మాట్లాడుతూ ఈ కథ సంకలనం గిరిజనుల జీవితాలకు అద్దం పడుతోందన్నారు. అధ్యక్షత వహించిన రఘు మాట్లాడుతూ 2009లో 29కథలతో వెలువడి ఈ సంకలనం 14ఏండ్ల తరువాత మరో 14 కథలను కలుపుకొని మరోసారి ఆవిష్కరణ జరగడం అభినందనీయమపాకపనేజ ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి విద్యాసాగర్, ప్రముఖ కవులు నిఖిలేశ్వర్ , అమ్మంగి వేణుగోపాల్, జయరాజ్, ఆచార్య సూర్యధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

షాహి ఇనాయత్ గంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన నాగం రవీందర్‌ను కలిసి సన్మానిస్తున్న గోషామహల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్ బాల్ ముకుంద, సాల్మన్, పవన్ చారిలు. అనంతరం అఫ్జల్ గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ సంతోషం ను, మంగళ్ హాట్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ ను కలిసి సన్మానించారు.
నవతెలంగాణ - ధూల్ పేట్



సీఎం కేసీఆర్‌ను కలిసిన సాయన్న కుమార్తెలు

నవతెలంగాణ-కంటోన్మెంట్



దివంగత కంటోన్మెంట్ సిట్టింగ్ ఎమ్మెల్యే జి.సాయన కుమార్తెలు లాస్యనందిత, నివేదితలు ముఖ్యమంత్రి గురువారం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారి ఆశీర్వాదాలు అందజేసి యోగాక్షేమాన్ని అడిగి, పలు విషయాలని అడిగి తెలు సుకున్నారు. అనంతరం సభ ప్రారంభం కాగానే ఎమ్మెల్యే సాయన్నకు శ్రద్ధాంజలి ఘటించి కొద్దిసేపు సభ్యులు మౌనం పాటించారు.

మంత్రిని కలిసిన డీసీ, ఇన్‌స్పెక్టర్లు

నవతెలంగాణ-బేగంపేట







ఖైరతాబాద్ జోన్ జీహెచ్ ఎంసీ డీసీగా జగన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అదేవిధంగా బేగంపేట సీఐ భాస్కర్, గోపాలపురం ట్రాఫిక్ సీఐ సైదులు మంత్రిని కలిశారు. అనంతరం మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రి శాఖ ఏర్పాటు చేయాలి

- బీసీలకు వాటా ఎప్పుడిస్తారు?
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి వినతి పత్రం



నవతెలంగాణ-అడిక్‌మెట్

బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమాన వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ ప్రకారం ప్రధాన మంత్రి హెూదాలో జోక్యం చేసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య కోరారు. ఈ మేరకు గురువారం ప్రధాని నరేంద్ర మోడీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఈ దేశంలో కేంద్ర ప్రభుత్వాలు గత 75 సంవత్సరాలుగా బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదని, విద్యా,ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో కనీస ప్రాతినిధ్యం లభించలేదన్నారు. అన్ని సామాజిక కులాలకు వారి వారి జనాభా ప్రకారం అన్ని రంగాలలో వాటా ఇవ్వాలన్నారు. ఇది రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య హక్కు స్వాతంత్రం వచ్చినప్పుడు బీసీలకు అసెంబ్లీ - పార్లమెంట్‌లో రిజర్వేషన్లు పెట్టకుండా అన్యాయం చేశారన్నారు. పార్లమెంటులో బీసీబిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఉద్యోగులకు ప్రమోషన్లను రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు బీసీలకు జనాభా ప్రకారం 27శాతం నుండి 56 శాతంకు పెంచాలని, విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్లపై ఉన్న క్రిమి లేయర్‌ను తొలగించాలని, అలాగే ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలని కోరారు. ఎస్సీ /ఎస్టీ అట్రా సిటీయాక్ట్ మాదిరిగా బి.సి.లకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బీసీయాక్ట్ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవి, దశల వారీగా పరిష్కరిస్తామని, అన్నీ రంగాలలో సమాన వాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమయ్యిందని, ఇంకా పూర్తి స్థాయి న్యాయం చేయడం కోసం చర్యలు తీసుకుంటామని ప్రధాన మంత్రి హామీ ఇచ్చారు అని తెలిపారు. ఈ సమా వేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ , లాల్ కృష్ణ, డా.మరేష్, డా.పద్మలత, రమేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి యువత ఆలోచించాలి

- రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్

నవతెలంగాణ-కంటోన్మెంట్



యువత కంటోన్మెంట్ అభివృద్ధి కోసం ఆలోచిం చాలని తెలంగాణ రాష్ట్ర మిన రల్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ పిలుపు నిచ్చారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలో 8వ షీటా క్స్ కార్యక్రమాన్ని నిర్వహించా రు. కార్యక్రమంలో పలువురు యువతులు పాల్గొని తమ ఆలోచనల ను పంచు కున్నారన్నారు. బహుళజాతి కంపెనీలలో ఉపాధి అవకాశాలు, వ్యవస్థాపకత, స్వయం ఉపాధి మహిళా సాధికారత గురి ంచి చర్చించారు. సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ యువత వారి ఆలోచ నలను కంటోన్మెంట్ అభివృద్ధి కోసం కూడా కేటాయించాలని, అలాగే ప్రభుత్వ పథకాలన్నిటిని ఉపయోగిం చుకోవాలని పట్టుదలతో ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మౌనిక, మానస, మంజు, పూజా సమీన్, శ్రీన్, వైష్ణవి, ఉదయ శ్రీ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మా అభివృద్ధికి సహకారం అందించండి

- తెలంగాణా రాష్ట్ర మున్నూరుకాపు సంఘం

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఒకే కులం ఒకే రాష్ట్రం మున్నూరు కాపుల నినాదం ఎత్తుకొని ప్రతి జిల్లాలో ఒక ఎకరం భూమి 2 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ మున్నూరు కాపు కార్పొరేషన్ సాధన కోసం కృషి చేయాలని తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉమ్మడి రాష్ట్రంలో ఏపీలో రూ.5వేలకోట్ల నిధులు కేటాయించి సంఘాన్ని బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టారన్నారు. ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండి కూడా 75శాతం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న వారికి సహకారం అందించకపోవడం దారుణమన్నారు. మహిళకు అన్ని రంగాల్లో సమాన అవకాశం ఇవ్వాలని కోరుతూ తమ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని, ప్రస్తుతం జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో తమ ప్రజాప్రతినిధులు ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. తమ అభివృద్ధికి తోడ్పాటు సహకారాన్ని అందించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆర్వి మహేందర్ కుమార్, కృష్ణవేణి, వల్లెళ్ళ ప్రసాద్, కసారం రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఆరోగ్యవంతుడే కోటీశ్వరుడు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఆరోగ్యమే మహాభాగ్యమని.. నేడు ఆరోగ్యవంతుడే కోటీశ్వరుడని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా రాజభవన్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఆహార పదార్థాలను తినేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కో వాలని లేకపోతే కడుపులోకి సూక్ష్మ క్రిములు వెళ్లి మనం తినే బలవర్ధకమైన ఆహారాన్ని మన శరీరానికి చేరకుండా చేస్తా యని తెలిపారు. అలాగే పిల్లల ఎత్తు, మెదడు ఎదగకుండా చేస్తాయన్నారు. ఒకప్పుడు నులిపురుగులు బాధితులు 65 శాతం ఉంటే.. నేడు 1 శాతానికి రావడం శుభ రిణామమన్నారు. ఈ ఒక్క శాతం కూడా లేకుండా చేయ డానికి కృషి చేయాలన్నారు. ఒకటో తరగతి నుంచి కాలేజీ చదివే విద్యార్థుల వరకు అంటే 3 నుంచి 19 ఏండ్ల వయసు ఉన్న వారు ఈ ఆల్బెండ జోల్ మాత్రలు వేసు కోవాలని, మీరు, మీతోపాటు ఉన్నవారికి చెప్పి వారు తీసు కునేటట్టు చేయాలన్నారు. ఈ మాత్రలు అర్హులైన ప్రతీ ఒక్కరికి చేరేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా పాఠశా లలోని విద్యార్థులకు కలెక్టర్ ఆల్బెండజోల్ మాత్ర లు వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయా రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి, సంయుక్త సంచాలకులు సుధీర, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రీకళ, ఖైరతాబాద్ మండల డిప్యూటీ ఈవో సామ్యూల్ రాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ పాల్గొన్నారు.



ఆస్పత్రికి వచ్చే రోగులను శ్రద్ధగా పరీక్షించాలి

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులను శ్రద్ధగా పరీక్షించి.. వారికి కావాల్సిన మందు లను ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం చింతల్ బస్తీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వివరాలు మెడికల్ ఆఫీసర్‌ని అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్స్, పేషెంట్స్ చార్ట్‌ను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను తిరిగి పరిశీలించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేషెంట్లకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య ఎస్‌పీహెచ్‌వో నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



- 8న చలో ట్రాన్స్‌పోర్ట్ భవన్ ముట్టడి
- రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ చైర్మెన్ బి.వెంకటేశం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ చైర్మెన్ బి.వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికై 2023 ఆగష్టు 8న రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నిర్వహించే రవాణా కమీషనర్ కార్యాలయం 'చలో ట్రాన్స్ పోర్ట్ భవన్' ముట్టడిని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ చైర్మన్ బి.వెంకటేశం పిలుపునిచ్చారు.గురువారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) హైదరాబాద్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షులు కొంరెల్లి బాబు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి బి.వెంకటేశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..2014 సంవత్సరం నుండి అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల కారణంగా ఆటో రిక్షా డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతున్నాయని, ఆటో రిక్షా డ్రైవర్లు దుర్భమైన పరిస్థితులలో జీవనం గడుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. గ్రీన్‌టాక్స్, లైఫ్‌టాక్స్, రోడ్‌టాక్స్, ఫిట్‌నెస్ పెనాల్టీలు వంటి పన్నులు వేసి ఆటో డ్రైవర్లను రవాణా శాఖ దోచుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రైవేట్ మోటారు రవాణా కార్మికుల సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకు రవాణా కార్మికుల సంక్షేమ నిధి బోర్డును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆటో డ్రైవర్లగా ఉపాధి పొందేందుకు ప్రయత్నిస్తున్న నిరుద్యోగ యువతకు కొత్త ఆటో పర్మిట్లను జారీ చేయాలని డిమాండ్ చేశారు.దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటోరిక్షా సంఘాల జేఏసీ పెద్ద ఎత్తున ఆందోళనల పిలుపులో భాగంగా ఆగష్టు 8న నిర్వహించే "చలో ట్రాన్స్ పోర్ట్ భవన్" ముట్టడి కార్యక్రమాన్ని ఆటో డ్రైవర్లు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.జంగయ్య, గౌరవ అధ్యక్షులు ఎండి. ఒమర్ ఖాన్, సలహాదారులు ఏ.బిక్షపతి యాదవ్, నర్సిరెడ్డి, నేతలు జి.మల్లేష్, ఎస్.కె.లతీఫ్, వెంకన్న, శ్యామ్ లాల్ నాయక్, హరి దర్శన్, తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హెూల్, మురికి కాల్వల పరిశీలన



నవతెలంగాణ-కంటోన్మెంట్

మోండా మార్కెట్ డివి జన్‌లో వ్యాపారస్తులు మురుగు నీరు సాఫీగా వెళ్లే విధంగా చూసుకోవాలని డివిజన్ కార్పొ రేటర్ దీపిక తెలిపారు. గురు వారం ఆమె డివిజన్‌లోని పలు ప్రాం తాలలో మెన్ హెూల్ వ్యవస్థను మురికాల పనితీరు పరిశీలించారు. సోలాపూర్ స్వీట్‌హౌస్ వద్ద ఉన్న కమాన్‌లో ఓవర్‌ఫ్లో అవడంతో అక్కడ దుకాణదారులు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ ఆ ప్రాంతంలో పర్యటించారు. హెచ్ఎం డబ్ల్యు ఎస్ఎస్‌బి డీజీఎం శశాంక్, మేనేజర్ సంధ్య , ఫీల్డ్ ఆఫీసర్ నవీను, రాజు సిబ్బందితో సమస్యను పరిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లా డుతూ అక్కడున్న షాప్‌యజమానులు, హెూటల్‌నిర్వాకులు సరైన సిల్ట్ చాంబర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం హెూటల్ నిర్వ హికులు దుకాణదారులు ఇలాంటివి పాటించకపోవడం వల్ల సమస్య తరచూ ఉత్పన్నమవుతుందని, వెంటనే చాంబర్లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.అనంతరం రాఘవేంద్ర టిఫిన్స్‌అరిటాకుల గల్లిలో కూడా పూలు అమ్ముకునే వాళ్ళు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ సమస్యని పరిశీలించి వెంటనే శాశ్వత పరిష్కారం చేపడతామని హామీ ఇచ్చారు.

విద్వేషాలకు సామూహిక సృజన సమాధానం



- కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత మెర్సీ మార్గరెట్

నవతెలంగాణ-ముషీరాబాద్

విద్వేషాలకు సామూహిక సృజన సమాధానం అని కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత మెర్సీ మార్గరెట్ అన్నారు. సమూహ ఆవిర్భావ సభ పోస్టర్ ఆవిష్కరణ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమూహ ఆవిర్భావ సభ ఆగస్టు 12న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రముఖ సినీ కళాకారులు, రచయిత, సామాజిక కార్యకర్త ప్రకాష్ రాజ్, వక్తలు ఆంధ్ర జ్యోతి సంపాదకులు కే శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, విశ్రాంతి ఆచార్యులు పద్మజా షా మీర్ ఆయాబ్ అలీఖాన్, రచయిత, జర్నలిస్టు భూక్య భంగ్యా, ప్రొఫెసర్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆవిర్భావ సభలో పాల్గొనున్నారని, ఈ ఆవిర్భావ సభకు రచయితలు కవులు కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుల్ని అణిచివేయడానికి సాధనాలుగా న్యాయ వ్యవస్థతో సహా రాజ్యాంగబద్ధమైన అన్ని వ్యవస్థల్ని పాలకులు దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. రాజ్యమే రౌడీగా మారి పౌరుల మీద దాడి చేస్తున్నదని, మూక హత్యలకు వత్తాసు పలుకుతున్నదని సామాజిక వాస్తవాలు మాట్లాడుతున్నందుకు, విశ్లేషిస్తున్నందుకు విశ్వవిద్యాలయాల ఆచార్యులు స్వాతంత్ర మేధావులను ,జర్నలిస్టులను వెంటాడు తుందన్నారు. అరసం రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ ఒకవైపు విద్యాలయాలు మతవాదులు యుద్ధ భూమిగా మార్చుతున్నారన్నారు. విజ్ఞాన దర్శిని టీ రమేష్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం అనే పేరిట బహుళత్వాన్ని రద్దు చేసే కుట్ర జరుగుతుందన్నారు. ప్రజలందరికీ ఒకే చట్టం సమానత్వ భాష వెనుక సంఘపరివార ఏకతా భావన తప్ప ఆధునిక విలువలు లేవని చెప్పారు. ఇందులో ఉమ్మడితనంగాని, ఐక్యత గాని లేదని, ఒకే జాతి, ఒకే సంస్కృతి ఒకే భాష, కాషాయం తప్ప మరేమీ ఉండకూడదని ఇది ఎవరు అవుననా్న ..కాదన్నా.. ఇది పక్కా ఫాసిజమే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ మహేందర్, విజయేంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల అభ్యున్నతికి చేయూత

- గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

మైనారిటీల అభ్యున్నతికి చేయూత నివ్వాలని, వారి అభివృద్ధికి కృషి చేయాలని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిని, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు శ్రీమోతెశోభన్‌రెడ్డిలను ముస్లిం సంఘం సభ్యులు కోరారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ముస్లింలకు మైనారిటీలోన్‌ను మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. లాలాపేట్, తార్నాకలో నివసిస్తున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందే విధంగా చూడాలని, అభ్యున్నతికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పేదరికాన్ని పారద్రోలాలనే దార్శనికతతో కేసిఆర్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తార్నాక డివిజన్‌లోని ప్రతి పేద ముస్లిం మైనారిటీలకు ప్రభుత్వ అందజేస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సాయం అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట



తాగునీటి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గురువారం గోల్నాక డివిజన్ పరిధిలోని మారుతి నగర్ లో 6 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా వేయనున్న మంచి నీటి పైప్ లైన్ పనులకు అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీలో పాదయాత్ర నిర్వహించి, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ యుద్ధప్రాతికంగా అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అలాగే చేపట్టాల్సిన ఇతర అభివృద్ధి పనుల గురించి అధికారులు త్వరలోనే ప్రతిపాదనలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ గౌడ్, గాజుల గోపాల్, నర్సింగ్ యాదవ్, లింగం యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమి లక్ష్యంగా పోరాడాలి

- సీపీఐ(ఎం) నగర నాయకులు ఏం.మహేందర్



నవతెలంగాణ-అంబర్‌పేట

రానున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమి లక్ష్యంగా పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా సంఘాలు పోరాడాలని సీపీఐ(ఎం) నగర నాయకులు ఎం మహేందర్ అన్నారు. గురువారం అంబర్ పేట నియోజకవర్గ సీపీఐ(ఎం) పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం సామాజిక వర్గాలను ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలను టార్గెట్ చేస్తూ మత రాజకీయాలతో దేశాన్ని మొత్తం నాశనం చేస్తుం దని, సంపదనేమో అంబానీ, అదానీలకు దోచిపెడుతుందన్నారు. మరోపక్క సామాన్యులకు నిత్యవసర రేట్లు భారాలు మోపుతుందన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ పట్ల జాగ్రత్తగా ఉంటూ అంబర్‌పేటలో బీజేపీ అభ్యర్థిని ఓడించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యమాలో నాయకులు రాములు, సుబ్బారావు, షబానా, వరలక్ష్మీ, సోమయ్య, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లల్లో ఆంధ్ర లిక్కర్ లాబియింగ్ అరికట్టాలి



- సబ్సిడీతో కూడిన రిజర్వేషన్‌ను బేషరత్తుగా అమలు చేయాలి
- తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్యాయ కమిటీ నాయకులు

నవతెలంగాణ-ముషీరాబాద్

మద్యం టెండర్లల్లో ఆంధ్రాలిక్కర్ ల్యాబీంగ్‌ను అరికట్టాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగానీ బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలీ వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మెన్ ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్, పోతగాని ఐలన్ గౌడ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యేటా ఆంధ్రలో ప్రభుత్వమే లైసెన్సలను నిర్వహించడం వల్ల అక్కడి పెట్టుబడిదారులు తెలంగాణ మీద పడి వారి బినామీల పేరుతో లైసెన్స్‌లో పెట్టు బడు లు పెట్టి ఆదిపత్యం చెలాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న 17 డిస్లరీలు, బాటిలింగ్ ప్లాంట్లు అ న్ని ఆంధ్ర పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్నాయని వాపో యారు. ప్రభుత్వం వారితో కుమ్మక్కై తెలంగాణ ప్రజల సొమ్మంతా ఆంధ్రకు తరలిస్తు న్నారన్నారు. ఇప్పటికి తెలంగాణలో ఏరులై పారే మద్యం అంతా ఆంధ్ర డిస్ట్రిబ్యూటర్లదేనని మద్యం షాపులు కూడా వారి చేతుల్లో ఉన్నాయని అన్నారు. లైసెన్స్ రిజర్వేషన్లు ఇచ్చిన ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ ఇవ్వడం లేదని ఆవే దన వ్యక్తం చేశారు. టెండర్ల రుసుం లేకుండా సబ్సిడీతో కూడిన రిజర్వేషన్లను బేషరత్తుగా అమలు చేయాలని కోరారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

- కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట



విద్యార్థులు ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు జాగ్రత్తగా చూసుకోవాలని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం జాతీయ నూలి పురుగుల దినం సందర్భంగా అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ సంబంధిత జీహెచ్ఎంసి వైద్య సిబ్బందితో కలిసి పటేల్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నులి పురుగుల మందు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అధికంగా వర్షాలు కురిసిన కారణంగా పిల్లలకు అంటువ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆశా వర్కర్లు విజయలక్ష్మి, సిబ్బంది పాషా,శ్రీనివాస్, ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంతోష్‌చారి పాల్గొన్నారు.

నేడు జరిగే కార్మిక గర్జనను విజయవంతం చేయండి



- ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం

నవతెలంగాణ-అదిక్ మెట్

రాష్ట్రంలో వివిధ రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం వేలాది మంది కార్మికులతో కార్మిక గర్జన కార్యక్రమం విజయవంతం చేయాలని ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. సూర్యం పిలుపునిచ్చారు. విద్యానగర్ మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 50 వేల మంది గ్రామపంచాయతీ కార్మికులు 28 రోజులుగా కనీస వేతనాలు సమస్యల కోసం నిరవధిక సమ్మె చేస్తున్నార న్నా రు. తక్షణమే సమ్మెను పరిష్కరించాలని, కనీస వేతనాలు జీవోలను విడుదల చేయాలని, బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న ప్యాకర్స్ కు నెలసరి ఉద్యోగులందరికీ జీవన భృతి ఇవ్వాలని, తదితర డిమాండ్లతో కార్మిక గర్జన నిర్వహిస్తున్నా మన్నారు. ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ ఎల్ పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం హనుమేష్ మాట్లాడుతూ లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్రంలో మెరుగైన సంక్షేమాలు అందించాలని, కనీస పెన్షన్ నిర్ణయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరనీ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. తదితర అనేక డిమాండ్ల మీద నిర్వహిస్తున్న కార్మిక గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగం రాలేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ముషీరాబాద్




ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపం చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా చౌడపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సూర్య రాఘవేందర్ చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం పక్కన కాలనీలో తన తమ్ముడు బాలకృష్ణతో కలిసి గత మూడు సంవత్స రాలుగా నివాసం ఉంటూ బ్రిలి యంట్ ఇంజనీరింగ్ కళాశాలలో గత సంవత్సరం బీటెక్ పూర్తి చేసి జాబు కోసం ప్రయత్నం చేస్తూ జాబు రాకపోవడంతో తీవ్రమైన స్థాపన గురై తన తమ్ముడు బాలకృష్ణ కళాశాలకు వెళ్లిన తర్వాత మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రూమ్ లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ కి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అందం కోసం బ్యూటీ పార్లర్‌కి వెళ్తే ఉన్న జుట్టు పాయే


అబిడ్స్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధితురాలు

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



అందాన్ని మెరుగుపరుస్తామంటూ అనుభవం లేని బ్యూటీపార్లర్ల యాజమాన్యాలు, కాసులకు కకు ర్తిపడి ప్రజలను మోసగిస్తున్న సంఘటన ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అబిడ్స్‌లోని చిరాగ్ గల్లిరోడ్‌లో క్విస్ట్ పార్లర్‌ను నాజ్రిన్ జీవా (61) అనే మహిళ నిర్వహిస్తుంది. చార్మినార్‌కు చెంది నీజ్ (33) గత పది రోజుల కిందట పార్లర్‌కు వెళ్ళింది. పార్లర్ వారు నీజ్ వెంట్రుకలకు బ్యూటిషన్ పెట్టిన హెయిర్ ఆయిల్ రాయడంతో కొంతమేర జుట్టు ఊడిపోయింది. దీంతో వారు పార్లర్ యాజ మా న్యాన్ని ప్రశ్నించగా, తగ్గిపోతదంటూ రోజులు గడు పుతూ వస్తున్నారు. కానీ ఎంతకూ తగ్గకపోవడంతో బాధితురాలు అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో పార్లర్ యా జమాన్యం పై ఫిర్యాదు చేశారు. బాధితురాలికి వైద్య సహాయం చేయాల్సిన పార్లర్ యజమానులు బెది రింపులకు పాల్పడుతూ తమకు సంబంధం లేద నడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. పార్లర్ లో వాడు తున్న క్రీమ్లు, ఆయిల్స్, పరిశీలించాలని ఇబ్రహీం పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.


అల్బెండజోల్ మాత్రల పంపిణీ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సుల్తాన్ బజార్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేసిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ నర్సుబాయి, ఏఎన్ఎంలు సువాసిని, జయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ప్రొఫెసర్ జయతి ఘోష్... ప్రముఖ ఆర్థికవేత్తలో ఒకరు. ఎవరికి ఎప్పుడు ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే వ్యక్తి. ముఖ్యంగా దేశంలో మహిళలు, విద్యార్థులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం తన స్వరాన్ని వినిపించే మానవతావాది. అటువంటి ఆమె 2023 గాను అగ్రికల్చరల్ అండ్ అప్లైడ్ ఎకనామిక్స్ అసోసియేషన్ (ఎ.ఎ.ఇ.ఎ) వారు వ్యవసాయ ఆర్థికశాస్త్రంలో అందజేసే ప్రపంచ ప్రతిష్టాత్మకమైన గాల్‌బ్రైత్ అవార్డు అందుకున్నారు. 'ఆవిష్కరణలు, నాయకత్వం, పరిశోధన, సేవ ద్వారా మానవాళికి చేసిన విశిష్ట సేవలకు' గుర్తింపుగా ఇచ్చే ఈ అవార్డు మన భారతీయ మహిళకు రావడం దేశానికే గర్వకారణం. జులై 25న ఆమె ఈ అవార్డును అందుకున్న సందర్భంగా ఆమె పరిచయం నేటి మానవిలో...



గొప్ప కృషికి విశిష్ట పురస్కారం

జయతి ఘోష్ 16 సెప్టెంబర్ 1955న జన్మించారు. ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయంలో తన డిగ్రీ పూర్తి చేశారు. అదే విశ్వవిద్యాలయంలో ఎం.ఎ, ఎం.ఫిల్ పట్టా అందుకున్నారు. తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుండి ఆర్థికశాస్త్రంలో ఇన్‌లాక్స్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. 1984లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో డాక్టరల్ థీసిస్ డా. టెరెన్స్ జె. బైరెస్ పర్యవేక్షణలో 'ది నాన్ క్యాపిటలిస్ట్ ల్యాండ్ రెంట్: థియరీస్ అండ్ ది కేస్ ఆఫ్ నార్త్ ఇండియా' అనే అంశంపై తన పీహెచ్‌డి పూర్తి చేశారు. గతంలో ప్రణాళికా సంఘ సభ్యుడిగా ఉన్న అభిజిత్‌సేన్ అనే ఆర్థికవేత్తను ఆమె వివాహం చేసుకున్నారు.



బోధన కొనసాగిస్తూనే...

చదువు పూర్తి చేసిన తర్వాత కొంత కాలంలో టఫ్ట్స్ యూనివర్శిటీ పని చేశారు. ఆ తర్వాత కేంబ్రిడ్జ్ యూనివర్శిటీలో కూడా విధులు నిర్వహించారు. అదే సమయంలో భారతదేశం అంతటా పర్యటించి అనేక



విద్యాసంస్థలలో ఉపన్యాసాలు ఇచ్చారు. ఆ తర్వాత ఆర్థిక శాస్త్రంలో దాదాపు 33 ఏండ్లు జెఎన్‌యు సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్‌లో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం యుఎస్ఎలోని యూనివర్శిటీ ఆఫ్ మసాచుసెట్స్‌లో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే ఆమె అనేక ఇతర విద్యా సంస్థలలో కూడా బోధనని కొనసాగిస్తున్నారు.

ప్రగతిశీల ఆర్థిక పరిశోధనల కోసం...

ఢిల్లీలో స్థాపించిన ఎకనామిక్ రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులలో ఆమె కూడా ఒకరు. ప్రగతిశీల ఆర్థిక పరిశోధనల కోసం దీన్ని స్థాపించారు. ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ అసోసియేట్స్ (క్రీణజూారా)కు ఆమె ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ కూడా ఉన్నారు. ఇది నియో ఉదారవాద విధానాల ఆర్థిక నమూనాను విమర్శించే ఆర్థికవేత్తల నెట్‌వర్క్. 'పశ్చిమ బెంగాల్ హ్యూమన్ డెవలప్‌మెంట్ రిపోర్ట్' అనే గ్రంథానికి ఆమె ప్రధాన రచయిత. ఈ గ్రంథం ఐక్యరాజ్యసమితి నుండి బహుమతి పొందింది. ఫ్రంట్‌లైన్ మ్యాగజైన్, బిజినెస్ లైన్, బెంగాలీ వార్తాపత్రిక గణశక్తి, డెక్కన్ క్రానికల్, ఏషియన్ ఏజ్‌లకు ఆర్థికశాస్త్రం, కరెంట్ అఫైర్స్‌పై రెగ్యులర్ కాలమ్స్ రాస్తుంటారు. ప్రధానంగా ఆర్థిక సమస్యలపై జాతీయ పత్రిక ఫ్రంట్‌లైన్‌కి రెగ్యులర్ కాలమ్ రాస్తున్నారు.

అనేక శాఖలకు బాధ్యతలు

స్ప్రింగ్ టర్మ్ 2011లో జయతి టాలిన్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ వారి టెక్నాలజీ గవర్నెన్స్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో డెవలప్‌మెంట్ ఎకనామిక్స్‌లో మొదటి రాగ్నార్ నూర్క్స్ విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. విద్యాసంబంధ విషయాలతో పాటు అనేక సలహా బోర్డుల్లో పనిచేస్తున్నారు. 2021లో ఆమె మరియానా మజ్జుకాటో అధ్యక్షతన ప్రపంచ ఆరోగ్య సంస్థ కౌన్సిల్ ఆన్ ది ఎకనామిక్స్ ఆఫ్ హెల్త్ ఫర్ ఆల్‌కి నియమించబడ్డారు. 2022 నుండి చాతమ్ హౌస్ ద్వారా సమావేశమైన యూనివర్సల్ హెల్త్ కమిషన్‌లో సభ్యురాలిగా, హెలెన్ క్లార్క్, జకయా కిక్వేటే సహ-అధ్యక్షులుగా ఉన్నారు. అలాగే 2022 నుండి ఉమ్మడి ప్రపంచ బ్యాంక్/డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ ప్రిపేర్డ్‌నెస్ మానిటరింగ్ బోర్డ్ (జీపీఎంబీ)లో భాగంగా ఉన్నారు.

కృషికి గౌరవంగా...

అమెరికన్-కెనడియన్ ఆర్థికవేత్త జాన్ కెన్నెత్ గాల్‌బ్రైత్ పేరు మీద వార్షిక అవార్డును కెనడాలోని మాంట్రియల్లో 2003లో ప్రారంభించారు. పరిశోధన, విద్య, ప్రజాసేవలో సాధించిన విజయాలతో రాజనీతిజ్ఞతతో స్కాలర్‌షిప్‌ను ఏకీకృతం చేసే జాన్ కెన్నెత్ గాల్‌బ్రైత్ పురస్కారాన్ని అసమానమైన విజయాలు, స్ఫూర్తి, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ప్రపంచానికి సేవ చేస్తూ మేధో నాయకత్వ రికార్డును కలిగి ఉన్న మేధావులు, అత్యుత్తమ వ్యవసాయ ఆర్థికవేత్తలు ప్రపంచ మానవాళికి చేసే గణనీయమైన కృషికి గౌరవప్రదంగా ఈ అవార్డుని అందుకుంటారు. 2023కు గాను ఈ అవార్డు ప్రొ.జయతి ఘోష్‌కు మార్చి నెలలో ప్రకటించారు. జులై 25 నాడు ఆమెకు ప్రదానం చేశారు. ఈ అవార్డును ప్రారంభించినప్పటి నుండి అందుకున్న ముగ్గురు భారతీయ లేదా భారతీయ సంతతికి చెందిన ఆర్థికవేత్తలలో ఆమె ఒకరు కావడం విశేషం.

అనేక సిఫారసులు

2004 సెప్టెంబర్‌లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ జయతీ ఘోష్ అధ్యక్షతన కమిటీని నియమించింది. సాగుదారులను గుర్తించి వ్యవసాయ సాగు రుణాలు పెంచడం, నీటి సమస్యని పరిష్కరించడం వ్యవసాయ సేవలని పెంచడం, గిట్టుబాటు ధరలు కల్పించడం, ఉపాధి అవకాశాలు పెంచడం, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలతో కనీసం 100 రోజుల పనిని కల్పించడం, పేదలకు పోషకాలు అందించడం, ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు నిధులు పెంచి తద్వారా ఈ రంగాల్లో నాణ్యతా ప్రమాణాలు పెరిగేలా చర్యలు తీసుకుంటే గ్రామీణుల జీవన వ్యయం మెరుగు పడుతుందని ఈ కమిటీ ప్రధాన సిఫారసులు చేసింది.



ఎన్నో ప్రముఖ అవార్డులు

జయతి 2006లో అవా మైతీ మెమోరియల్ ప్రైజ్, 2010లో ఇటలీలోని సాంఘిక శాస్త్రాలకు నోర్డ్‌సుడ్ ప్రైజ్‌ను, 2011లో అంతర్జాతీయ కార్మిక సంస్థ డీసెంట్ వర్క్ రీసెర్చ్ ప్రైజ్, సామాజిక శాస్త్రాలకు విశిష్ట సేవలందించినందుకు, 2012లో ఆసియాటిక్ సొసైటీ వారి సత్యేంద్రనాథ్ సేన్ అవార్డు, 2013లో కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్, ఇండియన్ సొసైటీ ఫర్ లేబర్ ఎకనామిక్స్, 2015లో ఆదిశేషయ్య అవార్డుతో పాటు ఎన్నో ప్రముఖ అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. అలాగే అనేక జాతీయ, అంతర్జాతీయ గౌరవాలను అందుకొని ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచారు.

ప్రముఖ వ్యక్తుల్లో ఒకరు

2021లో కోవిడ్ -19 అనంతర ప్రపంచంలోని సామాజిక -ఆర్థిక సవాళ్లకు ప్రతిస్పందించడానికి ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్‌కి సిఫార్సులను అందించే ఉన్నత స్థాయి సలహా బోర్డుకి నియమించబడిన 20 మంది ప్రముఖ వ్యక్తులలో జయతి ఘోష్ ఒకరు. 2022 మార్చిలో ఆమె ప్రస్తుత, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవటానికి అంతర్జాతీయ సహకారం కోసం ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ స్థాపించిన ప్రతిభావంతమైన బహుపాక్షికత (ఎఫెక్టివ్ మల్టీలెటరలిజం)లో ఉన్నత- స్థాయి సలహా మండలికి నియమించబడ్డారు.

మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం

భారత ప్రభుత్వ నోట్ల రద్దు పతనం, అనధికారిక ఆర్థిక వ్యవస్థలో మహిళా కార్మికుల దుస్థితి, భారత దేశంలో కోవిడ్-19 మహమ్మారి పతనం సహా అనేక రకాల విషయాలపై ఆమె అనేక పరిశోధనా పత్రాలు, పుస్తకాలను రాశారు. ముఖ్యంగా ఆమె కార్మికులు, మహిళలు, అభివృద్ధి ఆర్థిక శాస్త్రంపై అనేక వ్యాసాలు రాశారు. 20కి పైగా పుస్తకాలను రచించారు. వామపక్ష భావాలు గల ఆమె పని విధానం, పరిశోధన, రచనలు అన్ని మానవ కేంద్రీకృత ఆర్థిక శాస్త్రంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తాయి. కార్మికుల దుస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి వారికి సామాజిక రక్షణ కల్పించడంపై అనేక విధాన సిఫార్సులు చేశారు. మూడవ ప్రపంచ దేశాల రుణ సంక్షోభం శ్రామిక ప్రజలపై తీవ్ర ప్రభావం చూపడం పట్ల ఆమె ఆందోళన చెందారు. 'మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఉండటం, సొంత ఆస్తులు, ఆదాయాన్ని పొందడం చాలా అవసరం. ఒక మహిళ ఆర్థికంగా ఆధారపడినంత కాలం ఆమె ఇతరులకు లొంగిపోవలసి ఉంటుంటుంది' అంటారు జయతి.

- సలీమ

కాంగ్రెస్‌లోకి జూపల్లి

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నివాసంలో పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. వారిని ఖర్గే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఇంచార్జ్ మాణిక్ రావు ఠాక్రే, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణాలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. డిసెంబర్ 9న సోనియా గాంధీ పుట్టిన రోజునాటి కల్లా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని జోస్యం చెప్పారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, యువతకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఐదులక్షల ఇల్లు నిర్మిస్తామని, రూ.500లకే గ్యాస్ ఇస్తామని తెలిపారు. ఆరోగ్య శ్రీ 5 లక్షలకు పెంచుతామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌లది ఫెవికాల్ బంధమని విమర్శించారు. కేసీఆర్ లిక్కర్‌ను నమ్ముకున్నారనీ, లిక్కర్ కింగ్‌గా మారారని విమర్శించారు. కేసీఆర్ అంతర్జాతీయ క్రిమినల్ చార్లెస్ శోభరాజ్ శిష్యుడని ధ్వజమెత్తారు. జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలన చూస్తే చాలా బాధ కలుగుతోందని అన్నారు. వందలాది మంది ప్రాణ త్యాగాలు చేసి తెచ్చుకున్న రాష్ట్రమేనా? అని అన్నారు. కర్నాటకలో అవినీతి బీజేపీ సర్కారును ఓడించిన మాదిరిగా, అంతకు మించి అవినీతిలో కూరుకున్న కేసీఆర్ సర్కారును కూడా ఓడించాలన్నారు. కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మానిక్ రావు ఠాక్రే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్, బీజేపీ నేతలు వచ్చి చేరుతున్నారనీ, కేసీఆర్‌కు తాను, తన కుటుంబం తప్ప ఇంకేమీ అవసరం లేదని విమర్శించారు. అందుకే ఆ పార్టీలో నేతలు విసిగిపోయి బయటకు వస్తున్నారని అన్నారు.

మూజువాణి ఓటుతో ఢిల్లీ బిల్లు ఆమోదం

- బిల్లును వ్యతిరేకించిన ప్రతిపక్షాలు
- మద్దతు ఇచ్చిన వైసీపీ, హాజరుకాని టీడీపీ
- రాజ్యసభలో మూడు బిల్లులు ఆమోదం

న్యూఢిల్లీ : ఢిల్లీ గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ (సవరణ) బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. గురువారం లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బిల్లును ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. అనంతరం చర్చ జరిగింది. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. బీజేపీతో పాటు పివి మిథున్ రెడ్డి (వైసీపీ), పినాకి మిశ్రా (బీజేడీ), రాహుల్ రమేష్ షెవాలే (శివసేన (షిండే)) బిల్లుకు మద్దతివ్వగా, టీడీపీ హాజరుకాలేదు. బిల్లును కాంగ్రెస్, డీఎంకే, టీఎంకే, టీఎంసీ, సీపీఐ(ఎం), జేడీయూ, ఎన్‌సీపీ, ఎస్‌పీ, సీపీఐ, ఐయూఎంఎల్, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (ఠాక్రే), ఆర్ఎస్‌పీ, ఆప్ తదితర ఇండియా కూటమి పార్టీలతో పాటు బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకించాయి. బిల్లుపై ఎన్‌సీపీ ఎంపీ సుప్రీయా సులే మాట్లాడుతూ ఈ బిల్లు ఎన్నిక వర్సెస్ ఎంపికలా ఉందని తెలిపారు. బిల్లును వినయక్ రౌత్ (శివసేన ఠాక్రే) వ్యతిరేకించారు. ఆయా పార్టీల సభ్యులు మాట్లాడి తరువాత, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. సంతృప్తిచెందని ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించుకున్నారు. అలాగే డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, ఫార్మసీ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. డేటా ప్రొటెక్షన్ బిల్లు, 2023ని స్టాండింగ్ కమిటీకి పంపాలని ప్రతిపక్ష నేతలు కోరారు. మరోవైపు రాజ్యసభలో ఆఫ్‌షోర్ ఏరియాస్ మినరల్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) సవరణ బిల్లు, న్యాయవాదులు సవరణ బిల్లు, ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు.

మణిపుర్‌లో సామూహిక ఖననంపై హైకోర్టు స్టే

- కర్ఫ్యూ పొడిగింపు

ఇంఫాల్: మణిపుర్‌లో గత మూడు నెలలుగా జరుగుతున్న హింసాకాండలో మరణించిన 35 మంది మృతదేహాలను ఖననం చేసేందుకు గురువారం కుకీ తెగ గిరిజన నాయకుల ఫోరం సిద్ధమైంది. అయితే, దీనిపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. సామూహిక ఖననానికి నిర్దేశించిన ప్రాంతంలో యథాస్థితిని కొనసాగించాలని హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ మురళీధరన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐఆర్ ఎంతిద్దాం..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించే అవకాశమున్నట్టు తెలిసింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక శాతం ఐఆర్ ఇస్తే రూ.30 కోట్లు ప్రభుత్వం అదనంగా భరించాల్సి ఉంటుంది. ఏడాదికి రూ.360 కోట్లవుతాయి. ఈ లెక్కన ఐదు శాతానికి నెలకు రూ.150 కోట్లు, ఏడాదికి రూ.1,800 కోట్లు, ఎనిమిది శాతానికి నెలకు రూ.240 కోట్లు, ఏడాదికి రూ.2,880 కోట్లు, పది శాతానికి నెలకు రూ.300 కోట్లు, ఏడాదికి రూ.3,600 కోట్లు, 12 శాతానికి నెలకు రూ.360 కోట్లు, ఏడాదికి రూ.4,320 కోట్లు, 14 శాతానికి నెలకు రూ.420 కోట్లు, ఏడాదికి రూ.5,040 కోట్లు ఖర్చవుతాయి. అయితే తెలంగాణ మొదటి పీఆర్సీ గడువు జూన్ 30తో ముగిసింది. రెండో పీఆర్సీ ప్రకారం గతనెల ఒకటో తేదీ నుంచి కొత్త వేతనాలను ఉద్యోగులు తీసుకోవాలి. కానీ పీఆర్సీ కమిటీని ప్రభుత్వం నియమించలేదు. అయితే కమిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం కసరత్తును ప్రారంభించినట్టు సమాచారం. అందుకోసం సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లను పరిశీలిస్తున్నారు. శుక్ర లేదా శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశమయ్యే అవకాశమున్నది. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఉద్యోగులకు జీతాలు, సంక్షేమ కార్యక్రమాలు, దళితబంధు, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష సాయం, ఇప్పుడు రుణమాఫీకి నిధులు ఎక్కడి తేవాలన్న చర్చ జరుగుతున్నది. అయినా సీఎం ఐఆర్ ప్రకటిస్తే ఆ నిధులను ఎలా సర్దుబాటు చేయాలన్న దానిపై ఆర్థిక శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నట్టు సమాచారం.

జులై నుంచే ఐఆర్ అమలు చేయాలి : ఉద్యోగ జేఏసీ

రెండో పీఆర్సీని గతనెల ఒకటో తేదీ నుంచి అమలయ్యేలా ఐఆర్ ప్రకటించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ కోరింది. ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఉద్యోగ జేఏసీ చైర్మెన్ ఎం రాజేందర్, సెక్రెటరీ జనరల్ వి మమత నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం చందాతో కూడిన ట్రస్టును ఏర్పాటు చేసి వారికి మెరుగైన వైద్య సేవలను అందేలా ఈహెచ్ఎస్‌ను ప్రకటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్‌ను రద్దు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. గోపన్‌పల్లిలోని సర్వే నెంబర్ 36,37లో గతంలో ఉద్యోగులకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని భాగ్యనగర్ ఎన్జీవో హౌజింగ్ సొసైటీకి అప్పగిస్తూ ఉత్తర్వులివ్వాలని సూచించారు. ఉద్యోగులకు సంబంధించిన ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కారం చేస్తామంటూ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, టీజీవో ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, బీటీఎన్జీవో అధ్యక్షులు సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సున్నం రాజయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

ఎర్రయ్య రెడ్డి, కుంజా బుజ్జి, సున్నం రాజయ్య చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. పట్టణ అభివృద్ధిలో రాజయ్య తనదైన ముద్ర వేశారని అన్నారు. రాజయ్యపై మావోయిస్టులు అనేక సందర్భాల్లో బెదిరింపులకు పాల్పడి, తన కండ్ల ముందే పార్టీ నాయకులు బండారు చంద్రావు, బత్తుల భీష్మారావును చంపి, తనకూ అదే గతి పడుతుందని హెచ్చరించినా ఎర్రజెండా దించకుండా ముందుకు సాగిన మహనేత అని కొనియాడారు. నియోజకవర్గంలో విపత్తులు, వరదలు, విష జ్వరాలు, వచ్చి ప్రజలు కష్టాలతో ఉన్నప్పుడు వారికి అండగా ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. తన స్వగ్రామమైన సున్నవారిగూడెంలో తనకున్న 15 ఎకరాల భూమిని స్కూలు, హాస్టల్‌కు దానం చేసి ఆదర్శనీయుడుగా నిలిచారని తెలిపారు. రాజయ్య పోలవరం ముంపు నుంచి భద్రాచలం ప్రాంత రక్షణ కోసం పలుసార్లు పాదయాత్ర నిర్వహించారని, రాష్ట్ర, జిల్లా విభజన సమయంలోనూ ఆమరణ నిరాహార దీక్ష సైతం చేశారని గుర్తు చేశారు. నేడు కరకట్ట నిర్మాణం విషయంలో పోలవరం అంశమే ప్రస్తావించని నిపుణులు కమిటీ నివేదిక తప్పుల తడకగా, పనికిమాలినదిగా ఉన్నదని విమర్శించారు. పోలవరం ముంపు నుంచి భద్రాచలాన్ని రక్షించేందుకు ఉద్యమించడమే రాజయ్యకు మనమిచ్చే ఘన నివాళి అని స్పష్టంచేశారు. రాజయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు పదునుపెట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లోని సున్నం రాజయ్య స్మారక స్థూపం వద్ద మచ్చ వెంకటేశ్వర్లుతో పాటు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, సున్నం గంగా, పార్టీ సీనియర్ నాయకులు బీబీజీ తిలక్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి బండారు శరత్ బాబు, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలవి బురద రాజకీయాలు..

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రశాంత్ రెడ్డి సమాధానమిస్తూ, సీఎం కేసీఆర్ ఫోటోలకు ఫోజులిచ్చే నాయకుడు కాదనీ, అలాంటి నాయకులు దేశంలో చాలా మంది ఉన్నారని ఎద్దేవా చేశారు. అంతా తామే అన్నట్టు ఫోటోలకు ఫోజులిస్తూ ఇంకో మనిషిని ముందుకు రానియ్యరని పరోక్షంగా ప్రధాని మోడీని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఊహించని విపత్తు సంభవించిందనీ, అయినప్పటికీ వెంటనే సీఎం కేసీఆర్ రాత్రింబవళ్లు ప్రజా ప్రతినిధులు, అధికారులను అప్రమత్తం చేస్తూ, తన పర్యవేక్షణతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించారని తెలిపారు. ప్రాజెక్టుల వారీగా సీఎం సమీక్షించి, వెంట వెంటనే పలు సూచనలు చేశారని గుర్తుచేశారు.

అందుకే మోరంచపల్లికి వెళ్లలేదు...

మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పని చేస్తుంటే అన్ని చోట్ల సహాయ చర్యలను సీఎం అనుసంధానించి విలువైన సూచనలు ఇచ్చారని మంత్రి తెలిపారు. సీఎం మోరంచపల్లికి వెళితే అక్కడి జిల్లా యంత్రాంగమంతా అక్కడికి వెళ్లాల్సి వచ్చేదనీ, ఆ పరిస్థితి రాకూడదనే ఆయన వెళ్లలేదని వివరించారు. నల్లగొండ జిల్లా తప్ప రాష్ట్రమంతా అధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. మిషన్ కాకతీయ పథకం ప్రజల ప్రాణాలను కాపాడిందని తెలిపారు. రాష్ట్రంలో 40 వేల చెరువులున్నాయనీ, ఆ పథకమే లేకుంటే వరద ప్రవాహంతో 30 నుంచి 40 శాతం చెరువులకు గండ్లు పడేవని వివరించారు. 756 చెరువులకు మాత్రమే గండి పడ్డాయనీ, వాటిలో ఇప్పటికే 76 చెరువుల పునరుద్ధరణ పూర్తయిందని తెలిపారు. వెయ్యికిపైగా స్థలాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ దెబ్బతింటే యుద్ధ ప్రాతిపదికన వాటిని బాగు చేసినట్టు తెలిపారు. కేంద్రం రాష్ట్రానికి గతంలో ఎప్పుడూ వరద సాయం చేయలేదని తెలిపారు. తాత్కాలిక సాయం కింద రూ.500 కోట్లు కేటాయించామనీ, సమస్య తొలగిపోయే వరకు నిధులిస్తూనే ఉంటామని చెప్పారు.

అక్రమ మైనింగ్‌లో బ్రిజ్ భూషణ్

(మొదటిపేజీ తరువాయి)

తాలూకాలోని మజ్రాత్, జైత్‌పూర్, నవాబ్‌గంజ్ గ్రామాలలో అక్రమ మైనింగ్ జరిపారని హరిత ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు అందింది. 'భూమి నుంచి ఖనిజాలను తవ్వి, వాటిని ట్రక్కులలో నింపుతున్నారు. ఇలా ప్రతి రోజూ 700కు పైగా ట్రక్కులను అక్రమంగా రవాణా చేస్తున్నారు. వాటిని నిల్వ చేసి, అక్రమంగా విక్రయిస్తున్నారు. ఇలా 20 లక్షల క్యూబిక్ మీటర్లను అమ్మేశారు. సామర్థ్యానికి మించి ట్రక్కులను ఖనిజాలతో నింపి తరలించడం వల్ల పట్‌పర్ బ్రిడ్జికి, రోడ్డుకు నష్టం వాటిల్లుతోంది' అని ఆ ఫిర్యాదులో వివరించారు. జ్యుడీషియల్ మెంబర్ జస్టిస్ అరుణ్ కుమార్ త్యాగి, నిపుణుడు ఎ.సెంథిల్ వేల్‌తో కూడిన హరిత ట్రిబ్యునల్ బెంచ్ ఫిర్యాదును పరిశీలించి అందులో పర్యావరణానికి సంబంధించిన పలు ప్రశ్నలు లేవనెత్తారని వ్యాఖ్యానించింది. వాస్తవాలను తెలుసుకొని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు వీలుగా కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వారానికి ఒకసారి సమావేశం కావాలని, మైనింగ్ జరిగే ప్రదేశాన్ని సందర్శించాలని కమిటీని ఆదేశించింది. నిబంధనలకు అనుగుణంగా మైనింగ్ జరుగుతున్నదీ లేనిదీ ఈ కమిటీ తెలుసుకుంటుంది. రెండు నెలల్లో నివేదికను అందజేస్తుంది. ఫిర్యాదుపై తదుపరి విచారణను నవంబర్ 7వ తేదీన చేపడతారు.

మోడీ దేశానికి ప్రధానా...? గుజరాత్‌కా...?

(మొదటిపేజీ తరువాయి)

వీలుంటుందంటూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం పదేండ్లుగా తెలంగాణకు ఎలాంటి సాయం చేయకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆయా శాఖల వారీగా వేసిన నష్టాల అంచనాలతో కూడిన నివేదికలో ఏడు శాఖలను మాత్రమే చేర్చారనీ, దానిలో వ్యవసాయ, విద్యాశాఖలను కూడా పొందుపర్చాలని సూచించారు. వరంగల్‌లో యూనివర్సిటీ ప్రక్క నుంచి డ్రెయిన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. వర్షపు నీరు వెళ్లే నాలాలపై ఆక్రమణలు ప్రపంచంలో ఎక్కడా లేవనీ, కేవలం ఆ సమస్య మన దగ్గరే ఉందని తెలిపారు. సమీప భవిష్యత్తులో కుంభవృష్టిలు తగ్గే ఆకాశాలు కనిపించడం లేదని చెప్పారు. హైదరాబాద్‌లో వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలు ఏర్పాటు చేయాలనీ, అవసరమైతే ప్రయివేటు ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఖమ్మం మున్నేరు వాగుకు యుద్ధ ప్రాతిపదికన కరకట్టలు నిర్మించాలని కోరారు. మొరంచపల్లి గ్రామానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోలవరం పూర్తయితే భద్రాచలానికి ఇంకా కష్టాలు పెరుగుతాయనీ, అక్కడ కరకట్టలు నిర్మించడమా? లేక లోతట్టు ప్రాంతాల వారిని ఎత్తైన ప్రాంతాలకు మార్చడమా? ఏది తక్కువ ఖర్చుతో కూడుకున్నది? తదితర విషయాలను పరిశీలించాలని కోరారు. కరకట్టల నిర్మాణానికి భూసేకరణ కష్టమని నర్సిరెడ్డి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. భారీ వర్షాలతో ఉద్యోగులు కూడా కొంత మేరకు నష్టపోయారనీ, వారి పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తే సాయం చేసినట్టవుతుందని సూచించారు.

ఆదివారం వరకే అసెంబ్లీ సమావేశాలు : బీఏసీలో నిర్ణయం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ఆదివారం వరకే కొనసాగనున్నాయి. అదే రోజు మరోసారి బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశమై... అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలా? లేదా? అనే విషయంపై నిర్ణయం తీసుకోనుంది. గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బీఏసీ సమావేశమైంది. డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, ఎంఐఎం నేత అక్బరుద్దీన్, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో అధిక వర్షాలు, వరదల నేపథ్యంలో మూడు, నాలుగు రోజులపాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం ముందుగా ప్రతిపాదించింది. కాంగ్రెస్ మాత్రం ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించింది. రాష్ట్రంలో చాలా సమస్యలు ఉన్నాయనీ, వాటన్నింటినీ చర్చించేందుకు వీలుగా సమావేశాలను కనీసం 20 రోజులపాటు నిర్వహించాలని భట్టి విక్రమార్క కోరారు. దేశంలోనే అతి తక్కువగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని వివరించారు. హరీశ్‌రావు స్పందిస్తూ, ఎన్ని రోజులు నిర్వహించార న్నది ముఖ్యం కాదనీ, ప్రజా సమస్యలపై ఎన్ని గంటలపాటు చర్చించామ న్నదే ముఖ్యమని గుర్తు చేశారు. సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై ఆయా పార్టీలు స్పీకర్‌కు ప్రతిపాదనలు అందించాయి. భారీ వర్షాలు, వరదలు, ప్రభుత్వ చర్యలు, సంక్షేమ పథకాలపై సభలో చర్చించాలని సమావేశంలో నిర్ణయించారు. దాదాపు 10 బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెనక్కి పంపిన నాలుగు బిల్లులతోపాటు ఆర్టీసీ ఉద్యోగులు, టిమ్స్ ఆస్పత్రులు, జీఎస్టీ చట్ట సవరణ, కార్మికశాఖకు సంబంధించిన బాయిలర్స్ చట్ట సవరణ బిల్లులను శాసనసభలో ప్రవేశ పెట్టాలని సర్కారు నిర్ణయించింది. శుక్రవారం వరదలపై చర్చ, 5న బిల్లులపై చర్చించాలని నిర్ణయించారు. 6న శాసనసభ సమావేశాలు ముగించనున్నారు.



క్వార్టర్స్‌లో శ్రీకాంత్

- సింధు, ప్రణయ్ సైతం ముందంజ
- మంజునాథ్, కిరణ్ జార్జ్ ఓటమి
- ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్

సిడ్నీ (ఆస్ట్రేలియా) : ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్ 500 సిరీస్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్లు క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. నూతన వ్యక్తిగత కోచ్ హాఫీజ్ శిక్షణ సారథ్యంలో వరుసగా రెండు టోర్నీల్లో తొలి రౌండ్లోనే నిష్క్రమించిన పి.వి సింధు సిడ్నీలో పురోగతి సాధించింది. సహచర షట్లర్ ఆకర్షి కశ్యప్‌పై విజయంతో మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది. మెన్స్ సింగిల్స్‌లో మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్, సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్, యువ ఆటగాడు ప్రియాన్షు రజావత్ సైతం క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపారు.

మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ పి.వి సింధు అలవోక విజయం సాధించింది. భారత యువ షట్లర్ ఆకర్షి కశ్యప్‌పై 21-14, 21-10తో సునాయాసంగా గెలుపొందింది. 39 నిమిషాల రెండో రౌండ్ పోరులో ఆకర్షి కశ్యప్ నుంచి సింధుకు పెద్దగా ప్రతిఘటన ఎదురు కాలేదు. రెండు గేముల్లోనూ చెమట పట్టకుండా పైచేయి సాధించిన పి.వి సింధు...నేడు క్వార్టర్‌ఫైనల్లో అమెరికా షట్లర్, నాల్గో సీడ్ బీవెన్ జాంగ్‌తో పోటీపడనుంది. సింధు తొలి రౌండ్లో సైతం భారత్‌కే చెందిన వర్ధమాన షట్లర్ అష్మిత చాలిహాపై 21-18, 21-13తో గెలుపొందిన సంగతి తెలిసిందే. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ ఆకట్టుకున్నాడు. చైనీస్ తైపీ షట్లర్ సు లై యాంగ్‌పై 21-10, 21-17తో వరుస గేముల్లో అదిరే విజయం సాధించాడు. 39 నిమిషాల్లోనే క్వార్టర్స్ బెర్త్ దక్కించుకున్నాడు. ఆరో సీడ్ హెచ్.ఎస్ ప్రణయ్ సైతం రాణించాడు. చైనీస్ తైపీ షట్లర్ చి హు జెన్‌తో జరిగిన మూడు గేముల మారథాన్ మ్యాచ్‌లో ఉత్కంఠ విజయం సాధించాడు. 19-21, 21-19, 21-13తో ప్రణయ్ చెలరేగాడు. 74 నిమిషాల ఉత్కంఠ పోరులో ప్రణయ్ పైచేయి సాధించి క్వార్టర్స్‌కు చేరాడు. యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ 21-8, 13-21, 21-19తో చైనీస్ తైపీ షట్లర్ వాంగ్ జు వీపై మెరుపు విజయం సాధించాడు. సంచలన షట్లర్ మిథున్ మంజునాథ్ 13-21, 21-12, 19-21తో లీ జి జియ (మలేషియా) చేతిలో పోరాడి ఓడాడు. కిరణ్ జార్జ్ పోరాటం సైతం రెండో రౌండ్లోనే ముగిసింది. 15-21, 18-21తో ఆంటోని గింటింగ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. నేడు మెన్స్ సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో సహచర షట్లర్ ప్రియాన్షు రజావత్‌తో కిదాంబి శ్రీకాంత్..టాప్ సీడ్ ఆంటోని గింటింగ్ (ఇండోనేషియా)తో హెచ్.ఎస్ ప్రణయ్ తలపడనున్నారు.

150 కొట్టలేక..!

ఛేదనలో భారత్ చతికిల

- తొలి టీ20లో విండీస్ గెలుపు
- వెస్టిండీస్ 149/6, భారత్ 145/9

స్లో పిచ్‌పై టీమ్ ఇండియా చతికిల పడింది. 150 పరుగుల ఛేదనలో 9 వికెట్లు కోల్పోయి 145 పరుగులే చేసింది. కీలక సమయాల్లో వికెట్లు కూల్చిన కరీబియన్లు తొలి టీ20లో భారత్‌పై 4 పరుగుల తేడాతో గెలుపొందారు. ఐదు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. సిరీస్‌లో రెండో టీ20 ఆదివారం జరుగనుంది.

నవతెలంగాణ-టరౌబ

భారత్‌కు ఎదురు దెబ్బ. 150 పరుగుల ఛేదనలో హార్దిక్‌సేన చతికిల పడింది. విండీస్ బౌలర్లు జేసన్ హెూల్డర్ (2/19), షెఫర్డ్ (2/33), మెక్‌కాయ్ (2/28) మెరుపులతో 20 ఓవర్లలో 145 పరుగులకే పరిమితమైంది. ఛేదనలో తెలుగు తేజం, అరంగేట్ర బ్యాటర్ తిలక్ వర్మ (39, 22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు), సూర్యకుమార్ యాదవ్ (19, 21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా ఓటమి తప్పలేదు. అంతకుముందు, యుజ్వేంద్ర చాహల్ (2/27), కుల్దీప్ యాదవ్ (1/20)లు స్పిన్ మాయజాలంతో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 149/6 పరుగులే చేసింది. కెప్టెన్ రోవ్‌మాన్ పావెల్ (48, 32 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు), నికోలస్ పూరన్ (41, 34 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) వెస్టిండీస్‌కు మంచి స్కోరు అందించారు.

తిలక్ మెరిసినా : స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్ తడబడింది. ఓపెనర్లు ఇషాన్ కిషన్ (6), శుభ్‌మన్ గిల్ (3) నిరాశపరిచారు. ఓపెనర్ల వైఫల్యంతో పవర్‌ప్లేలో భారత్ 45/2తో నిలిచింది. సూర్యకుమార్ యాదవ్ నిలిచినా.. తనదైన శైలిలో పరుగులు రాబట్టలేదు. ఈ సమయంలో అరంగేట్ర బ్యాటర్ తిలక్ వర్మ (39) కదం తొక్కాడు. మూడు సిక్సర్లు, రెండు ఫోర్లతో ఇన్నింగ్స్‌కు ఊపు తీసుకొచ్చాడు. తిలక్ క్రీజులో ఉండగా మ్యాచ్‌పై భారత్ పట్టు సాధించింది. కానీ తిలక్ నిష్క్రమణతో కథ మారిపోయింది. కుదురుగా ఆడుతున్న హార్దిక్ పాండ్య (19), సంజు శాంసన్ (12)లను ఒకే ఓవర్లో సాగనంపిన జేసన్ హెూల్డర్ భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. చివర్లో అక్షర్ పటేల్ (13), అర్షదీప్ సింగ్ (12) ప్రయత్నించినా.. 4 పరుగుల తేడాతో భారత్‌కు భంగపాటు తప్పలేదు.

స్పిన్ మాయ : టాస్ నెగ్గిన వెస్టిండీస్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆతిథ్య జట్టు ఓపెనర్లు ప్రణాళికల ప్రకారం దూకుడుగా ఆడారు. పవర్‌ప్లేలో ఫటాఫట్ బాదారు. బ్రాండన్ కింగ్ (28, 19 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), కైల్ మేయర్స్ (1) తొలి వికెట్‌కు 29 పరుగులు జోడించారు. ఓ ఎండ్‌లో బ్రాండన్ కింగ్ ధనాధన్ మోతకు సిద్ధమయ్యాడు. కొత్త బంతితో పేసర్లను ఓపెనర్లు దీటుగా ఎదుర్కోవటంతో బంతిని స్పిన్నర్లకు చేతికి అందించాడు కెప్టెన్ హార్దిక్ పాండ్య. కరీబియన్ టూర్‌లో తొలిసారి తుది జట్టులో నిలిచిన యుజ్వేంద్ర చాహల్.. సంధించిన తొలి బంతికే వికెట్ పడగొట్టాడు. తొలి ఓవర్లో ఏకంగా రెండు వికెట్లు పడగొట్టి కరీబియన్లను దెబ్బతీశాడు. కైల్ మేయర్స్, బ్రాండన్ కింగ్‌లు ఒకే ఓవర్లో నిష్క్రమించగా.. కుల్దీప్ యాదవ్ ఓవరోల జాన్సెన్ చార్లెస్ (3) డగౌట్‌కు చేరుకున్నాడు. పవర్‌ప్లేలో 54 పరుగులు చేసిన వెస్టిండీస్.. ఆ తర్వాత దూకుడుగా ఆడలేకపోయింది. స్పిన్నర్ల మాయజాలం, పేసర్ల ప్రతాపంతో విండీస్ బ్యాటర్లు తడబాటుకు గురయ్యారు. నికోలస్ పూరన్ (41, 34 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), రోవ్‌మాన్ పావెల్ (48, 32 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు) మెరిసినా.. ఆతిథ్య జట్టు ఆశించిన స్కోరును



సాధించలేదు. షిమ్రోన్ హెట్‌మయర్ (10) విఫలమయ్యాడు. డెత్ ఓవర్లలో అర్షదీప్ సింగ్ (2/31) నిప్పులు చెరుగగా.. ముకేశ్ కుమార్ (0/24) ఆకట్టుకున్నాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్య (1/27) ఓ వికెట్‌తో మెరిశాడు.

స్కోరు వివరాలు :

వెస్టిండీస్ ఇన్నింగ్స్ : బ్రాండన్ కింగ్ (ఎల్బీ) చాహల్ 28, కైల్ మేయర్స్ (ఎల్బీ) చాహల్ 1, చార్లెస్ (సి) తిలక్ (బి) కుల్దీప్ 3, నికోలస్ పూరన్ (సి) తిలక్ (బి) హార్దిక్ 41, పావెల్ (సి) సూర్య (బి) అర్షదీప్ 48, హెట్‌మయర్ (సి) అక్షర్ (బి) అర్షదీప్ 10, షెఫర్డ్ నాటౌట్ 4, హోల్డర్ నాటౌట్ 6, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 149.**

వికెట్ల పతనం : 1-29, 2-30, 3-58, 4-96, 5-134, 6-138.

బౌలింగ్ : అర్షదీప్ సింగ్ 4-0-31-2, ముకేశ్ కుమార్ 3-0-24-0, అక్షర్ పటేల్ 2-0-22-0, యుజ్వేంద్ర చాహల్ 3-0-24-2, హార్దిక్ పాండ్య 4-0-27-1, కుల్దీప్ యాదవ్ 4-0-20-1.

భారత్ ఇన్నింగ్స్ : కిషన్ (సి) పావెల్ (బి) మెక్‌కాయ్ 6, గిల్ (స్టంప్డ్) పూరన్ (బి) హుసేన్ 3, సూర్య (సి) హెట్‌మయర్ (బి) జేసన్ 21, తిలక్ వర్మ (సి) హెట్‌మయర్ (బి) షెఫర్డ్ 39, హార్దిక్ (బి) జేసన్ 19, శాంసన్ (రనౌట్) 12, అక్షర్ (సి) హెట్‌మయర్ (బి) మెక్‌కాయ్ 13, కుల్దీప్ (బి) షెఫర్డ్ 3, అర్షదీప్ (రనౌట్) 12, చాహల్ నాటౌట్ 1, ముకేశ్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 15, మొత్తం : (20 ఓవర్లలో 9 వికెట్లకు) 145.

వికెట్ల పతనం : 1-5, 2-28, 3-67, 4-77, 5-113, 6-114, 7-129, 8-140, 9-144.

బౌలింగ్ : హుసేన్ 4-0-17-1, మెక్‌కాయ్ 4-0-28-2, జోసెఫ్ 4-0-39-0, జేసన్ 4-1-19-2, షెఫర్డ్ 4-0-33-2.

తిలక్ వచ్చాడు

తెలుగు తేజం, యువ క్రికెటర్ తిలక్ వర్మ జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేశాడు. 20 ఏండ్ల నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ.. అండర్-19, దేశవాళీ, ఐపీఎల్‌లో నిలకడగా రాణించి జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. వెస్టిండీస్‌తో తొలి టీ20లో తిలక్ వర్మ భారత్ తరఫున తొలి అంతర్జాతీయ మ్యాచ్ అవకాశం దక్కించుకున్నాడు.



తిలక్ వర్మ కండ్లుచెదిరే రన్నింగ్ క్యాచ్

ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 9 మ్యాచుల్లోనే ఓ శతకం, రెండు అర్థ సెంచరీలతో 523 పరుగులు చేసిన తిలక్ వర్మ.. లిస్ట్-ఏలో 25 మ్యాచుల్లో ఐదు శతకాలు, ఐదు అర్థ సెంచరీలతో 1236 పరుగులు చేశాడు. టీ20 ఫార్మాట్‌లో 47 మ్యాచుల్లో 10 అర్థ సెంచరీలతో 1418 పరుగులు పిండుకున్నాడు. ఆఫ్ స్పిన్నర్‌గా ఫస్ట్ క్లాస్, లిస్ట్-ఏ, టీ20ల్లో 13 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ తిలక్ వర్మ.. ఈ ఏడాది ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ తరఫున కండ్లుచెదిరే ప్రదర్శన చేశాడు. భారత వైట్‌బాల్ జట్టులో యువరాజ్ సింగ్, సురేశ్ రైనాల తర్వాత ఆ స్థాయిలో ప్రభావం చూపగల క్రికెటర్‌గా తిలక్ వర్మను క్రికెట్ పండితులు పరిగణిస్తున్నారు. చూడచక్కని బ్యాటింగ్ శైలి, ఒత్తిడిలోనూ అలవోకగా భారీ షాట్లు ఆడగల భయమెరుగని క్రికెట్ ఆడటంలో తిలక్ వర్మ ఇప్పటికే విమర్శకుల మెప్పు పొందాడు. పార్ట్ టైమ్ స్పిన్నర్‌గా తిలక్ వర్మ జట్టుకు ఉపయుక్తం. ఇక పేసర్ ముకేశ్ కుమార్ సైతం టీ20ల్లో అరంగేట్రం చేశాడు. విండీస్ పర్యటనలో మూడు ఫార్మాట్లలో అరంగేట్రం చేసిన ఘనత ముకేశ్ కుమార్ దక్కించుకున్నాడు. గతంలో 2020-21 ఆస్ట్రేలియా పర్యటనలో తమిళనాడు పేసర్ టి.నటరాజన్ సైతం మూడు ఫార్మాట్లలో అరంగేట్రం చేసినా.. గాయాలతో స్వల్ప కాలంలోనే జాతీయ జట్టుకు దూరమయ్యాడు.



హైదరాబాద్‌కు మూడో విజయం

- ప్రొ పంజా లీగ్ సీజన్ 1

న్యూఢిల్లీ: ప్రొ పంజా లీగ్ (ఆర్మ్ రెజ్లింగ్)లో కిరాక్ హైదరాబాద్ మూడో విజయం నమోదు చేసింది. ఇందిరాగాంధీ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్ ముంబయి మజిల్‌పై 17-11తో ఏకపక్ష విజయం సాధించింది. అండర్ కార్డ్‌లో షాహిల్ హుస్సేన్, మధుర కెన్‌లు గెలుపొందగా.. మెయిన్ కార్డ్‌లో మధుర కెఎన్ 5-0తో, సిద్దార్థ్ మలాకర్ 10-0తో అదరగొట్టారు. స్పెషల్ కేటగిరీ మ్యాచ్‌లో ముంబయి ఆర్మ్ రెజ్లర్ చందన్ కుమార్ బెహెర 10-0తో మెరిసినా.. హైదరాబాద్ విజయం అప్పటికే ఖరారైంది. నేడు లూధియాన లయన్స్‌తో కిరాక్ హైదరాబాద్ తలపడనుంది.

మనోజ్ తివారీ గుడ్‌బై

క్రికెట్ కెరీర్ ముగించిన క్రీడాశాఖ మంత్రి



కోల్‌కత : భారత క్రికెటర్, బెంగాల్ స్టార్ మనోజ్ తివారీ క్రికెట్ కెరీర్‌ను ముగించాడు. అన్ని ఫార్మాట్లు, స్థాయిల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్టు మనోజ్ తివారి గురువారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. భారత్‌కు 12 వన్డేలు, మూడు టీ20ల్లో ప్రాతినిథ్యం వహించిన మనోజ్ తివారీ.. చెన్నైలో వెస్టిండీస్‌పై అజేయ శతకం (104) కెరీర్ అత్యధిక స్కోరు సాధించాడు. చివరగా 2015 జింబాబ్వే పర్యటనలో భారత జట్టుకు ఆడిన తివారీ మూడు వన్డేల్లో 34 పరుగులు చేశాడు. 2012 ఐసీసీ టీ20 ప్రపంచకప్ జట్టుకు ఎంపికైనా.. తుది జట్టులో నిలువలేదు. భారత జట్టుకు దూరమైనా.. బెంగాల్ తరఫున దేశవాళీ క్రికెట్‌లో దుమ్మురేపాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 141 మ్యాచుల్లో 48.56 సగటు, 29 శతకాలు, 45 అర్థ సెంచరీలతో 9908 పరుగులు చేశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యధిక స్కోరు 303 నాటౌట్. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో కోల్‌కత నైట్‌రైడర్స్, రైజింగ్ పుణె సూపర్‌జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్‌కు తివారీ ఆడాడు. మనోజ్ తివారీ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

ముందుగానే డచ్ జట్టు!

- బెంగళూర్‌లో వార్మప్ మ్యాచ్‌లకు ప్లాన్



బెంగళూర్ : 2023 ఐసీసీ మెన్స్ వన్డే వరల్డ్‌కప్‌కు అర్హత సాధించిన నెదర్లాండ్స్ క్రికెట్ జట్టు.. భారత్‌కు షెడ్యూల్‌కు ముందుగానే రానుంది. సెప్టెంబర్ రెండో వారంలోనే భారత్‌లో అడుగుపెట్టనున్న డచ్ జట్టు.. బెంగళూర్‌లో పలు ప్రాక్టీస్ మ్యాచులు ఆడనుంది. ' అవును, మా జట్టు భారత్‌కు షెడ్యూల్‌కు ముందుగానే రానుంది. ప్రపంచకప్ వార్మప్ గేమ్‌లకు ముందు బెంగళూర్‌లో కొన్ని ప్రాక్టీస్ మ్యాచులు ఆడాలని అనుకుంటున్నాం. ప్రపంచకప్‌కు అర్హత సాధించిన అనంతరం మా జట్టుకు ఎటువంటి గేమ్ ప్రాక్టీస్ లేదు. ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు ముందు కాస్త ప్రాక్టీస్ అవసరం' అని డచ్ క్రికెట్ సంఘం అధికారి ఒకరు తెలిపారు. బెంగళూర్‌లో ఎవరితో ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడేది ఇంకా ఖరారు కాలేదు. బెంగళూర్‌లో ప్రాక్టీస్ మ్యాచుల అనంతరం నెదర్లాండ్స్ నేరుగా హైదరాబాద్ లేదా తిరువనంతపురంకు చేరుకునే అవకాశం ఉంది. నెదర్లాండ్స్ తొలి మ్యాచులు హైదరాబాద్‌లోనే ఆడాల్సి ఉంది. అక్టోబర్ 9న పాకిస్థాన్‌తో, అక్టోబర్ 9న న్యూజిలాండ్‌తో డచ్ జట్టు తలపడనుంది. ఓవరాల్‌గా వన్డే వరల్డ్‌కప్‌లో ఐదోసారి పోటీపడుతున్న నెదర్లాండ్స్.. 2011 తర్వాత తొలిసారి మెగా ఈవెంట్‌కు అర్హత సాధించింది.

నవచిత్రం

చిరంజీవి నటిస్తున్న మాస్-యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా భాటియా, కీర్తి సురేష్, సుశాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం ఈనెల 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సుశాంత్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

అరుదైన ఛాన్స్ నాకు దక్కింది



సుశాంత్

'అల వైకుంఠపురములో' త్రివిక్రమ్ గారితో పని చేశాను. ఆయన చాలా కొత్తగా చూపించారు. అలాగే 'రావణాసుర'లో కూడా డిఫరెంట్‌గా చూపించారు. ఇక 'భోళా శంకర్' విషయానికి వస్తే, చిరంజీవి గారితో పని చేయాలనే ఆలోచనే చాలా ఎగ్జైటింగ్ నాకు. చిన్నప్పటి నుంచి ఆయన సినిమాలు చూస్తూ ఆయనకి అభిమానులుగా పెరిగాం. మెహర్ రమేష్ ఫోన్ చేసి ఈ సినిమా గురించి చెప్పారు. చాలా నచ్చింది. మెగాస్టార్‌తో స్క్రీన్ పంచుకోవడమే ఒక అదృష్టం. ఆయనతో డ్యాన్స్ చేసే అవకాశం ఎంతమందికి దొరుకుతుంది. ఇది బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ప్రధానంగా ఉండే మూవీ. ఇందులో నాది క్యామియో రోల్. నా పాత్ర చాలా ఛార్మింగ్‌గా ఉంటుంది. చిరంజీవి, కీర్తి సురేష్, తమన్నాతో నాకు కీలకమైన సన్నివేశాలు ఉంటాయి. నా మొదటి సినిమా హీరోయిన్ తమన్నా. భోళాలో మాత్రం బ్రదర్, సిస్టర్‌గా చేశాం (నవ్వుతూ). కీర్తి సురేష్‌తో సీన్స్ చేస్తున్నప్పుడు కూడా చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. చిరంజీవితో సీన్స్ చేస్తున్నప్పుడు మాత్రం చాలా ఎగ్జైట్‌మెంట్‌గా ఫీల్ అయ్యాను. ఇక ఆయనతో సాంగ్ చిత్రీకరణ అన్నప్పుడు శేఖర్ మాస్టర్‌కి ఫోన్ చేశాను(నవ్వుతూ). ఆయన టీంతో రెండు గంటలు ప్రాక్టీస్ చేశాను. అలాగే సెట్స్‌లోకి వెళ్ళిన తర్వాత కూడా ప్రాక్టీస్ చేశాను. చిరంజీవి మాత్రం కూర్చొని మైండ్‌లో ప్రాక్టీస్ చేసేస్తున్నారు. తమన్నా, కీర్తి కూడా మంచి డ్యాన్సర్స్. నలుగురం ఫ్రేమ్‌లో వున్నప్పుడు నా మూలంగా స్టెప్ మార్చకూడదు కదా. సాంగ్ చాలా బాగా వచ్చింది. చాలా కలర్ ఫుల్‌గా ఉంది. ఒరిజినల్‌తో పోలిస్తే ఇందులో నా పాత్రని చాలా ఫ్రెష్‌గా డిజైన్ చేశారు. భోళా మానియాలో నా పాత్ర చిన్న బ్రీజ్ లా ఉంటుంది' అని సుశాంత్ తెలిపారు.



యూనిక్ కాన్సెప్ట్‌తో స్పార్క్

విక్రాంత్, మెహరీన్ పిర్జాదా, రుక్సర్ థిల్లాన్ హీరో,హీరోయిన్స్‌గా భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రం 'స్పార్క్ ఎల్.ఐ.ఎఫ్.ఇ'. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విక్రాంత్ హీరోగా నటిస్తూ, సినిమాను డైరెక్ట్ చేశారు. తాజాగా ఈ చిత్ర టీజర్ రిలీజ్ ఈవెంట్ బుధవారం జరిగింది. నిర్మాతలు సి.అశ్వినీదత్, నవీన్ ఎర్నేని, టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల, మినిష్టర్ జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్,మ్యూజిక్ డైరెక్టర్ హేషం అబ్దుల్ వహాబ్, అన్వేష్ రెడ్డి, అనంతశ్రీరామ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

హీరో, దర్శకుడు విక్రాంత్ మాట్లాడుతూ, 'రెండేళ్ల పాటు కష్టపడి స్పార్క్ సినిమా కథను డెవలప్ చేసుకున్నాను. ఈ జర్నీలో మా డెఫ్ ఫ్రాగ్ టీమ్ ఎంతో సపోర్ట్ చేసింది. హీరోయిన్స్ మెహరీన్, రుక్సార్ థిల్లన్ అద్భుతంగా నటించారు. గురు సోమసుందరం పోషించిన పాత్ర చాలా ఏళ్ల పాటు గుర్తుండిపోతుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. సుహాసిని కీలక పాత్రలో నటించారు. మ్యూజిక్ డైరెక్టర్ హేషం అబ్దుల్ వహాబ్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. నేను ఎంత ప్రేమతో అయితే ఈ సినిమా చేశానో అదే ప్రేమను ప్రేక్షకులు అందిస్తారని భావిస్తున్నాను' అని అన్నారు.

'ఇది చాలా మంచి సినిమా. మనందరిలోనూ స్పార్క్ ఉంటుంది. ఫస్ట్ టీజర్‌లో మా సినిమా స్పార్క్ అందరికీ తెలిసి ఉంటుంది. కథ వినగానే చాలా డిఫరెంట్‌గా, స్పార్క్‌గా అనిపించింది. డిఫరెంట్‌గా, యూనిక్‌గా చేయాలనుకుని చేశాం' అని హీరోయిన్ రుక్సార్ చెప్పారు. మరో హీరోయిన్ మెహ్రీన్ పిర్జాదా మాట్లాడుతూ, 'ఇది నాకు చాలా చాలా స్పెషల్ సినిమా. ఈ సినిమాలో నేను కూడా భాగమైనందుకు ఆనందంగా ఉంది' అని తెలిపారు. మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ, 'సినిమాలో స్పార్క్ ఉంది. విక్రాంత్‌లో స్పార్క్ ఉంది. ఈ సినిమా తప్పకుండా ట్రెండ్ సెట్టర్ అవుతుంది' అని అన్నారు.

దయాని.. ఓ సినిమాలా చూస్తారు

జేడీ చక్రవర్తి, ఈషా రెబ్బా, రమ్య నంబీసన్, కమల్ కామరాజ్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'దయా'.

ఈ నెల 4న డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. శ్రీకాంత్ మొహతా, మహేంద్ర సోని నిర్మిస్తున్న ఈ వెబ్ సిరీస్‌ను దర్శకుడు పవన్ సాధినేని తెరకెక్కించారు.



ఈ వెబ్ సిరీస్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో డైరెక్టర్ పవన్ సాధినేని మాట్లాడుతూ, "దయా' అనేది ఒక వెబ్ సిరీస్‌లా కాదు ఒక సినిమాలా మూడు గంటల పాటు ఆపకుండా చూస్తారు. నా కథల్లో మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. అలాగే ఈ వెబ్ సిరీస్‌లో జేడీ, ఈషా, కమల్, రమ్య, జోష్ రవి.. ఇలా ప్రతి ఒక్కరి క్యారెక్టర్స్ బాగుంటాయి. ఈ వెబ్ సిరీస్‌కు సినిమాటోగ్రాఫర్ వివేక్ అందించిన విజువల్స్ అసెట్ అవుతాయి' అని తెలిపారు. 'ఈ స్క్రిప్ట్ చెప్పినప్పుడు నేను ఇలాంటి క్యారెక్టర్ చేయగలనా, నన్ను ఈ క్యారెక్టర్‌లో ఊహించుకోగలరా అని అనుకున్నాను. 'దయా' తర్వాత ఇకపై ఇలాంటి ఆఫర్సే వస్తాయా అనే భయం కూడా ఉండేది. నేను సిరీస్ మొత్తం చూశాను. చూశాక మేం ఒక సూపర్ వెబ్ సిరీస్ చేశామని అర్థమైంది' అని హీరోయిన్ ఈషా రెబ్బా అన్నారు.

హీరో జేడీ చక్రవర్తి మాట్లాడుతూ, 'ఈ వెబ్ సిరీస్‌లోని ప్రతి ఎపిసోడ్ ప్రశ్నలతో ముగుస్తుంది. ఈ ప్రశ్నలన్నీ కన్ఫ్యూజన్ క్రియేట్ చేయవు..ఇంట్రెస్ట్ కలిగిస్తాయి. దయా కథ ఒక సీజన్‌తో ఆగదు, సెకండ్ సీజన్ కోసం మీరు వెయిట్ చేస్తూనే ఉంటారు. గాయత్రి, ఈషా క్యారెక్టర్స్ చూస్తే దర్శకుడు పవన్‌కు మహిళలపై ఉన్న గౌరవం తెలుస్తుంది. ఈ నెల 3వ తేదీ రాత్రి నుంచే దయా స్ట్రీమింగ్ మొదలవుతుంది. తప్పకుండా చూడండి' అని చెప్పారు.

విలీనంలో సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించండి

- ప్రభుత్వానికి టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియలో కార్మిక సంఘాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దానితోపాటే ఆర్టీసీ కార్మికులకు ప్రస్తుతం ఉన్న ఆర్థిక అంశాలను కూడా పరిష్కరించాలని కోరింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావులకు లేఖలు రాశారు. ప్రభుత్వం చేసిన విలీన ప్రకటనను స్వాగతిస్తున్నామనీ, దీనికి సంబంధించి ఏర్పాటైన కమిటీ ఆర్టీసీ కార్మికులకు సంపూర్ణ న్యాయం చేయాలని ఆ లేఖలో ఆకాంక్షించారు. ఆర్టీసీ కార్మికులకు రావల్సిన రెండు వేతన సవరణలు, పెండింగ్ బకాయిలు, పీఎఫ్, సీసీఎస్ నిధులు, కారుణ్య నియామకాలు, పెన్షన్ సౌకర్యం, స్టాఫ్ బెన్వలెంట్ అండ్ త్రిఫ్ట్ ఫండ్ (ఎస్‌బీటీ), రిటైర్ అయిన కార్మికులకు ఇవ్వాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సహా పలు అంశాలను ఆ లేఖలో వివరించారు. విలీన ప్రక్రియ కమిటీ పై సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీసీ చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయించడంలో కీలక పాత్ర పోషించిన ఆ సంస్థ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను బస్‌భవన్‌లో ఉన్నతాధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ తన హయాంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. 43 వేల మంది టీఎస్ఆర్టీసీ కుటుంబం తరఫున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో టీఎస్ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత లభించిందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, కష్ణకాంత్, చీఫ్ మేనేజర్(ప్రాజెక్ట్) విజయ్ కుమార్, సీఎంఈ రఘునాథరావు, సీటీఎం జీవనప్రసాద్, సీఎఫ్ఎం విజయపుష్ప, సీసీవోఎస్ విజయభాస్కర్, సీసీఈ రాంప్రసాద్, బిజినెస్ హెడ్ సంతోష్ కుమార్, రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్ఎంలు శ్రీధర్, వరప్రసాద్, ఖుస్రోషా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

పంటలపై వరద ప్రతాపం

- ప్రకృతి ప్రకోపానికి వేలాది ఎకరాల్లో నష్టం
- పొలాల్లో ఇసుక మేటలు.. బండరాళ్లు
- అమలుకు నోచుకోని ఫసల్ బీమా పథకం సర్కారు
- సాయంపైనే అన్నదాతల ఆశలు

బోథ్ మండల కేంద్రానికి చెందిన ఈ రైతు పేరు ఈటెడి మోహన్‌రెడ్డి. రెండున్నర ఎకరాల్లో సోయా సాగు చేశారు. పైరు ఎదిగే దశలో వరద బీభత్సం సృష్టించింది. పొలంలోకి పెద్ద బండరాళ్లు కొట్టుకొచ్చాయి. పైరు వరద పాలైంది. ఎకరానికి కనీసం రూ.30వేల చొప్పున పరిగణనలోకి తీసుకుంటే సుమారు రూ.70వేల వరకు నష్టం జరిగినట్టు రైతు చెబుతున్నారు. ఇలాంటి రైతులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వేలాది మంది ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి



వరదల కారణంగా పంటలు, రోడ్లు, వంతెనలు తదితర వాటికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితులను జాతీయ విపత్తుగా పరిగణించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సహకారం అందించాలి. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.40వేలు, కోతకు గురైన భూములకు సంబంధించి రూ.50వేల చొప్పున పరిహారం అందించాలి. రానున్న రోజుల్లో పంటలు పండే పరిస్థితి లేకపోవడంతో రైతులు నష్టపోకుండా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఫసల్ బీమా పథకాన్ని వర్తింపజేయాలి.

- బండి దత్తాత్రి, అఖిలపక్ష రైతు సంఘం నాయకులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఇటీవల రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయి. ఊళ్లకు ఊర్లే నీటిలో మునిగిపోయాయి. పంట పొలాలు చెరువుల్లా మారాయి. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతోపాటు వరద పారడంతో ఇసుక మేటలు వేశాయి. చెత్త, చెట్లు, రాళ్లు కొట్టుకొచ్చాయి. లక్షల ఎకరాల్లో పంట వరద పాలైంది.

అలాగే, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉగ్రరూపం దాల్చిన నదులు, వాగుల కారణంగా పరివాహక ప్రాంతాల్లోని పంటలన్నీ నాశనమయ్యాయి. రైతులు పెట్టిన పెట్టుబడి మొత్తం వరదపాలైంది. నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన పంటలను చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలు ఇప్పటికీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇసుక మేటలు వేయడం..బండరాళ్లు కొట్టుకురావడంతో బీడు భూముల్లా కనిపిస్తున్నాయి. పంట నష్టంపై వ్యవసాయశాఖ ప్రాథమికంగా సర్వే చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు గుర్తించింది. కానీ ఫసల్ బీమా పథకం అమల్లో లేపోవడంతో నష్టపరిహారం అందలేని





పరిస్థితి. ఈ నేపథ్యంలో జాతీయ విపత్తుగా పరిగణించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. పది రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అతలాకుతలం చేశాయి. పచ్చని పంటలతోపాటు ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. అనేకచోట్ల వంతెనలు, రోడ్లు కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో రూ.కోట్ల నష్టం జరిగింది.

ఆయా శాఖల అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తోంది. ప్రభుత్వానికి పంపించేందుకు అధికారులు నివేదిక రూపొందిస్తున్నారు. ఇవి ఒక ఎత్తైతే.. ఎదుగుతున్న దశలో ఉన్న పైర్లు కొట్టుకుపోయాయి. రైతులకు తీరని శోకాన్ని మిగిల్చింది. ఖరీఫ్ తొలినాళ్లలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేసిన విత్తనాలు భూమిలోనే కలిసిపోగా.. మలి విడత వేసిన విత్తనాలు మొలకెత్తి పంట ఎదుగుదలకు చేరుకుంది. కానీ భారీ వర్షాల వల్ల నదులు, వాగులు, వంకల పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. పత్తి, సోయా, మొక్కజొన్న తదితర పంటలు రోజుల తరబడి నీటిలోనే ఉండటంతో మురిగిపోయి పనికిరాకుండా పోయాయి.

ఆదిలాబాద్ జిల్లాలో 60వేలు, నిర్మల్ జిల్లాలో 33వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో ఎదుగుదల లోపించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

అమలు కాని ఫసల్ బీమా..!

ప్రకృతి విపత్తులు, అవృష్టి..అనావృష్టి సంభవించి పంటలు నాశనమైతే ఫసల్ బీమా పథకం కింద పరిహారం వచ్చేది. రైతులకు పంట రుణాలు అందించే సమయంలో బ్యాంకులు రైతుల ఖాతాల నుంచి ఇన్సురెన్సు కింద ప్రీమియం తీసుకునేవి. ఇలా రైతులు చెల్లించిన ప్రీమియం డబ్బులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా చెల్లించేవి. కానీ 2020 నుంచి ఈ పథకం అమలు కాకపోవడంతో రైతులకు పరిహారం రావడంపై అనుమానం తలెత్తుతోంది. రైతుల నుంచి ప్రీమియం తీసుకోకపోవడం.. ప్రభుత్వాలు తమ వాటా చెల్లించకపోవడంతో ఇన్సురెన్సు కంపెనీలు కూడా ఎలాంటి పరిహారం అందించలేని పరిస్థితి. ఈ ఆపద సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. జాతీయ విపత్తుగా పరిగణించి ప్రభుత్వాలు రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తే కొంత మేరకైనా ఉపశమనం లభించే ఆస్కారం ఉంటుంది.

నేటినుంచి ఇంజినీరింగ్ తుదివిడత కౌన్సెలింగ్

- 6 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎంసెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ప్రాథమిక సమాచారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండడంతోపాటు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకునే అవకాశముందని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు ఈనెల ఐదున ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఈనెల ఆరు వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని వివరించారు. తొమ్మిదో తేదీ నాటికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు https://tseamcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కేంద్రం బృందం సూచనలు పరిశీలిస్తాం

- సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బందం గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో సమావేశమైంది. ఈ నెల ఒకటి నుంచి మూడవ తేదీ వరకు వివిధ శాఖలకు చెందిన ఏడుగురు కేంద్ర ప్రభుత్వశాఖల సభ్యులు వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించారు. ఈ బృందంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కూడా ఉన్నారు. ఈ సందర్భంగా బృందానికి నేతృత్వం వహించిన జాతీయ విపత్తుల నిర్వహణ శాఖ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి మాట్లాడుతూ భారీ వర్షాలకు దెబ్బతిన్న ఐదు జిల్లాల్లో రహదారులు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. వరి, పత్తి పంటలు పూర్తిగా ధ్వంసమైనట్టు తమ పరిశీలనలో తేలిందన్నారు. ప్రధానంగా మోరంచపల్లి, కొండాయి గ్రామాలూ పూర్తిగా నీటమునిగి ఆస్తి నష్టం కలిగాయని అన్నారు. ఐదు జిల్లాల కలెక్టర్లు చేపట్టిన ముంగుజాగ్రత్త చర్యలవల్ల భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా నివారించారని పేర్కొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తాం..

- డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి మంత్రి కేటీఆర్ హామీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు హామీ ఇచ్చారు. ఈ అంశం ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలనలో ఉందని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గురువారం మంత్రి కేటీఆర్‌ను డెక్కన్ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు మరిపాల శ్రీనివాస్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని వారు కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డీజేహెచ్ఎస్ గురించి అడిగి తెలుసుకున్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరిని రెగ్యులర్ చేయాలి

- రిజ్వీకి టీయుఎంహెచ్ఇయూ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలోని కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరిని రెగ్యులర్ చేయాలని ఆ శాఖ కార్యదర్శి రిజ్వీని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ- సీఐటీయూ అనుబంధం) కోరింది. ఈ మేరకు గురువారం ఆ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియొద్దీన్, కె.యాదానాయక్ ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు పేషీలో వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీహెచ్ఏ (ఎఫ్) పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌లో విధించిన నిబంధనల కారణంగా 20 ఏండ్లగా కాంట్రాక్ట్ సర్వీస్‌లో ఉన్న ఐదు వేల మంది ఏఎన్ఎంలకు అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరిని యధావిధిగా ఖాళీ పోస్టుల్లో సీనియార్టీ ప్రకారం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వీరంతా గతంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై పని చేస్తున్నారని తెలిపారు. వీరిని మళ్లీ పరీక్ష రాయమనడం న్యాయం కాదని సూచించారు. తక్షణమే నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ద్వంద్వ ప్రమాణాలెందుకు?

వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణకు సంబంధించిన విధి విధానాల విషయంలో ద్వంద్వ ప్రమాణాలు అనుసరిం చడం పట్ల యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్ల ప్రతిభ ఆధారంగా సర్వీసుకు వెయిటేజీ ఇచ్చి రెగ్యులర్ చేశారని గుర్తుచేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి 2016 ఫిబ్రవరి 26న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు 16 ప్రకారం... వైద్యారోగ్యశాఖలో 2023 మే 3న జీవో నెంబర్ 49 జారీ చేసి, దాని ప్రకారం 68 మంది కాంట్రాక్ట్ ఎంపీహెచ్ఏ (ఫిమేల్)లను యధావిధిగా రెగ్యులర్ చేశారని తెలిపారు.

అదే విధంగా వివిధ శాఖల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేల మందికిపైగా కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసినట్టు చెప్పారు. దాని ప్రకారమే... మిగిలిన ఐదు వేల మంది కాంట్రాక్ట్ ఎంపీహెచ్ఏ (ఫిమేల్)లను సీనియార్టీ ప్రాతిపదికన రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగులు కోర్టుకెళ్తామంటున్నారు....

వినతిపత్రాన్ని స్వీకరించిన రిజ్వీ మాట్లాడుతూ, నిరుద్యోగులకు కూడా న్యాయం చేయాల్సి ఉందని తెలిపారు. లేకపోతే వారు కోర్టుకు వెళ్తామని అంటున్నారని యూనియన్ నాయకులకు తెలిపారు. అందుకు యూనియన్ నాయకులు, కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేసిన తరువాత కొత్త వారికి అవకాశం కల్పించాలని సూచించారు. ఈ సూచనను పరిశీలిస్తామని రిజ్వీ హామీ ఇచ్చారు.

మిషన్‌భగీరథ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు దినసరి వేతనాలు నిర్ణయించడం అన్యాయం : టీఎస్‌జీసీఓఈఎఫ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మిషన్ భగీరథ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలవారీ వేతనాలకు బదులు దినసరి వేతనాలు నిర్ణయించడం అన్యాయ మని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (టీఎస్‌జీసీఓ ఈఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వెంకటేశ్, జె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

గురువారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మిషన్ భగీరథలో ల్యాబరేటరీలు, జిల్లా, డివిజన్, సబ్ డివిజన్, వాటర్ క్వాలిటీ సెంటర్లలో కెమిస్టులు, మైక్రో బయాలజిస్టు లు, ఫీల్డ్, ల్యాబ్ అసిస్టెంట్లు మొత్తం 350 మంది పనిచేస్తున్నారని తెలిపారు.

వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.9,500 నుంచి రూ17,500 వరకు వేతనాలు చెల్లిస్తున్నదని పేర్కొన్నారు.

దాన్ని రద్దు చేసి ఇక నుంచి దినసరి వేతనాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వారికి నెలవారీ వేతనాలనే తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.

హిజాబ్ నిరాకరణ.. విద్యార్థుల నిరసన

- ముంబయిలోని ఒక కాలేజీలో ఘటన

ముంబయి : మహారాష్ట్రలోని ఒక కాలేజీలో అమ్మాయిలు హిజాబ్ ధరించి రావటాన్ని సదరు విద్యాసంస్థ నిరాకరించటం ఆందోళనలకు దారి తీసింది. హిజాబ్‌తో ప్రవేశాన్ని నిరాకరించటానికి వ్యతిరేకంగా విద్యార్థులు నిరసనలకు దిగారు. ముంబయిలోని ఈశాన్య చెంబూర్ ప్రాంతంలోని ఎన్.జి ఆచార్య మరియు డి.కె మరాఠే కళాశాల వెలుపల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనలో పాల్గొన్నారు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యం వెల్లడించిన వివరాల ప్రకారం..కళాశాలలో ఈ ఏడాది నుంచి 11, 12 తరగతుల విద్యార్థులకు యూనిఫాంలను ప్రవేశపెట్టారు. బురఖాలు, హిజాబ్‌లు, టోపీలు, హెడ్‌స్కార్ఫ్‌లను నిషేధించారు. ఈనెల 1న 11వ తరగతి విద్యార్థిని యూనిఫామ్‌పై బురఖా ధరించి ఉన్నందున కళాశాల గేట్‌లోకి ప్రవేశించకుండా కాలేజీ యాజమాన్యం నిరాకరించింది. ఆ రోజు నుంచి విద్యార్థులు యూనిఫాం ధరించకపోతే కళాశాలలోకి ప్రవేశించడానికి అనుమతించలేదు. కళాశాలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గోవండి, శివాజీ నగర్ మురికివాడలలో నివసిస్తున్నారు. ఇక్కడ చాలా మంది ముస్లింలు నివసిస్తున్నారు. "వారు బురఖాలో ప్రవేశించడానికి అనుమతించకపోతే, చాలా మంది తమ విద్యను ఆపివేయవలసి వస్తుంది" అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనను వ్యక్తం చేశారు. గోవండి స్టేషన్‌లోని సీనియర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ సుదర్శన్ హెూన్వాడాజ్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు నిరసన స్థలానికి చేరుకున్నప్పుడు వారు ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. "వారి ప్రవేశాన్ని అనుమతించడానికి ప్రిన్సిపాల్ అంగీకరించారు. ఈ విషయంలో ఎటువంటి ఫిర్యాదు నమోదు చేయబడలేదు. బాలికలు తరగతి గదిలోకి ప్రవేశించే ముందు వారి బురఖాను తొలగించడానికి ప్రత్యేక గది ఉంటుంది. వచ్చే ఏడాది నుంచి కాలేజీ యూనిఫామ్‌ను తప్పనిసరి చేస్తుంది" అని పోలీసు అధికారి వెల్లడించారు.

'ఊరుకో' పరీక్ష

గురుకుల పోస్టుల పరీక్షల్లో గందరగోళం

- వందల కి.మీ తిరగలేక పలువురు ఎగ్జామ్స్‌కు దూరం
- టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్‌లో కొన్నింటికే హాజరు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లికి చెందిన అరుణ కుమారి ఏపీలోని ఒంగోలులో అత్తారింట్లో ఉంటోంది. రెండునెలల చిన్నారికి తల్లయిన ఆమె ఈ పరీక్షల కోసం టేకులపల్లి వచ్చింది. టీజీటీ, పీజీటీ పోస్టులకు అప్లై చేసిన ఆమెకు హైదరాబాద్‌లో ఒక సెంటర్, మరో ఐదు పేపర్లకు సత్తుపల్లిలో కేంద్రాలను కేటాయించడంతో పరీక్షలకు వెళ్ల లేక.. విరమించుకుంటున్నట్టు 'నవతెలంగాణ'కు తెలిపారు.

నిజామాబాద్‌కు చెందిన రమాదేవికి 4వ తేదీన టీజీటీ పరీక్ష మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మల్లాపూర్‌లో ఎగ్జామ్ ఉండగా 9న మేడ్చల్ జిల్లా మౌలాలిలో పీజీటీ ఉంది. ఆ తర్వాత 10న రంగారెడ్డి జిల్లా తట్టిఅన్నారంలో పీజీటీ మరో పేపర్, 14న టీజీటీ భాగ్యలతా నగర్, రంగారెడ్డి జిల్లా, 16న డిగ్రీ లెక్చరర్ (డీఎల్) కరీంనగర్‌లో, 19న జూనియర్ లెక్చరర్ (జేఎల్) ఓల్డ్ అల్వాల్, మేడ్చల్ జిల్లా, 21న మళ్లీ పీజీటీ మూడో పేపర్ నాచారం, తిరిగి టీజీటీ చివరి పేపర్ 22న కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో ఉండటంతో ఇద్దరు పిల్లల తల్లైన ఆమె.. ఇన్ని సెంటర్లు తిరగలేక, ఎగ్జామ్స్ అన్నీ ఓ క్రమపద్ధతిలో లేకపోవడంతో టీజీటీ, పీజీటీ, జేఎల్ పోస్టులకు మాత్రమే పరీక్షలు రాసి మిగిలిన డీఎల్ పరీక్షను విరమించుకోవాలని భావిస్తోంది. లేదంటే టీజీటీ, పీజీటీకే పరిమితం కావాలనుకుంటోంది.

ఖమ్మానికి చెందిన బిందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లిలోని వేర్వేరు కేంద్రాల్లో ఎగ్జామ్ సెంటర్స్ పడటంతో అన్ని పరీక్షలకు హాజరుకావడం కష్టమేనంటోంది. ఇలా రాష్ట్రంలో అనేక మంది అభ్యర్థులు అర్హతుండి, దరఖాస్తు చేసినా క్రమపద్ధతిలో లేని ఎగ్జామ్స్, వేర్వేరు ప్రాంతాల్లో సెంటర్ల మూలంగా పలు పోస్టుల పరీక్షలకు దూరమవుతున్న దుస్థితి ఉంది.

రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో 9,210 పోస్టుల భర్తీ కోసం 'తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ రిక్రూట్‌మెంట్ బోర్డు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొత్తం 9 రకాల పోస్టులకు పరీక్షలు..ఆగస్టు 1 నుంచి ప్రారంభమై 23వ తేదీతో ముగుస్తాయి. టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ ఎగ్జామ్స్, పీడీ, ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ తదితర పరీక్షల్లో.. పదో తరగతి అర్హతతో నిర్వహించే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మినహా మిగిలిన అన్ని పోస్టులకు మూడు పేపర్ల చొప్పున ఉంటాయి. పీజీ, బీఎడ్ చేసి టెట్, సెట్, నెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు నాలుగు పోస్టులకు అర్హులు. ఇలాంటి వారు జనరల్ స్టడీస్ కామన్ ఎగ్జామ్ ఒకటి రాస్తే సరిపోతుంది. మిగిలిన పోస్టుల కోసం రెండేసి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. అంటే ఈ నాలుగు పోస్టులకు అర్హత ఉన్న ఒక్కో అభ్యర్థి తొమ్మిదికి పైగా పరీక్షలు రాయాల్సి వస్తుంది. అన్నీ ఆన్‌లైన్ విధానం కావడంతో పరీక్ష కేంద్రాల కేటాయింపు గందరగోళంగా మారింది.

అర్హతున్నా.. అప్లై చేసినా.. పరీక్షలకు దూరం..

అన్ని అర్హతలుండి, అప్లై చేసినప్పటికీ ఊరుకో ఎగ్జామ్ సెంటర్ పడటంతో పలువురు ఈ పరీక్షల్లో కొన్నింటికి దూరం అవుతున్నారు. ఈ పరీక్షలన్నీ ఒకేచోట, టీజీటీ తర్వాత పీజీటీ, ఆ తర్వాత జేఎల్, డీఎల్ ఉంటే పర్వాలేదు. కానీ కలగూర గంపలాగా రాష్ట్రంలోని పట్టణాలకో సెంటర్ చొప్పున కేటాయించడంతో ముఖ్యంగా మహిళా అభ్యర్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితి ఉంది. దాంతో కొందరు టీజీటీ, పీజీటీ ఎగ్జామ్స్ రాసి, జేఎల్, డీఎల్ పరీక్షల ను విరమించుకుంటున్నారు. మరికొందరు జేఎల్, డీఎల్ పరీక్షలకు హాజరై పీజీటీ, టీజీటీ రాయడం మానేస్తున్నారు. పరీక్షా కేంద్రాల దూరభారంతో పిల్లల తల్లులు, గర్భిణులు పలువురు మొత్తానికే పరీక్షలకు దూరమవుతున్నారు. దాంతో పరీక్షా విధానంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఎందుకిలా.. ప్రత్యామ్నాయం లేదా..??

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగుల మెప్పు పొందాలనే తలంపుతో ప్రభుత్వం ఈ విపరీత చర్యకు దిగినట్టు అభ్యర్థుల నుంచి విమర్శలు వస్తున్నాయి. పలువురు గురుకుల బోర్డు కన్వీనర్ డాక్టర్ మల్లయ్య బట్టుకు ఫోన్ చేస్తున్న ఉదంతాలూ ఉన్నాయి. ఎవరు ఫోన్ ఆన్సర్ చేస్తే వారితో తమ ఆవేదన చెబుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మొత్తంగా 150 సెషన్స్‌లో నిర్వహించాల్సిన ఈ ఎగ్జామ్స్‌ను రోజుకు మూడు సెషన్స్ చొప్పున 50 సెషన్స్‌లో నిర్వహిస్తుండటం వల్లనే ఈ సమస్య వచ్చిపడినట్టు అభ్యర్థులు చెబుతున్నారు. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ పరీక్షల విషయంలో అబాసుపాలైన ప్రభుత్వం గురుకుల పోస్టుల భర్తీలోనూ అబాసుపాలవుతోంది. మొన్న నిర్వహించిన ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పరీక్ష తెలుగులో నిర్వహించాల్సి ఉండగా ఇంగ్లీష్‌లో పెట్టి విమర్శల పాలైంది.

బిజినెస్

మార్కెట్లను వీడని అమెరికా భయాలు

- ఫిచ్ రేటింగ్ కోత ఎఫెక్ట్
- సెన్సెక్స్ మరో 500 పాయింట్లు ఫట్
- రెండు రోజుల్లో రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబయి : అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అమెరికా పరపతికి కోత పెట్టడంతో రెండో రోజూ ప్రపంచ మార్కెటు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. గురువారం సెషన్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 542 పాయింట్లు లేదా 0.82 శాతం పతనమై 65,241కు పడిపోయింది. అదే బాటలో ఎన్ఎస్ఈ నిఫ్టీ 145 పాయింట్లు లేదా 0.74 శాతం కోల్పోయి 19,382 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 64,963, నిఫ్టీ 19,296 కనిష్ట స్థాయిలను తాకాయి. వరుసగా రెండు రోజుల ఒత్తిడితో సెన్సెక్స్ 1200 పాయింట్ల మేర నష్టపోయింది. దీంతో దాదాపు రూ.5 లక్షల కోట్ల మేర మదుపరుల సంపద ఆవిరైంది.

అమెరికా రుణ పరపతి రేటింగ్‌ను ఫిచ్ 'ఎఎఎ' నుంచి ఎఎప్లస్‌కు తగ్గించడంతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. అమెరికా మార్కెట్లు అయినా డోజోన్స్, నాస్ డాక్, ఆస్ట్రేలియాకు చెందిన ఎఎస్ఎక్స్, షాంఘై కాంపోజిట్, హాంకాంగ్‌కు చెందిన హాంగ్‌సెంగ్, జపాన్ నిక్కీ కూడా నష్టపోయాయి. దీనికి తోడు అమెరికా బాండ్ రాబడులు పెరగడం, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి పరిణామాలు ప్రతికూల సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. ప్రముఖ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ భారత్ మార్కెట్ల రేటింగ్‌ను ఓవర్ వెయిట్‌గా మార్చి.. చైనా రేటింగ్‌ను ఈక్వల్ వెయిట్‌కు కుదించింది. అయినా ఇవేవీ మదుపరుల్లో విశ్వాసాన్ని నింపలేకపోయాయి.

నిఫ్టీ-50లో 30 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. వాటిలో టైటాన్, బజాజ్ ఫిన్ సర్వ్, ఓఎన్‌జీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, నెస్లే ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, యుపిఎల్, బజాజ్ ఫినాన్స్ అధికంగా నష్టాలు చవి చూసిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. బీఎస్ఈలో మిడ్ క్యాప్ 0.14 శాతం, స్మాల్ క్యాప్ 0.23 శాతం చొప్పున తగ్గాయి. నిఫ్టీలో ఫార్మా, మీడియా సూచీలు ఒకశాతం చొప్పున రాణించగా.. మిగితా రంగాలన్నీ నష్టపోయాయి.

భారత మార్కెట్లోకి వెల్‌ఫైర్

- ధర రూ.1.19 కోట్లు



న్యూఢిల్లీ : టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) భారత మార్కెట్లోకి తన లగ్జరీ కార్ వెల్‌ఫైర్ ఎంపివిని విడుదల చేసింది. ఇందులో హై గ్రేడ్, విఐపి గ్రేడ్ అనే వేరియంట్లను ఆవిష్కరించింది. గురువారం దీనిని టికెఎం సీఈఓ మసకాజు యోషిమురా, వైస్ ప్రెసిడెంట్ అథూల్ సూద్, ఎగ్జిక్యూటివ్ విపి టడసి అసజుమా ఆవిష్కరించారు. ఎక్స్ షోరూం ధరను రూ.1.19 కోట్లుగా నిర్ణయించింది. ఎక్స్‌టీరియర్ స్టైలింగ్, మూడు ఇంటీరియర్ థీమ్‌లతో దీన్ని రూపొందించినట్లు ఆ కంపెనీ తెలిపింది. విఐపి గ్రేడ్ ధరను రూ.1.30 కోట్లుగా ప్రకటించింది. 2.5 లీటర్ 4 సిలిండర్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఇంజన్‌తో ఆవిష్కరించిన ఈ కార్ లీటర్‌కు 19.28 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని వెల్లడించింది. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీ కెమెరా, హిల్ అసిస్ట్ కంట్రోల్‌తో పాటు, వెల్‌ఫైర్ లేన్ కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, బ్లైండ్ స్పాట్ మానిటర్, హైబీమ్ అసిస్ట్ వంటి భద్రత ఫీచర్లతో దీన్ని తీసుకొచ్చింది. వచ్చే పండగ సీజన్ నుంచి డెలివరీలను ప్రారంభించనున్నామని ఆ కంపెనీ తెలిపింది.

సేల్స్‌ఫోర్స్‌లో 10 శాతం ఉద్యోగులపై వేటు

వాషింగ్టన్ : క్లౌడ్ ఆధారిత సాఫ్ట్‌వేర్ కంపెనీ సేల్స్‌ఫోర్స్ మరోసారి ఉద్యోగుల తొలగింపునకు పాల్పడనున్నది. ప్రపంచ వ్యాప్తంగా తమకున్న ఉద్యోగుల్లో 10 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్టు తెలిపింది. ఏడాది ప్రారంభంలోనూ ఈ సంస్థ 7వేల మంది సిబ్బందిని ఇంటికి పంపించింది. ఈసారి సేల్స్, కస్టమర్ సక్సెస్ టీమ్ సభ్యుల ఉద్యోగాలు ప్రభావితం కానున్నాయని ఆ కంపెనీ వర్గాలు తెలిపాయి. 2024 ఆర్థిక సంవత్సరం చివరినాటికి 8000 మంది ఉద్యోగులను సాగనంపాలని సేల్స్‌ఫోర్స్ ప్రణాళికలు రూపొందించుకున్నట్లు పేర్కొంది.

భారత రేటింగ్‌ను పెంచిన మోర్గాన్ స్టాన్లీ

న్యూఢిల్లీ : భారత రేటింగ్‌ను మెరుగుపర్చినట్టు మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. ఆసియా దేశాల ఆర్థిక వ్యవస్థల రేటింగ్‌లలో ఈ సంస్థ పలు కీలక మార్పులు చేసింది. భారత్ రేటింగ్‌ను మరింత మెరుగుపర్చి 'ఓవర్‌వెయిట్'గా నిర్ణయించినట్టు తెలిపింది. దేశ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల అజెండా మూలధన వ్యయాలు, లాభాల విషయంలో సానుకూల దృక్పథంలో ఉన్నాయని పేర్కొంది. చైనా రేటింగ్‌ను 'ఈక్వల్ వెయిట్'కు తగ్గించింది. చైనా ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీలతో అక్కడి మార్కెట్లు ఊపందుకున్నాయని తెలిపింది. అందువల్ల మదుపర్లు అప్రమత్తంగా ఉండి.. లాభాల స్వీకరణకు మొగ్గుచూపాలని పేర్కొంది.

పవన్ ముంజల్ ఇంట్లో అనధికార విదేశీ కరెన్సీ లభ్యం..!

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటో కార్ప్ అధినేత పవన్ కుమార్ ముంజల్ నివాసాల్లో అనధికార విదేశీ కరెన్సీ, పసిడి, వజ్రాభరణాలు లభ్యం అయ్యాయి. బినామి కంపెనీలతో లావాదేవీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రెండు రోజుల పాటు ముంజల్ నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేశారు. ఈ సోదాల్లో రూ.25 కోట్ల విలువైన విదేశీ కరెన్సీ, బంగారం, వజ్రాభరణాలను అధికారులు జప్తు చేశారు. బుధవారం జరిపిన తనిఖీల్లో లభించిన పత్రాలకు సరైన ఆధారాలు లేవని ఈడీ అధికారులు తెలిపారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ), కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల బోర్డు (సీబీఐసీ) ఫిర్యాదు ఆధారంగా మానీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ)లోని వివిధ సెక్షన్ల కింద హీరో మోటో చైర్మెన్, సహా ఉన్నతాధికారులపై ఈడీ కేసులు నమోదు చేసింది. 2014-15 నుంచి 2018-19 మధ్య సాల్ట్ ఎక్స్‌పీరియన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో వివిధ దేశాలకు రూ.54 కోట్ల విలువైన విదేశీ కరెన్సీ చట్టవిరుద్ధంగా ఎగుమతి చేశారని ఇడి గుర్తించింది. ఈ మొత్తం పవన్ కుమార్ ముంజాల్ వ్యక్తిగత ఖర్చుల కింద చూపారని ఆరోపణ.

పెరుగుతోన్న కండ్లకలక వ్యాధులు

- మెడిబడ్డీ డేటా వెల్లడి

హైదరాబాద్ : దేశంలో గత కొన్ని వారాలుగా భారీ వర్షాలు, వరదలు సంభవించడంతో ఇటీవల కండ్లకలక, కంటి ఫ్లూ సంబంధిత కేసుల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు మెడిబడ్డీ వెల్లడించింది. భారతదేశంలోని అతిపెద్ద డిజిటల్ హెల్త్‌కేర్ ప్లాట్‌ఫారమ్ అయినా మెడిబడ్డీ డాటా ప్రకారం.. వివిధ కంటి సంబంధిత సమస్యల కోసం వైద్య సలహాలను కోరుకునే రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. కండ్లకలక, కండ్లు ఎర్ర బడి నీరు కారటం , నిద్ర లేచిన వెంటనే కండ్లు అంటుకునే ఉండటం వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. తమ వేదికపై గత సంవత్సరం 1 శాతం నేత్ర వైద్యుల సంప్రదింపులు ఉంటే ప్రస్తుతం అది 2.6 శాతానికి పెరిగిందని మెడిబడ్డీ వెల్లడించింది. ఇది భారీగా 137 శాతం పెరుగుదల చోటు చేసుకుందని పేర్కొంది. వయసు వారీగా చూస్తే 49 శాతం పెరుగుదలతో 25 మరియు 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకులలో కండ్లకలక అధికంగా కనిపిస్తుందని మెడిబడ్డీ మెడికల్ ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ గౌరి కులకర్ణి తెలిపారు.